www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 25-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 357 | వరంగల్

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి మ. 12.31 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తర ఉ. 10.39 తదుపరి హస్త; వర్జ్యం: రా.8.03-9.51; దుర్ముహూర్తం: మ.12.46-1.34, మ.3.11-3.59; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.19, సూర్యాస్తమయం: 6.24

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రుణమాఫీపై రేవంత్ చెప్పిందొకటి.. చేస్తున్నదొకటి



రైతులకు బ్యాంకు నోటీసులపై స్పందించరేం?

సీఎంను ప్రశ్నించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆ యూట్యూబ్ చానళ్లపై క్రిమినల్ కేసులు

అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు: కేటీఆర్

13



బీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌పై భూ కబ్జా కేసు

నకిలీ డాక్యుమెంట్లు, ఇంటి నంబర్లు సృష్టించి భూమిని కబ్జా చేశారంటూ 'నవయుగ' కంపెనీ ఫిర్యాదు

సంతోష్‌తోపాటు మరొకరిపై కేసు పెట్టిన పోలీసులు

నేను కబ్జాకు పాల్పడలేదు.. స్థలాన్ని కొనుగోలు చేశా

రాజకీయ దురుద్దేశంతో నాపై తప్పుడు కేసు: సంతోష్

బంజారాహిల్స్/హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌పై ఫోర్జరీ, భూ కబ్జా కేసు నమోదైంది. నకిలీ డాక్యుమెంట్లు, ఇంటి నంబర్ సృష్టించి కోట్ల రూపాయల విలువ చేసే తమ స్థలాన్ని సంతోష్‌కుమార్ కబ్జా చేశారంటూ నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ చేసిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఆయనతోపాటు మరొకరిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ.. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 14, సర్వే నంబరు 129/54లో కరణ్ దూబే అనే వ్యక్తి వద్ద 970 చదరపు గజాల స్థలాన్ని, ఆయన భార్య భారతీ దూబే వద్ద 380 చదరపు గజాల స్థలాన్ని 2010లో కొనుగోలు చేసింది. మొత్తం 1350 చదరపు గజాల స్థలానికి 30 ఏళ్లకుగాను నవయుగ కంపెనీ ఈసీ కూడా తీసుకుంది. అయితే స్థలం కొనుగోలు చేసినప్పటి నుంచి ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాగా, కంపెనీ కొనుగోలు చేసిన స్థలంలో వారికే తెలియకుండా రెండు గదులు వెలిశాయి. దీనిపై కంపెనీ

మిగతా 10వ పేజీలో...

కేజ్రీవాల్ టార్గెట్‌గా

కవిత విచారణ!

- ఢిల్లీ సీఎంకు ఉచ్చు బిగించే దిశగా దర్యాప్తు
- కవితపై రోజంతా ఈడీ ప్రశ్నల వర్షం
- వాంగ్మూలాలు ఆమె ముందుంచి ప్రశ్నలు
- లిక్కర్ స్కాంలో మేక శరణ్ పాత్రపై ఆరా
- ఎనిమిదో రోజూ కవిత విచారణ
- నిజామాబాద్‌లో ఈడీ బృందాల దర్యాప్తు?
- కవితను కలిసిన కుటుంబీకులు, న్యాయవాది



న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు మరింత పెంచింది. ఈ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ప్రధాన కుట్రదారుగా నిరూపించేందుకు కావాల్సిన అన్నిరకాల ఆధారాల సేకరణకు కార్యాచరణను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మద్యం పాలసీ రూపకల్పన, ముడుపుల వ్యవహారంలో కేజ్రీవాల్‌కు ఉచ్చు బిగించేందుకుగాను తమ అదుపులో ఉన్న ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు ఆదివారం రోజంతా విచారించినట్లు తెలిసింది. ఎనిమిదో రోజు విచారణలో భాగంగా.. మద్యం విధానంలో లబ్ధి పొందినవారి నుంచి కేజ్రీవాల్ నేరుగా ముడుపులు స్వీకరించిన అంశంపై ఆమెను గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లు సమాచారం. రూ.100 కోట్ల ముడుపుల చెల్లింపు విషయంలో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా.. సౌత్ గ్రూప్

మిగతా 13వ పేజీలో...

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన



ప్రజల తాగునీటి వెతలు తీర్చాలని మంత్రి అతిశికి ఆదేశాలు

ఘటనపై ఈడీ సీరియస్

కొనసాగిన కేజ్రీవాల్ విచారణ

ఆరు గంటలపాటు ప్రశ్నలు

నిబంధనల ప్రకారం జైలు నుంచి పాలన కష్టమే

సీఎం అరెస్టును లెఫ్టినెంట్ గవర్నర్ గృహనిర్బంధంగా మార్చే సమస్యకు పరిష్కారం

కేజ్రీ సతీమణి సునీతకు సీఎం పగ్గాలంటూ ఊహాగానాలు

2

31న ఇండియా కూటమి మహార్యాలీ


కేజ్రీ అరెస్టుపై సంఘటిత ఉద్యమం.. రాంలీలా మైదానంలో భారీ సభ

మద్యం కేసులో అరెస్టైన శరత్‌రెడ్డి బీజేపీకి 60 కోట్లిచ్చి విడుదలయ్యారు

కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చారు.. ఢిల్లీ మంత్రి గోపాల్ ఆరోపణలు

ఆప్, కాంగ్రెస్, సీపీఎం సంయుక్త మీడియా సమావేశం

2



ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ నేత!

వెల్లడించిన భుజంగరావు, తిరుపతన్న రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న పోలీసులు

నేడు ఇద్దరు నేతలకు నోటీసులు ఇచ్చే అవకాశం

ప్రభాకర్‌రావు కీలక పాత్రధారి!

చంచల్‌గూడ జైలుకు భుజంగరావు, తిరుపతన్న

ముగిసిన ప్రణీత్‌రావు పోలీసు కస్టడీ

సూత్రధారులపై ఫోకస్.. త్వరలో మరికొందరి అరెస్ట్?

ఐన్యూస్ ఎండీ శ్రవణ్‌రావు ఇంట్లో స్టోరేజీ డివైజ్‌ల సీజ్

హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్‌ల వ్యవహారం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది.! ఈ వ్యవహారం వెనక బీఆర్ఎస్ కీలక నేత ఒకరు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న రిమాండ్ రిపోర్టులో పశ్చిమ మండలం పోలీసులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆ కీలక నేతతో పాటు మరో నాయకుడికి నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. వారు ఎవరనే విషయాన్ని వెల్లడించకున్నా సోమవారం వారికి సీఆర్పీసీ సెక్షన్ 41 కింద నోటీసులు జారీ చేసి, విచారించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి వరకు

మిగతా 10వ పేజీలో...

మునుగోడు ఉప ఎన్నికకూ లింకు?

ఫోన్ ట్యాపింగ్‌తో ప్రతిపక్షాల వ్యూహాలను పసిగట్టి బీఆర్ఎస్‌కు సమాచారం!.. విపక్షాల డబ్బు రాకుండా పట్టివేత!



కాంగ్రెస్ గ్యారెంటీలు రావు

రాహుల్ జన్మలో ప్రధాని కాలేరు: కిషన్‌రెడ్డి

వరంగల్ నుంచి ఆరూరి

ఖమ్మంలో తాండ్ర వినోద్‌రావు

13

లోక్‌సభ బరిలో కంగనా రనౌత్

- హిమాచల్ నుంచి పోటీకి సినీనటి
- మేనకకు టికెట్, వరుణ్‌కు మొండిచేయి
- కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయకు అవకాశం
- 111 మందితో బీజేపీ 5వ జాబితా

2

గేట్లన్నీ ఓపెన్!

బీఆర్ఎస్ నుంచి వచ్చే నేతలకు పచ్చజెండా ఊపేందుకు సిద్ధమైన సీఎం?

వచ్చే ఎన్నికల్లో 'కారు'పార్టీ కట్టడికి ప్రణాళిక

వారం, పదిరోజుల్లో పెద్ద ఎత్తున వలసలు!

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న ప్రచారాన్ని ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకెళ్లాలని నిర్ణయం

మైనారిటీలు, బీసీల ఓటర్లపై కాంగ్రెస్ గురి

వారిని ఆకట్టుకునేలా పటిష్ఠ కార్యాచరణ

కలిసికట్టుగా పనిచేసి గెలిపించండి

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల నేతలతో సీఎం రేవంత్



మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల నేతలతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి, దామోదర

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న బీఆర్ఎస్ ముఖ్యులకు పచ్చజెండా ఊపేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? వచ్చే వారం పది రోజుల్లో కాంగ్రెస్‌లోకి గులాబీ నేతల వలస పెద్ద ఎత్తున జరగబోతోందా? వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 'కారు' పార్టీ కట్టడికి రంగం సిద్ధమవుతోందా? అంటే.. రాజకీయ వర్గాలు ఈ ప్రశ్నలన్నింటికీ ఔననే సమాధానమే ఇస్తున్నాయి. అదే సమయంలో.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనన్న ప్రచారాన్నీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాని సీఎం రేవంత్ భావిస్తున్నట్టు సమాచారం. అభ్యర్థుల ప్రకటన తర్వాత.. బూత్ స్థాయి నుంచి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి వరకూ ఏర్పాటు చేయనున్న మూడంచెల సమన్వయ కమిటీల వ్యవస్థ ద్వారా ఈ ప్రచారాన్ని ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల్లో మైనారిటీ, బీసీ ఓటర్లను తమవైపు తిప్పుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సమీకరణాలను బట్టి ఈ రెండు వర్గాలూ పూర్తిస్థాయిలో కాంగ్రెస్ వైపే మొగ్గు చూపడానికి అవకాశాలు ఎక్కువని.. కాకపోతే, వారిని పార్టీ వైపు మరింతగా ఆకర్షితులను చేయడానికి మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 13వ పేజీలో...



మత్తు మాటున అత్యాచారం

జగిత్యాల ఉదంతంలో బాలికపై గంజాయి చాక్లెట్‌తో వల

ప్రేమించానని.. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అఘాయిత్యం

అతడి ఇద్దరు స్నేహితులు కూడా!

ముగ్గురిపైనా పోక్సో, నార్కోటిక్ చట్టం కింద కేసు నమోదు

జగిత్యాల టౌన్, మార్చి 24: సంచలనం సృష్టిస్తున్న జగిత్యాల గంజాయి కేసులో పలు విషయాలు బయటపడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద బాలికలు, వసతి గృహాల్లోని విద్యార్థినులకు మత్తు అలవాటు చేసి, రేవ్ పార్టీలకు తరలించిన ఉదంతంలో.. ఓ బాలికపై యువకుడు, అతడి ఇద్దరి స్నేహితులు అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. ఈ బాధితురాలి వింత ప్రవర్తన

మిగతా 14వ పేజీలో...

భర్త జీవితంతో ఆటాడుకుంది..!

కూడబెట్టుకున్న 16 లక్షల్ని ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టిన భార్య

ఆత్మహత్యకు సిద్ధపడిన భర్త

అవే గేమ్స్ ఆడి రెట్టింపు డబ్బు ఇస్తానని భార్య ధీమా

మందలించబోయిన స్నేహితులపైనా ఆగ్రహం

అందరి పేర్లు రాసి.. చచ్చిపోతానని బెదిరింపు

భువనగిరి పట్టణంలో ఘటన

3

మెస్ చార్జీలు పెరిగేదెన్నడో?

పెంచేస్తున్నామంటూ గత సర్కారు హడావుడి

చార్జీలను ఖరారు చేసి, అమలు చేయని వైనం

బిల్లులు పెరిగితేనే విద్యార్థులకు నాణ్యమైన భోజనం

చార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాల డిమాండ్



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలు; గురుకులాల్లో మెస్ చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. చార్జీలు పెంచుతున్నామంటూ గత ప్రభుత్వం హడావుడి చేసినా.. అమలు మాత్రం చేయలేదు. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల పరిధిలో ఉన్న వసతి గృహాలతో పాటు సంక్షేమ గురుకులాల్లో పాత చార్జీలే అమలవుతున్నాయి. దీంతో నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు దాటిన నేపథ్యంలో మెస్ బిల్లుల పెంపు అంశంపై చర్చ మొదలైంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల పరిధిలో ఉన్న వసతి గృహాలతో పాటు సంక్షేమ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మెస్ (డైట్) చార్జీలు ఐదేళ్లుగా పెరగలేదు. కొవిడ్ అనంతరం నిత్యావసర ధరలతోపాటు రవాణా ఖర్చులూ పెరిగాయి. అదేసమయంలో ప్రస్తుతం చెల్లిస్తున్న ధరలు సరిపోవడం లేదన్న సాకు చూపి.. కాంట్రాక్టర్లు హాస్టళ్లు, గురుకులాలకు నాసిరకమైన నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాసిరకపు వస్తువుల వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. దీంతో ఉన్నతాధికారులు హాస్టళ్లు, గురుకులాల మెస్ బిల్లులను పెంచాలని గత ప్రభుత్వానికి ప్రతిపాదించారు. బిల్లుల పెంపుపై 2023 ఫిబ్రవరిలో నాటి మంత్రులు ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం ఇదే అంశంపై 2023 మార్చి 1న మరోసారి

మిగతా 10వ పేజీలో...



పెద్దలకు టీబీ వ్యాక్సిన్!

2

మానవుల నుంచి సేకరించిన క్షయ బ్యాక్టీరియాతో.. తొలిసారి తయారుచేసిన స్పానిష్ కంపెనీ బయోఫాబ్రీ

ఆ సంస్థతో కలిసి ట్రయల్స్ చేపట్టిన భారత్ బయోటెక్

ప్రపంచంలోనే తొలి లైవ్ ఎటెన్యుయేటెడ్ టీబీ వ్యాక్సిన్

ప్రస్తుతానికి సేఫ్టీ ట్రయల్స్.. వచ్చే ఏడాది ఎఫికసీ ట్రయల్స్

'శివశక్తి' ఇక అధికారికం

జాబిల్లిపై విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి మోదీ నామకరణం

అధికారికంగా ఆమోదించిన అంతర్జాతీయ ఖగోళ సంఘం



బెంగళూరు, మార్చి 24: చంద్రయాన్-3 జాబిల్లిపై దిగి చరిత్ర సృష్టించింది. ఈ విజయానికి గుర్తుగా విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశాన్ని 'శివ శక్తి'గా పిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది ఆగస్టు 23న ప్రకటించారు. దాదాపు 7 నెలల తర్వాత

మిగతా 2వ పేజీలో...



బీజేపీలో చేరిన వాయుసేన మాజీ చీఫ్ బదౌరియా

2



ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్

మంటలు చెలరేగి నలుగురు చిన్నారుల దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో విషాదం

2

ఆంధ్రజ్యోతి

వాట్సాప్‌కు ఏఐ హంగు

ఇమేజ్ ఎడిటింగ్, 'ఆస్క్ మెటా' ఫీచర్లు.. త్వరలో అందుబాటులోకి!

న్యూఢిల్లీ, మార్చి 24: ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న వాట్సాప్.. తాజాగా ఏఐ హంగులు కూడా సమకూర్చుకునే పనిలో పడింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఇమేజ్ ఎడిటింగ్ టూల్‌ను, మనకు వచ్చే రకరకాల సందేహాలకు సమాధానం ఇచ్చే 'ఆస్క్ మెటా' ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు వాట్సాప్ బేటాఇన్ఫో ప్రకటించింది. ప్రస్తుతానికి ఏఐ ఆధారిత ఇమేజ్ ఎడిటింగ్ కోసం మనం క్రోమ్, బింగ్ లాంటి బ్రౌజర్లనే వాడాల్సి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వస్తే.. వాట్సాప్‌లోనే ఏఐ సాయంతో మన చిత్రాలను ఎడిట్ చేసుకోవచ్చు. వాటి నేపథ్యాలను మార్చుకోవచ్చు. అలాగే.. ఇప్పుడు మనకు ఏదైనా సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేసి చూసుకుంటాం కదా! అలా.. వాట్సాప్‌లో ఆస్క్ మెటా అందుబాటులోకి వస్తే మన సందేహాలన్నింటినీ అక్కడే తీర్చుకోవచ్చు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఈ ఫీచర్లను త్వరలోనే తొలుత బీటా వర్షన్ వాడేవారికి, తర్వాత అందరికీ అందుబాటులోకి తేనున్నట్టు సమాచారం.



కుజగ్రహం మీద కార్ రేస్ జరుగుతున్నట్టు ఫొటో రూపొందించాలని అడిగితే ఏఐ ఇచ్చిన బొమ్మ

'శివ శక్తి' ఇక అధికారికం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ ఖగోళ సంఘం (ఐఏయూ) ఈ నెల 19న ఆ పేరును అధికారికంగా ఆమోదించింది. ఐఏయూ ఆమోదించిన గ్రహాల పేర్లు, వాటి వివరాల గురించి సమగ్రమైన సమాచారాన్ని అందించే 'గెజిటరీ ఆఫ్ ప్లానెటరీ నోమెన్‌క్లేచర్'.. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి 'శివ శక్తి' అనే పేరును ఐఏయూ వర్కింగ్ గ్రూప్ ఫర్ ప్లానెటరీ సిస్టమ్ ఖరారు చేసిందని పేర్కొంది. దీంతో ఇస్రో విజయానికి గుర్తుగా 'శివ శక్తి' పేరు అధికారికంగా ఖరారైనట్టయింది. 'ప్రకృతి పురుషుడు (శివుడు), స్త్రీ (శక్తి) అర్థాలను వర్ణించే భారతీయ పురాణాల నుంచి సేకరించిన పదమే 'శివ శక్తి' అని గెజిటరీ ఆఫ్ ప్లానెటరీ నోమెన్‌క్లేచర్ వివరించింది. కాగా, అంతరిక్షంలో భారత ఆధిపత్యం కేవలం చంద్రయాన్-3కే పరిమితం కాలేదని, ఖగోళ శాస్త్రవేత్తలు 'శివ', 'శక్తి' అనే పేర్లతో పాలపుంతలోని రెండు పురాతన నక్షత్రాల సమూహాలను గుర్తించారని పలువురు కీర్తిస్తున్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	38.5	25.6
ఖమ్మం	38.0	25.0
నల్లగొండ	37.5	24.2
రామగుండం	37.2	23.8
సంగారెడ్డి	36.0	26.0
హనుమకొండ	35.0	22.5

భారత్‌తో వాణిజ్య సంబంధాల పునరుద్ధరణను పరిశీలిస్తాం..

» పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్

న్యూఢిల్లీ, మార్చి 24: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌కు భారత్ విలువ తెలిసివస్తోంది. భారత్‌తో మళ్లీ వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు తహతహలాడుతున్నట్టు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం రద్దు చేసినప్పటి నుంచి పాక్ భారత్‌తో వాణిజ్య సంబంధాలను నిలిపివేసింది. అయితే, ఇప్పుడు భారత్‌తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించే అంశాన్ని తీవ్రంగా పరిశీలించనున్నట్టు పాక్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ ఇషాక్ దార్ శనివారం లండన్‌లో ఓ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లోని వ్యాపారులు భారత్‌తో వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని కోరుకుంటున్నారని దార్ చెప్పారు. పాకిస్థాన్‌లో షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఇటీవలే కొలువుదీరగా.. ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా షరీఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆయన మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఈనేపథ్యంలో దౌత్యపరమైన సంబంధాలపై ఆశలు చిగురిస్తున్నా యి. క్షీణిస్తున్న తమ దేశ ఆర్థిక వ్యవస్థను మళ్లీ పట్టాలెక్కించడంపై షరీఫ్ ప్రభుత్వం దృష్టిసారించింది.

లోక్‌సభ బరిలో కంగన

» మండీ నుంచి పోటీ..111 మందితో బీజేపీ 5వ జాబితా

» 'సందేశ్‌ఖాళీ' బాధితురాలు రేఖాపాత్రకు బసీర్‌హాట్ సీటు



న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తన అభ్యర్థుల ఐదో జాబితాను ఆదివారం ప్రకటించింది. 18 రాష్ట్రాలకు చెందిన 111 మందికి ఈ జాబితాలో చోటు లభించింది. కాగా బీజేపీలో ఆదివారమే చేరిన కాంగ్రెస్ మాజీ నేత, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్‌కు టికెట్ దక్కటం విశేషం. హరియాణాలోని కురుక్షేత్ర నుంచి ఆయన బరిలో ఉండనున్నారు. సినీనటి కంగనా రనౌత్‌కు బీజేపీ తొలిసారిగా అవకాశం ఇచ్చింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి కంగన.. ఎన్నికల రాజకీయాల్లో అరంగేట్రం చేయనున్నారు. రామాయణ్ సీరియల్‌లో రాముడి పాత్ర పోషించిన అరుణ్ గోవిల్‌కు మీరట్ సీటు కేటాయించారు. పశ్చిమ బెంగాల్ సందేశ్‌ఖాళీ ఘటన బాధితురాలైన రేఖాపాత్రకు బసీర్‌హాట్ నియోజకవర్గం నుంచి, అదే రాష్ట్రంలో మమత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులిచ్చిన కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయకు తమ్లుక్ నియోజకవర్గం నుంచి అవకాశం ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ నుంచి కేంద్ర మాజీ మంత్రి మేనకాగాంధీకి తిరిగి అవకాశం కల్పించినప్పటికీ.. ఆమె కుమారుడు వరుణ్‌గాంధీకి మొండిచేయి చూపారు. వరుణ్ గాంధీ సిటింగ్‌స్థానం ఫిలిబిట్‌ను.. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన జితేంద్ర ప్రసాదకు కేటాయించారు. సైనికదళాల మాజీ ప్రధానాధిపతి జనరల్ వీకే సింగ్‌కు ఆయన సిటింగ్ స్థానమైన ఘజియాబాద్‌లో సీటు నిరాకరించారు. జార్ఖండ్‌లో మాజీ సీఎం హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్‌కు డుంకా నుంచి అవకాశమిచ్చారు.

బీజేపీలోకి ఎయిర్‌ఫోర్స్ మాజీ చీఫ్ బదౌరియా



న్యూఢిల్లీ, మార్చి 24 : భారత వాయుసేన మాజీ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్కేఎస్ బదౌరియా ఆదివారం బీజేపీలో చేరారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బదౌరియా వాయుసేన నుంచి చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ హోదాలో 2021లో పదవీ విరమణ పొందారు. బీజేపీలో చేరిన సందర్భంగా బదౌరియా ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. తన సర్వీసులో చివరి పదేళ్ల కాలం సువర్ణాధ్యాయం అన్నారు. త్రివిధ దళాలను మరింత శక్తిమంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. బదౌరియా లోక్‌సభ ఎన్నికల బరిలో యూపీ నుంచి పోటీ చేసే అవకాశం ఉంది.

ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్

» మంటలు చెలరేగి యూపీలో నలుగురు చిన్నారుల మృతి

మీరట్, మార్చి 24: ఇంట్లో ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిన్నారులు మృతి చెందారు. ఉత్తర్‌ప్రదేశ్ మీరట్‌లోని పల్లవపురంలో ఈ విషాద ఘటన జరిగింది. మృతులను సారిక (10), నిహారిక (8), సంస్కార్ (6), కాలూ (4)గా పోలీసులు గుర్తించారు. ఇంట్లో ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్ జరిగిందని, మంటలు దుప్పటికి అంటుకుని ఒక్కసారిగా వ్యాపించడంతో ఈ దుర్ఘటన జరిగిందని మృతి చెందిన చిన్నారుల తండ్రి జానీ తెలిపారు. ఈ ప్రమాదంలో జానీ త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆయన భార్య బబిత తీవ్రంగా గాయపడి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకుంటే 2 లక్షలు

» ప్రోత్సాహకం ప్రకటించిన ఝార్ఖండ్ సర్కారు

రాంచీ, మార్చి 24: వితంతువుల గౌరవ ప్రతిష్ఠలు, జీవన ప్రమాణాలను పెంచేందుకు ఝార్ఖండ్ ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రారంభించింది. దీని ప్రకారం పునర్వివాహం చేసుకున్న వితంతువులకు రూ.2 లక్షలు ప్రోత్సాహకంగా ఇవ్వనుంది. వితంతు పునర్వివాహ ప్రోత్సాహక పథకం కింద ఈ ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి మనోజ్ కుమార్ వెల్లడించారు. ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసే వితంతువులకు వివాహ వయసు వచ్చి ఉండాలి. మొదటి భర్త చనిపోయినట్టు డెత్ సర్టిఫికెట్ సమర్పించాలి. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లించేవారికి అర్హత లేదు. పునర్వివాహం చేసుకున్న ఏడాదిలోగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

కృష్ణగిరిలో వీరప్పన్ కుమార్తె పోటీ

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి వీరప్పన్ తమిళనాడులోని కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేయనున్నారు. ఆమెకు సినీ దర్శకుడు నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) కన్వీనర్ సీమాన్ కృష్ణగిరి సీటు కేటాయించారు. నాలుగేళ్ల క్రితం విద్యారాణి బీజేపీలో చేరినప్పటికీ ఆమెకు ఎలాంటి పార్టీ పదవులు ఇవ్వలేదు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. దీనితో ఆమె బీజేపీకి రాజీనామా చేసి, ఎన్‌టీకే పార్టీలో చేరారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌టీకే పార్టీ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలతో పాటు పుదుచ్చేరిలోని లోక్‌సభ స్థానం నుంచి కూడా పోటీ చేస్తోంది.

జేఎన్‌యూ ఎన్నికల్లో వామపక్ష కూటమి గెలుపు

న్యూఢిల్లీ, మార్చి 24 : కరోనాతో ఏర్పడిన పరిస్థితుల వల్ల నాలుగేళ్ల విరామం తర్వాత ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఏబీవీపీకి పెద్ద షాక్ తగిలింది. వామపక్షాల మద్దతు కలిగిన ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్‌ఏ), డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్(డీఎస్‌ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ), ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఏఐఎస్‌ఎఫ్) కూటమి ఘన విజయం సాధించింది. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ తదితర నాలుగు పోస్టులను వామపక్ష కూటమి అభ్యర్థులే గెలుపొందారు. ఈ నాలుగు స్థానాలకు మార్చి 22న పోలింగ్ నిర్వహించగా ఆదివారం ఫలితాలు ప్రకటించారు.

'ఐసిస్'లో చేరబోయిన ఐఐటీ విద్యార్థి అరెస్టు

గువాహటి, మార్చి 24: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ 'ఐసిస్'లో చేరడానికి ప్రయత్నించిన ఐఐటీ-గువాహటి విద్యార్థి ఒకర్ని పోలీసులు అరెస్టు చేశారు. తాను ఆ ఉగ్రవాద సంస్థలో చేరడానికి వెళ్తున్నానంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టి శనివారం బయలుదేరిన అతడ్ని గువాహటికి 30 కి.మీ.దూరంలోని కామరూప్ జిల్లా హాజోలో పట్టుకున్నారు. ఆ విద్యార్థి స్వస్థలం ఢిల్లీ కాగా, ఐఐటీ-గువాహటీలో బయోటెక్నాలజీ కోర్సు నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. తాను ఎందుకు ఐసిస్‌లో ఎందుకు చేరబోతున్నానో కారణాలు వివరిస్తూ లింక్‌డిన్‌లో పోస్టు పెట్టాడు. దీన్ని గమనించిన పోలీసులు అప్రమత్తమై దర్యాప్తు ప్రారంభించారు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడ్ని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు హాస్టల్ గదికి తీసుకువచ్చారు. అక్కడ ఐసిస్ జెండా మాదిరిగా ఉన్న నల్లజెండాను, కొన్ని ఇస్లామిక్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారమే అస్సాం పోలీసులు ఐసిస్ ఇండియా హెడ్ హారీస్ ఫరూకీని అరెస్టు చేయగా, అది జరిగిన కొద్ది రోజులకే ఐఐటీ విద్యార్థిని అదుపులోకి తీసుకోవడం గమనార్హం.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

ప్రజల తాగునీటి వెతలు తీర్చాలంటూ మంత్రి ఆతిషికి ఆదేశాలు

» ట్యాంకర్లతో మంచినీటి సరఫరాకు సూచన.. ఈడీ సీరియస్

» కేజ్రీవాల్ సతీమణి సునీతకు సీఎం పగ్గాలంటూ ఊహాగానాలు



శనివారం కేజ్రీవాల్ కుర్చీలో కూర్చొని ఆయన సందేశాన్ని చదివి వినిపిస్తున్న సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తనను జైలులో పెడితే అక్కడి నుంచే సర్కారును నడిపిస్తానని చెప్పినట్టుగానే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. జైలు నుంచే తొలి ఆదేశాలను జారీ చేశారు. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వేసవి దృష్ట్యా ఈ సమస్య మరింత పెరిగిపోకుండా ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేయాలని సంబంధిత మంత్రి ఆతిషిని ఆదేశించారు. అవసరమైతే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనా సాయం తీసుకోవాలని, ఆయన తప్పకుండా సహకరిస్తారని సూచించారు. తాను జైలులో ఉన్న కారణంగా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తవద్దని చెప్పారు. ఈ వివరాలను మంత్రి ఆతిషి ఆదివారం విలేకర్లకు స్వయంగా వెల్లడించారు. శనివారం సాయంత్రం సీఎం నుంచి ఒక నోట్ రూపంలో ఈ ఆదేశాలు తనకు అందాయని తెలిపారు. ఈడీ కస్టడీలో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ వాసుల సమస్యల పట్ల చూపుతున్న శ్రద్ధను చూసి తనకు కన్నీళ్లు వచ్చాయన్నారు. ఢిల్లీలోని రెండు కోట్ల ప్రజల కుటుంబసభ్యుడిగా కేజ్రీవాల్ తనను తాను భావిస్తుంటారని, అందువల్లే జైలులో ఉన్నా కూడా ప్రజల వెతల గురించి ఆలోచించటం ఆయనకు సాధ్యమైందని చెప్పారు. జైలు నుంచి కేజ్రీవాల్ ఆదేశాలు ఇవ్వటంపై ఈడీ దృష్టి సారించింది. కోర్టు ఆదేశాల మేరకే ఆయన చర్య ఉందా అన్నదానిపై ఈడీ దర్యాప్తు జరపనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శనివారం కేజ్రీవాల్‌ను ఆయన భార్య సునీత కలిశారని, ఆమె ద్వారా సదరు ఆదేశాల నోట్‌ను కేజ్రీవాల్ బయటకు పంపినట్లు తెలుస్తోందని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకూ ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో సౌత్ లాబీ నుంచి ముడుపులు స్వీకరించడం, గోవాలో ఎన్నికల కోసం రూ.45 కోట్లను మళ్లించటం తదితర అంశాల గురించి కేజ్రీవాల్‌ను అడిగినట్లు తెలిసింది. .

జైలు నుంచి పాలన కష్టమే!

జైలు నుంచి కేజ్రీవాల్ పరిపాలన కొనసాగించటం సాధ్యం కాకపోవచ్చని తీహార్ జైలుకు చెందిన ఓ మాజీ న్యాయ అధికారి అభిప్రాయపడ్డారు. జైలు నిబంధనల ప్రకారం.. జైలులో ఉన్న వ్యక్తి వారానికి రెండుసార్లు మాత్రమే సమావేశాలు జరపటానికి వీలవుతుందని, దీనివల్ల ప్రజల రోజువారీ సమస్యలపై జైలు నుంచి స్పందించటం ఆచరణసాధ్యం కాదన్నారు. అయితే, కేజ్రీవాల్ ఈడీ కస్టడీని గృహనిర్బంధం కింద మార్చితే ఈ సమస్యకు పరిష్కారం లభించవచ్చని తెలిపారు. ఢిల్లీ ఎల్జీకి ఈ అధికారం ఉంటుందని, ఆయన అనుమతిస్తే ఢిల్లీలోని ఏ భవనాన్ని అయినా జైలుగా ప్రకటించి కేజ్రీవాల్‌ను అక్కడికి తరలించవచ్చని సదరు అధికారి పేర్కొన్నారు.

సునీతకు పగ్గాలు?

కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ఢిల్లీ సీఎంగా ఆయన భార్య సునీత కేజ్రీవాల్ పగ్గాలు చేపట్టనున్నారా? అన్న చర్చ మొదలైంది. 'జైలులో ఉన్నా బయట ఉన్నా నా జీవితం ప్రజాసేవకే అంకితం' అంటూ కేజ్రీవాల్ పంపించిన సందేశాన్ని సునీత శనివారం మీడియాకు చదివి వినిపించిన సంగతి తెలిసిందే. విలేకర్ల సమావేశాల్లో కేజ్రీవాల్ ఎప్పుడూ కూర్చునే కుర్చీలో కూర్చొని సునీత ఈ సందేశాన్ని మీడియాకు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే, సీఎం పదవిని ఆమె చేపట్టే అవకాశాలున్నాయంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. కేజ్రీవాల్‌లాగే సునీత కూడా 1993 బ్యాచ్‌కు చెందిన మాజీ ఐఆర్‌ఎస్ అధికారి. కేజ్రీవాల్ ఉద్యోగాన్ని వదిలిపెట్టి సమాచార హక్కు కార్యకర్తగా ప్రజాజీవితాన్ని ప్రారంభించి రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా సునీత ఉద్యోగంలో కొనసాగారు. 23 ఏళ్ల సర్వీసు అనంతరం 2016లో ఆమె స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు.

కర్ణాటకకు ఇవ్వాల్సిన ప్రతి పైసా ఇచ్చేశాం!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

బెంగళూరు: 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ప్రత్యేక గ్రాంట్లలో తమ వాటాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని కర్ణాటక ప్రభుత్వం చేసిన ఆరోపణను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ఆర్థిక సంఘం అటువంటి సిఫారసులేమీ చేయలేదన్నారు. 'కర్ణాటకకు రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటును విడుదల చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణ పూర్తిగా అవాస్తవం' అన్నారు. తీవ్ర కరువుతో అల్లాడుతున్న తమ రాష్ట్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్(జాతీయ విపత్తుల స్పందన నిధి) నుంచి తక్షణమే నిధులు విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తర్వాతి రోజే నిర్మలా సీతారామన్ ఈ విధంగా స్పందించడం గమనార్హం. 'కర్ణాటకకు ఇవ్వాల్సిన ప్రతి పైసాను సకాలంలోనే ఇచ్చేశాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

బహుభార్యత్వాన్ని వదలితేనే స్థానికులుగా గుర్తిస్తాం

'మియా' ముస్లింలకు హిమంత షరతులు

గువాహటి, మార్చి 24: అస్సాంలో స్థానికులుగా గుర్తింపు పొందాలంటే 'మియా ముస్లింలు' పలు షరతులను పాటించాల్సి ఉంటుందని సీఎం హిమాంత బిశ్వశర్మ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన బెంగాలీ మాట్లాడే ముస్లింలనే అస్సాంలో మియాలుగా వ్యవహరిస్తారు. రాష్ట్రంలో అస్సామీ మాట్లాడే స్థానిక ముస్లింలకన్నా వీరు భిన్నమైనవారని భావిస్తుంటారు. రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో శనివారం మాట్లాడిన సీఎం మియాలకు పలు షరతులు విధించారు. "మియాలు స్థానికులా, కాదా అన్నది వేరే సమస్య. వారిని స్థానికులుగా గుర్తించడానికి ఇబ్బందేమీ లేదు. అయితే వారు బహుభార్యాత్వం, బాల్య వివాహాలను విడిచిపెట్టాలి. అస్సామీ సంస్కృతిని గౌరవించాలి. వైష్ణవ ఆశ్రమాలకు చెందిన 'సత్రాల' భూములను ఆక్రమించుకొని స్థానికులుగా గుర్తింపు కావాలంటే ఎలా కుదురుతుంది? ఇద్దరు ముగ్గురు భార్యలు ఉండకూడదు. అది అస్సామీ సంస్కృతి కాదు. పిల్లలను మదర్సాలకు పంపించొద్దు" అంటూ షరతులు పెట్టారు. రాష్ట్రంలో 40లక్షల మంది అస్సామీ మాట్లాడే ముస్లింలు ఉండగా, వారిని మాత్రమే స్థానికులుగా గుర్తిస్తున్నారు. మొత్తం ముస్లింల్లో వారి జనాభా 37 శాతమే. మిగతా 63% మంది బెంగాలీ మాట్లాడే మియాలే ఉన్నారు.

31న 'ఇండియా' మహార్యాలీ

కేజ్రీవాల్ అరెస్టుపై సంఘటిత ఉద్యమం.. రాంలీలా మైదానంలో భారీ సభ

» హాజరుకానున్న కూటమి అగ్రనేతలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్ రాయ్

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా విపక్ష కూటమి ఇండియా భారీ ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఈ నెల 31న (వచ్చే ఆదివారం) ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కేజ్రీవాల్‌కు మద్దతుగా లక్షలాది మందితో బహిరంగ సభ (మహార్యాలీ) నిర్వహిస్తామని కూటమి నేతలు తెలిపారు. ఈ సభకు విపక్ష కూటమిలోని అన్ని పార్టీల అగ్రనేతలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఆప్, సీపీఎం ఆదివారం సంయుక్త మీడియా సమావేశం నిర్వహించాయి. ఢిల్లీ మంత్రి, ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. 'ప్రజాస్వామ్యం, దేశం ప్రమాదంలో ఉన్నాయి. వాటిని కాపాడటానికే ఈ మహార్యాలీ. ఇది కేవలం కేజ్రీవాల్ కోసమే కాదు. యావత్ ప్రతిపక్షాలకు ముప్పు పొంచి ఉంది' అని అన్నారు. రాజకీయ నాయకులను భయపెట్టడానికి, ప్రతిపక్షాల అడ్డు తొలగించుకోవడానికి ప్రధాని మోదీ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని.. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని, బిహార్‌లో తేజస్వీ యాదవ్‌పై తప్పుడు కేసులు బనాయించారని, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ నేతలను వేధిస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్ కుటుంబాన్ని గృహనిర్బంధంలో ఉంచారని, ఆప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని వెల్లడించారు. ఢిల్లీ మద్యం కేసుపై రెండేళ్లుగా దర్యాప్తు జరుగుతున్నా, ఇప్పటివరకూ అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లేవని గోపాల్ రాయ్ గుర్తు చేశారు. 'ఈ కేసులో శరత్‌రెడ్డిని అరెస్టు చేశారు. కానీ, కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తానని, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి రూ.60 కోట్లు ఇస్తానని చెప్పిన తర్వాత ఆయనను విడుదల చేశారు. ఈ మేరకు బీజేపీకి రూ.60 కోట్లు ముట్టాయి' అని ఆరోపించారు. దేశాన్ని రక్షించటానికి యావత్ ప్రతిపక్షం సంఘటితంగా ముందుకొస్తుందన్నారు. కాగా, గోపాల్‌రాయ్ ఆరోపణలపై శరత్‌రెడ్డి నుంచి ఎటువంటి స్పందన వెలువడలేదని పీటీఐ వార్తాసంస్థ తెలిపింది. కాగా, మహార్యాలీ నిర్వహణకు అనుమతికి దరఖాస్తు చేస్తామని, అనుమతి లభించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని గోపాల్ రాయ్ తెలిపారు.

రాంలీలా మైదానానికి చారిత్రక ప్రాధాన్యం

ఢిల్లీలోని రాంలీలా మైదానానికి చారిత్రక ప్రాధాన్యత ఉంది. 2011లో నాటి యూపీఏ సర్కారుకు వ్యతిరేకంగా అన్నాహజారే నేతృత్వంలో ఈ మైదానంలోనే అవినీతి వ్యతిరేక ఉద్యమం జరిగింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ ఓటమికి ఇదొక ప్రధాన కారణంగా నిలిచింది. దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిన సమయంలో నాటి ప్రతిపక్షాలు జనతా కూటమిగా ఏర్పడి ఇదే రాంలీలా మైదానంలో భారీ సభలు నిర్వహించాయి. ప్రస్తుతం మోదీ హ్యాట్రిక్ ఖాయమేనంటూ పలు సర్వేలు జోస్యం చెబుతున్న వేళ.. ప్రతిపక్షాలు ఇదే మైదానం వేదికగా ఉద్యమానికి దిగటం చర్చనీయాంశమైంది.

పెద్దలకు టీబీ వ్యాక్సిన్!



» మానవుల నుంచి సేకరించిన క్షయ బ్యాక్టీరియాతో తొలిసారి తయారు చేసిన స్పానిష్ కంపెనీ

» ఆ సంస్థతో కలిసి భారత్ బయోటెక్ ట్రయల్స్

హైదరాబాద్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఏటా దాదాపు కోటి మంది కిసోకి.. దాదాపు 15లక్షల మంది ప్రాణాలు బలిగొంటున్న క్షయ మహమ్మారిని నివారించే 'ఎంటీబీవ్యాక్'అనే టీకా త్వరలోనే అందుబాటులోకి రానుంది. క్షయవ్యాధికి సంబంధించి ప్రపంచంలోనే తొలి లైవ్ ఎటెన్యుయేటెడ్ వ్యాక్సిన్ ఇది. స్పెయిన్‌కు చెందిన ఫార్మా సంస్థ బయోఫ్యాబ్రీ తయారుచేసిన ఈ టీకా సేఫ్టీ, ఇమ్యూనోజెనెసిటీ ట్రయల్స్‌ను ఆ సంస్థతో కలిసి చేపడుతున్నట్టు భారత్ బయోటెక్ సంస్థ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. క్షయ నివారణకు ప్రస్తుతం చిన్నారులకు వేస్తున్న బీసీజీ టీకా చాలా పాతది. అది జంతువుల్లో క్షయను కలిగించే బ్యాక్టీరియాను సేకరించి తయారు చేసిన వ్యాక్సిన్. పెద్ద వయసులో వచ్చే క్షయను నివారించే టీకాలేవీ ప్రస్తుతానికి లేవు. ఈ రెండు సమస్యలనూ పరిష్కరించేలా బయోఫ్యాబ్రీ.. మానవులకు సోకే క్షయకారక 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యూలోసిస్' సూక్ష్మక్రిమి నుంచి ఈ లైవ్ ఎటెన్యుయేటెడ్ టీకాను అభివృద్ధి చేసింది. లైవ్ ఎటెన్యుయేటెడ్ వ్యాక్సిన్ అంటే వ్యాధికారక సూక్ష్మక్రిమిని.. అది మనకు ఏ హానీ చేయలేనంత బలహీనంగా మార్చి మన శరీరంలోకి ప్రవేశపెట్టే టీకా. ఎంఎంఆర్, పోలియో చుక్కలు ఇందుకు ఉదాహరణ. ఇవి అత్యంత సమర్థంగా పనిచేస్తాయి. ఎంటీబీవ్యాక్ అలాంటిదే. దీన్ని పెద్దలకూ ఇవ్వొచ్చు. ఈ క్రమంలోనే తొలుత క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా దీన్ని పెద్దలపై ప్రయోగిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం చేపట్టినవి సేఫ్టీ అండ్ ఇమ్యూనోజెనెసిటీ ట్రయల్స్ అంటే.. ఈ టీకా ఎంతవరకు సురక్షితం? ఏమేరకు రోగనిరోధక వ్యవస్థను స్పందింపజేసి యాంటీబాడీలు తయారయ్యేలా చేయగలదు?అనే అంశాలను ఈ ట్రయల్స్‌లో పరీక్షిస్తారు. ఈ టీకా ఎంత సమర్థంగా పనిచేస్తుందో పరీక్షించే ఎఫికసీ ట్రయల్స్ వచ్చే ఏడాది నిర్వహించనున్నారు. కాగా.. భారత్‌లో పెద్దలు, కౌమారప్రాయంలో ఉండేవారిపై ఈ టీకా ట్రయ ల్స్ నిర్వహించడాన్ని గొప్పమైలురాయిగా బయోఫ్యాబ్రీ సీఈవో రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. బయోఫ్యాబ్రీతో కలిసి ఈ టీకా ట్రయల్స్‌లో భాగస్వాములుకావడం గౌరవంగా భావిస్తున్నామని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా పేర్కొన్నారు. పెద్దలు, యుక్తవయసులో వ్యాధిని నివారించడానికి టీబీ వ్యాక్సిన్ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు.

స్పెయిన్‌లో..

ఈ టీకా అభివృద్ధి, క్లినికల్ ట్రయల్స్.. దాదాపు 3దశాబ్దాల కృషి పారిస్‌లోని పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ బ్రిగిట్ గిక్వెల్..స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జరగోజా ల్యాబ్‌లో ఈ టీకా అభివృద్ధి చేశారు. జరగోజా వర్సిటీకి పారిశ్రామిక భాగస్వామి అయిన బయోఫ్యాబ్రీ ఈ టీకాను ఉత్పత్తి చేస్తోంది. ఈ టీకా ఎంత డోసు వరకు సురక్షితమో తెలుసుకునేందుకు ఇటీవలే ఫేజ్-2 ట్రయల్స్ పూర్తయ్యాయి. బీసీజీతో ఈ టీకాను పోల్చిచూసేందుకు నవజాత శిశువులపై డబుల్ బ్లైండ్, కంట్రోల్డ్ ఫేజ్-3 క్లినికల్ ట్రయల్స్ నిరుడు ప్రారంభించారు. ఇం దులో దక్షిణాఫ్రికాలో 7వేల మంది, మడగాస్కర్ నుంచి 60, సెనెగల్ నుంచి 60మంది పిల్లలకు టీకాలు వేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 1900మంది పైచిలుకు పిల్లలకు ఈ టీకా లు వేశారు. దక్షిణాఫ్రికాలో 276 మంది హెచ్ఐవీ సోకిన పెద్దలకు ఫేజ్-2 ట్రయల్స్‌లో భాగంగా ఈ టీకా ఇచ్చారు. ఫేజ్-2బీ ఎఫికసీ ట్రయల్స్‌లో సబ్‌సహారన్ ఆఫ్రికాలో కౌమారంలో ఉన్నవారికి టీకా ఇవ్వనున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా అగ్ని వర్షం

ఏకంగా 57 క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడి

కీవ్, మార్చి 24: ఉక్రెయిన్‌పై రష్యా అగ్ని వర్షం కురిపించింది. ఆదివారం తెల్లవారుజామున భారీగా క్షిపణులను ప్రయోగించింది. రాజధాని కీవ్‌తోపాటు కీలక ఇంధన వనరులు అధికంగా ఉన్న పశ్చిమ ప్రాంతంలోని లెవివ్‌పైనా క్రూయిజ్ మిసైళ్లతో దాడులు చేసింది. రష్యా అధ్యక్ష ఎన్నికల సమయంలో ఉక్రెయిన్ దాడులకు పాల్పడగా దానికి ప్రతీకార చర్యగా క్షిపణి ప్రయోగాలకు దిగినట్టు తెలుస్తోంది. లెవివ్‌లోని ఇంధన వనరులపై శుక్రవారమే బాంబులతో దాడి చేయగా, తాజాగా క్షిపణులను ఉపయోగించింది. కీవ్, లెవివ్‌లపై మొత్తంగా 57 మిసైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. 'కింజహాల్ హైపర్ సోనిక్ మిసైల్స్'ను రష్యా ప్రయోగించిందని లెవివ్ రీజనల్ గవర్నర్ మక్సీం కొజెట్స్కియి తెలిపారు. లెవివ్‌లోని 'కీలక ఇంధన వనరుల్లో'ని పరికరాలు మంటల్లో కాలిపోయాయని, దాంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్టు ఇంధన శాఖ తెలిపింది.కీవ్, పరిసర ప్రాంతాల్లో సుమారు డజను మిసైళ్లను ధ్వంసం చేశామని కీవ్ మిలటరీ అడ్మినిస్ట్రేషన్ హెడ్ సెరిహీ పాప్కో తెలిపారు. కీవ్‌లో పెద్దగా నష్టం జరగలేదని చెప్పారు. ఇదిలా ఉండగా, లెవివ్‌పై రష్యా ప్రయోగించిన క్షిపణి దారి తప్పి కొద్దిసేపు పోలాండ్ గగనతలంలోకి వెళ్లింది. ఉక్రెయిన్ సరిహద్దులు దాటి రెండు కిలోమీటర్ల ఆవల ఉన్న ఓసెర్‌డేవ్ పట్టణం వైపు వెళ్లింది. గగనతలంలో 39 సెకన్లపాటు ఉండి తిరిగి ఉక్రెయిన్ భూభాగంలోకి వెళ్లింది. దీనిపై రష్యా వివరణ కోరుతామని పోలాండ్ అధికారవర్గాలు తెలిపాయి.

అల్-షిఫా ఆస్పత్రిలో 170 మంది హతం: ఇజ్రాయెల్

సెంట్రల్ గాజా, మార్చి 24: గాజాలోని అతిపెద్ద ఆస్పత్రిగా ఓ వెలుగువెలిగిన అల్-షిఫా ఆస్పత్రిలో నక్కిన 170 మంది హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ఆదివారం ప్రకటించింది. ఈ నెల 18న అల్-షిఫాలో 350 మంది ఉగ్రవాదులు తలదాచుకున్నట్లు సమాచారం రావడంతో.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపింది. 170 మంది అంతమొందించగా.. మరికొందరిని సజీవంగా పట్టుకున్నట్లు పేర్కొంది. కాగా.. గాజాలో ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమైన తొలినాళ్లలోనే అల్-షిఫా ఆస్పత్రిని ఐడీఎఫ్ టార్గెట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దాడుల్లో ఆస్పత్రిలో చాలా భాగం ధ్వంసమవ్వగా.. అప్పట్లో అక్కడి రోగులను ఖాన్‌యూనిస్‌కు తరలించారు.

భర్త హత్యకు పుస్తెలతాడు సుపారీ

- ప్రియుడితో కలిసి హత్య చేయించిన భార్య
- ఆమెతోపాటు నలుగురి అరెస్టు.. నల్లగొండ జిల్లాలో ఘటన

నల్లగొండ టౌన్, మార్చి 24: వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్న భర్త అడ్డు తొలగించుకునేందుకు భార్య దారుణానికి పాల్పడింది. ఆ భర్త కట్టిన పుస్తెలతాడునే సుపారీగా ఇచ్చి అతని ప్రాణం తీయించింది. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లిలో మార్చి 17న జరిగిన ఈ హత్యకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కె.శివరాంరెడ్డి ఆదివారం వెల్లడించారు. జిల్లాలోని కట్టంగూరుకు చెందిన వనం ఈశ్వర్(33)కు సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన నవ్యతో 2015లో వివాహమైంది. వీరికి కుమార్తె(4), కుమారుడు(2) ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో పెద్ద మనుషుల పంచాయితీ పెట్టి ఒప్పందం చేసుకుని కలిసిమెలిసి ఉంటున్నారు. అయితే, కట్టంగూరు మండలం అంబటివాగుకు చెందిన కానుగ సతీష్.. ఈశ్వర్ ఇంటి పక్కనే నివాసముంటున్నాడు. ఈ క్రమంలో నవ్యతో సతీష్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం ఈశ్వర్‌కు తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో ఈశ్వర్‌ను హత్య చేయాలని నవ్య, సతీష్ నిర్ణయించుకున్నారు. ఇందుకోసం నవ్య తన వద్ద ఉన్న రెండు తులాల బంగారపు పుస్తెల తాడును సతీష్‌కు ఇచ్చింది. దీంతో ఈశ్వర్ హత్యకు సహకరించాలని సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఎర్రకుంటకు చెందిన లారీడ్రైవర్ నక్క వీరస్వామితో రూ.2లక్షలకు సతీష్ ఒప్పందం చేసుకున్నాడు. అనంతరం వీరస్వామి మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంనకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ధనావత్ హనుమానాయక్, త్రిపురారం మండలం బడాయిగడ్డకు చెందిన ఆటోడ్రైవర్ ధనావత్ సాయితో ఒప్పందం చేసుకుని వాళ్లకి రూ.40వేలు ఇచ్చాడు. ఈ క్రమంలో ఈశ్వర్ హత్యకు ప్రణాళిక రూపొందించిన సతీష్.. వీరస్వామిని మార్చి 16న కట్టంగూరుకు రప్పించాడు. అదే సమయంలో భార్యా పిల్లలతో కలిసి బైక్‌పై టేకుమట్ల వెళుతున్న ఈశ్వర్‌ను గమనించి ఇద్దరూ వెంబడించారు. అయితే, బైక్ చెడిపోవడంతో భార్యపిల్లలను ఆటోలో పంపిన ఈశ్వర్ వాహనం మరమ్మతులు చేసుకుంటుండగా వీరస్వామి అక్కడికి వెళ్లాడు. సాయం చేస్తున్నట్టు మాటలు కలిపి పరిచయం పెంచుకోవడమే కాకుండా ఇద్దరూ కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో వీరస్వామి.. ఈశ్వర్ ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. అనంతరం 17న సూర్యాపేటలో ఓ కారు అద్దెకు తీసుకున్న వీరస్వామి.. ఈశ్వర్‌కు ఫోన్ చేసి నల్లగొండ వెళ్లి వద్దామని పిలిచాడు. అతన్ని నమ్మిన ఈశ్వర్ కారు ఎక్కి నల్లగొండ వెళ్లాడు. మరోపక్క, హనుమానాయక్, సాయిని నల్లగొండ బస్టాండ్‌లో ఉంచిన వీరస్వామి.. వారిద్దరిని అక్కడ కారులో ఎక్కించుకుని కట్టంగూరు బయలుదేరారు. కారు వెనుక సీట్లో కూర్చున్న హనుమానాయక్, సాయి ముందు కూర్చున్న ఈశ్వర్ మెడకు తాడు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఓ బావిలో పడేశారు. అనంతరం సతీష్ వారికి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, రూ.95వేల నగదు ఇచ్చాడు. బావిలో గుర్తు తెలియని మృతదేహం దొరకడంతో కేసు నమోదు చేసిన తిప్పర్తి పోలీసులు విచారణ చేపట్టి నవ్య, సతీష్, వీరస్వామి, హనుమానాయక్, సాయిని అరెస్టు చేశారు. వారి నుంచి కారు, రెండు తులాల బంగారు గొలుసు, రెండు మోటార్ సైకిళ్లు, రూ.20వేల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నాంపల్లి ఎక్సైజ్ కోర్టు జడ్జి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం
- ఫోన్‌లో భార్యతో వాగ్వాదం
- ఆమెతో చెప్పి మరీ బలవన్మరణం


మణికంఠ (ఫైల్)

అంబర్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలు, భార్యతో తలెత్తిన మనస్పర్థలతో నాంపల్లి స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎ.మణికంఠ (36) ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన కుటుంబం బాగ్‌అంబర్‌పేట పోచమ్మబస్తీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. ఆయనకు మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌కు చెందిన లావణ్యతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు విశ్వనాథ్ (5) ఉన్నాడు. అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మణికంఠ, ఆయన భార్య మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం లావణ్య తన కొడుకుతో పుట్టింటికి వెళ్లింది. ఇటీవల మణికంఠ తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రిలో చేర్పించారు. మణికంఠ తండ్రి ఆస్పత్రిలోనే ఉంటూ భార్యను చూసుకుంటున్నారు. ఒకవైపు తల్లి ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రిలో ఉండగా.. మరోవైపు భార్య కొడుకుతో పుట్టింటికి వెళ్లడంతో మణకంఠ ఆవేదనకు గురయ్యారు. ఆదివారం ఆయన భార్యకు ఫోన్ చేయగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురైన మణికంఠ తాను బతకనని, ఆత్మహత్య చేసుకుంటానని భార్యతో ఫోన్‌లో చెప్పారు. అన్నట్లుగానే క్షణికావేశానికి లోనైన మణికంఠ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్ వేసుకుని భార్య చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారు. ఎంతకూ బయటకు రాకపోవడం, తలుపు తట్టినా తీయకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. తలుపులు పగులగొట్టి చూడగా ఆయన ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ సమాచారం తెలుసుకున్న తోటి జడ్జిలు, న్యాయవాదులు ఉస్మానియా మార్చురీకి తరలివచ్చి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పెళ్లి చేసుకుంటా.. అమెరికా తీసుకెళ్తా

- మ్యాట్రిమోనీ సైట్‌లో నకిలీ ప్రొఫైల్స్‌తో భారీగా టోకరా
- హైదరాబాద్‌లో ఓ మహిళ నుంచి రూ.2.71 కోట్లు స్వాహా
- ఆరుగురిని రూ.10 కోట్లకు మోసం చేసినట్లు అనుమానం
- ఏపీలోని పెనమలూరుకు చెందిన యువకుడి అరెస్టు



హైదరాబాద్ సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్, గుర్రపు పందేల వ్యసనం.. దానికోసం డబ్బు అవసరం.. దీంతో అడ్డదారిలో సంపాదనకు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌ను మార్గంగా ఎంచుకున్నాడో యువకుడు. తప్పుడు వివరాలతో రూ.2,500 చెల్లించి సభ్యత్వం తీసుకున్నాడు. యువతులు, మహిళలను మోసం చేయసాగాడు. హైదరాబాద్ మహిళకు ఏకంగా రూ.2.71 కోట్లకు టోకరా వేశాడు. సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయవాడ జిల్లా పోరంకి మండలం పెనమలూరు గ్రామానికి చెందిన పొట్లూరి శ్రీబాల వంశీకృష్ణ (37) నిరుద్యోగి. షాదీ.కామ్ వెబ్‌సైట్‌లో నకిలీ ప్రొఫైల్స్ పోస్ట్ చేశాడు. వాటిని యాక్సెప్ట్ చేసినవారికి.. పెద్ద కంపెనీలో ఉద్యోగినని, అమెరికా నుంచి మీకూ ఆఫర్లు ఉన్నాయని నమ్మించాడు. పెళ్లి తర్వాత తీసుకెళ్తానని చెప్పి.. వీసా ప్రక్రియ, ఇతరత్రా ఖర్చులకు కొస్త డబ్బు ఖర్చు అవుతుందని చెప్పేవాడు. వంశీకృష్ణ ప్రొఫైల్స్‌ను ఆరుగురు యాక్సెప్ట్ చేశారు. అమెరికా వీసా పేరిట వీరినుంచి డబ్బులు కాజేశాడు. ఇలా మొత్తం రూ.10 కోట్లకు పైగానే కాజేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా, హైదరాబాద్ మదీనాగూడకు చెందిన ఓ మహిళ (30)కు నవంబరులో షాదీ.కామ్‌లో అమెరికా పౌరుడు రిషీకుమార్ పేరిట ఉన్న శ్రీబాల వంశీకృష్ణ ప్రొఫైల్ నచ్చడంతో తన వివరాలు ఇచ్చింది. అనంతరం ఇద్దరి మధ్య వాట్సాప్ చాటింగ్ మొదలైంది. గ్లెన్‌మార్క్ ఫార్మా కంపెనీలో తాను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నానని, నిన్ను కూడా అమెరికాకు తీసుకొస్తానని మహిళను వంశీకృష్ణ నమ్మించాడు. అయితే, నీ సిబిల్ స్కోర్ 743 మాత్రమే ఉందని, అమెరికా వీసా రావాలంటే కనీసం 845 ఉండాలని చెప్పాడు. స్కోర్ పెరిగేందుకు కంపెనీ నుంచి రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికి మహిళ నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. పలు దఫాలుగా రూ.2.71 కోట్లు కొట్టేశాడు. దీనిపై ఈ నెల 16న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు వంశీకృష్ణ నుంచి ఆరు పాస్‌బుక్‌లు, 10 డెబిట్ కార్డులు, 3 ఫోన్లు, 4 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వంశీకృష్ణపై 2011 నుంచి హైదరాబాద్ 6, విజయవాడ, రామగుండం, చెన్నైలో ఒక్కోటి చొప్పున మొత్తం 9 కేసులున్నాయి.

భర్త జీవితంతో ఆటాడుకుంది

ఆన్‌లైన్ గేమ్‌లో రూ.16 లక్షలు పోగొట్టిన భార్య.. డిప్రెషన్‌లోకి వెళ్లి ఆత్మహత్యకు సిద్ధపడిన భర్త

- స్నేహితుల కౌన్సిలింగ్‌తో ఆలోచన వెనక్కు
- అవే గేమ్స్ ఆడి రెట్టింపు డబ్బిస్తానని భార్య ధీమా
- మందలించబోయిన స్నేహితులపైనా ఆగ్రహం
- అందరి పేర్లు రాసి.. చచ్చిపోతానని బెదిరింపు
- యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఘటన



భువనగిరి టౌన్, మార్చి 24: పదో తరగతి చదివిన భర్త.. డిగ్రీ చదివిన భార్య! కష్టపడి చెమటోడ్చి సంపాదించిన ప్రతి పైసానూ భార్య చేతికిచ్చి బ్యాంకులో దాచిపెట్టాలన్నాడా భర్త!! కానీ.. ఆన్‌లైన్ గేములకు బానిసైన భార్య అతడికి తెలియకుండా ఆ డబ్బంతా దానికే ధారపోసింది! కూడబెట్టిన డబ్బుతో 100 గజాల స్థలం కొనుక్కుందామని భావించిన ఆ భర్త.. ఆ డబ్బంతా కరిగిపోయిందని తెలిసి, డిప్రెషన్‌కు గురై పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. అదృష్టవశాత్తూ స్నేహితుల కౌన్సెలింగ్‌తో ఆ ఆలోచన విరమించుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్ల కేంద్రంలో జరిగిందీ ఘటన. భువనగిరి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి చిరువ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ.. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు కొన్నేళ్లుగా లక్షల రూపాయలు పోగుచేశాడు. భార్య పేరిట బ్యాంకులో ఖాతా తెరిపించి.. అందులో జమచేయాలంటూ తన సంపాదన అంతా ఆమె చేతికిచ్చేవాడు. ఇద్దరు పిల్లలతో కలిసి అద్దె ఇంట్లోనే నివాసం ఉంటూ రూ.16లక్షలు పోగుచేశాడు. ఇటీవలే.. 100 గజాల ప్లాటును రూ.15 లక్షలకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. భార్యను తీసుకెళ్లి ఆ ప్లాటును చూపించాడు. ఇదంతా పార్లమెంటు ఎన్నికల షెడ్యూలుకు ముందు జరిగింది. ఎన్నికల షెడ్యూలు విడుదలైతే పెద్ద మొత్తంలో డబ్బు తీసుకోవడం కుదరదని రియల్‌ఎస్టేట్ వ్యాపారి చెప్పడంతో.. ఈ నెల 14న రిజిస్ట్రేషన్‌కు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. బ్యాంకులో జమ చేసిన రూ.16 లక్షలు తెచ్చుకుందామని భార్యతో చెప్పగా.. అప్పటికే ఆ డబ్బును ఆన్‌లైన్ గేముల్లో పోగొట్టుకున్న ఆమె, ఆ విషయాన్ని దాచిపెట్టి.. రకరకాల సాకులు చెబుతూ బ్యాంకుకు వెళ్లేందుకు నిరాకరించింది. 17న ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో.. కోడ్ ముగిసిన అనంతరమే రిజిస్ట్రేషన్ చేసుకుందామని భర్తకు నచ్చజెప్పింది. అమాయకంగా ఆమె మాటలు నమ్మిన అతడు.. రియల్ ఎస్టేట్ వ్యాపారికి అదే మాట చెప్పాడు. దీంతో ఆయన కనీసం రూ.లక్ష అడ్వాన్స్‌గా ఇవ్వాలని కోరాడు. అది సమంజసమేనని భావించిన భర్త.. ఆ లక్ష రూపాయలు తెచ్చేందుకు బ్యాంకుకు వెళ్దామని భార్యతో అన్నాడు. అప్పుడు కూడా ఆమె ఏదో సాకు చెప్పడంతో అతడికి అనుమానం వచ్చింది. దీంతో పరిచయస్తుల సాయంతో బ్యాంక్ బ్యాలెన్స్‌ను చెక్ చేయగా.. అందులో కేవలం రూ.19 వేలు మాత్రమే ఉన్నట్లు తేలింది. బిత్తరపోయిన అతడు.. ఇంటికి వెళ్లి భార్యను నిలదీయగా.. "ఔను! నేను ఆడిన ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టం వచ్చింది. అవే గేమ్స్ ద్వారా త్వరలోనే దానికి రెట్టింపు సంపాదించి ఇస్తాను" అని నిర్లక్ష్యంగా చెప్పిందామె. దీంతో మనస్తాపానికి గురైన ఆ భర్త.. ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. అతని మానసిక స్థితిని గమనించిన సన్నిహితులు.. విషయం ఆరా తీసి అతడికి కౌన్సెలింగ్ చేశారు. ఈ క్రమంలోనే.. అతడి భార్యను కూడా మందలించేందుకు వారు ప్రయత్నించగా.. "మీ అందరి పేరిటా సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంటా"నని ఆమె బెదిరించింది. దీంతో వారు వెనక్కి తగ్గారు. పెద్ద మనుషులు ఆ దంపతుల మధ్య రాజీ కుదిర్చి.. వ్యసనాలను మానుకోవాలని ఆమెను హెచ్చరించారు. ఏదేమైనా.. ఎన్నో ఏళ్లపాటు శ్రమించి పోగు చేసుకున్న మొత్తాన్ని కట్టుకున్న భార్యే దుర్వినియోగం చేయడంతో కలత చెందిన అతను డిప్రెషన్‌లోకి వెళ్లడంతో వైద్య చికిత్సల నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

రాణాకు వచ్చిన యువతిని ట్రాప్ చేసిన ఏఎస్సై

- మాటలు కలిపి.. వివాహేతర సంబంధం..?
- ఆమెతో సన్నిహితంగా దిగిన ఫొటోలు వైరల్

ఇబ్రహీంపట్నం, మార్చి 24: న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ యువతిపై ఏఎస్సై కన్నేశాడు. విచారణ పేరుతో మాటలు కలిపి ట్రాప్ చేశాడు. ఆమెకు ఫోన్ చేస్తూ మరింత దగ్గరయ్యాడు. అయితే, సదరు యువతితో ఆ అధికారి సన్నిహితంగా ఉన్న ఫొటోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశమైంది. వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి కొద్ది రోజుల కిందట ఓ కేసు విషయమై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏఎస్సై ఆ యువతిపై కన్నేశాడు. విచారణ పేరుతో ఆమెను ట్రాప్‌లోకి దింపాడు. తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఆమెకు దగ్గరయ్యాడు. అయితే, ఆ ఏఎస్సై సదరు యువతితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఆమె వయసు దాదాపు 23 ఏళ్లు కాగా.. ఏఎస్సైకి 50కి పైగా ఉండటం విశేషం. ఈ విషయమై ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఈ వ్యవహారం తమ దృష్టికి రాలేదని చెప్పారు.

శవాన్ని నా ఇంట్లోకి తేవద్దు...

- అద్దె ఇంటి యజమాని ఆదేశంతో మృతదేహంతో రాత్రంతా శ్మశానంలోనే గడిపిన ఓ కుటుంబం
- మహబూబాబాద్ జిల్లాలో అమానవీయ ఘటన


శ్మశాన వాటికలో రుక్కమ్మ మృతదేహం వద్ద కోడలు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), మార్చి 24 : శవాన్ని నా ఇంట్లోకి తీసుకురావద్దు.. తన ఇంట్లో అద్దెకు ఉంటున్న ఓ నిరుపేద వృద్ధురాలు ఆస్పత్రిలో మరణించగా బాధిత కుటుంబం పట్ల ఆ ఇంటి యజమాని వ్యవహరించిన తీరు ఇది. దీంతో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించిన ఆ కుటుంబం రాత్రంతా అక్కడే ఉండి ఆదివారం అంత్యక్రియలు పూర్తి చేసింది. ఈ అమానవీయ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం విలేజీలో జరిగింది. గ్రామానికి చెందిన రంగోజు రుక్కమ్మ(85) అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎంలో శనివారం సాయంత్రం మరణించారు. రుక్కమ్మ అద్దె ఇంట్లో ఉంటుండంతో మృతదేహాన్ని ఇంటి వద్దకు తెచ్చేందుకు యజమాని నిరాకరించాడు. దీంతో రుక్కమ్మ కోడలు ఉపేంద్ర వరంగల్ ఎంజీఎం నుంచి మృతదేహాన్ని గ్రామంలోని శ్మశాన వాటికకు రాత్రి తీసుకువెళ్లింది. రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మృతదేహంతోపాటే సంబంధిత కుటుంబసభ్యులు ఉన్నారు. గ్రామప్రజల సహకారంతో ఆదివారం సాయంత్రానికి రుక్కమ్మ అంత్యక్రియలు పూర్తిచేశారు. రుక్కమ్మ కుమారుడు సాంబయ్యచారి ఏడాది క్రితం మరణించారు. ఆయన మృతదేహాన్ని కూడా అప్పట్లో ఇలాగే శ్మశానవాటికకు తరలించారు. కాగా, కొద్ది నెలల క్రితం ప్రభుత్వం ఉపేంద్ర పేరిట ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ పట్టా జారీ చేసింది. కానీ స్థలాన్ని మాత్రం చూపలేదు. తమకు స్థలం చూపించి ఉంటే ఇల్లు కట్టుకునే వాళ్లమని, ఈ పరిస్థితి ఉండేది కాదని ఉపేంద్ర వాపోయారు.

టెన్త్ పరీక్షలో మాస్‌కాపీయింగ్‌కు యత్నం

- ఖమ్మం జిల్లాలో ఏడుగురిపై కేసు

కూసుమంచి, మార్చి 24: ఖమ్మం జిల్లా కూసుమంచిలో పదోతరగతి పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు యత్నించిన ఏడుగురిపై కేసు నమోదైంది. కూసుమంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో భాగంగా శనివారం గణితం పరీక్ష సందర్భంగా కొందరు విద్యార్థులకు చెందిన వ్యక్తులు అక్రమంగా పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించి చిట్టీలు అందించేందుకు యత్నించారు. దాంతో ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ ఆదేశాలతో పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు ఏడుగురుపై కూసుమంచి పోలీసులు కేసు నమోదు చేశారు. కూసుమంచి మండలం బికారితండాకు చెందిన తేజావత్ రిషీ అర్వింద్, ప్రగతి స్కూల్ టీచర్ మంగూలాల్, పోచారం గ్రామానికి చెందిన రెడ్డిమళ్ల గణేష్, ఇంతియాజ్, ఎర్షాద్ అహ్మద్, కొక్కిరేణి సీతారాములు తదితరులపై కేసునమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

డ్రగ్ పార్సిళ్ల పేరుతో కేటుగాళ్ల ఫోన్ కాల్స్!

ఐఐటీ పీహెచ్‌డీ స్కాలర్‌కు రూ.31లక్షల కుచ్చుటోపీ.. జాగ్రత్తగా ఉండాలన్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

- మధురానగర్‌లో తాజాగా మరో కేసు నమోదు



హైదరాబాద్ సిటీ, యుసుఫ్‌గూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డ్రగ్ పార్సిళ్ల పేరుతో కేటుగాళ్లు పోలీసులుగా చెప్పుకొంటూ బెదిరింపు కాల్స్ చేస్తున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ తరహాలో మోసపోయిన ఓ బాధితుడు సజ్జనార్‌ను కలిసి, తన గోడు వెళ్లబోసుకున్నారు. ఈ క్రమంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు సజ్జనార్ ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. "హలో.. మేము ముంబై క్రైమ్‌బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నాం. మీ పేరుతో ఫెడెక్స్‌లో పార్సిల్ బుక్ అయ్యింది. అందులో నకిలీ పాస్‌పోర్టులు, డ్రగ్స్ ఉన్నాయి. మీకు ఉగ్రవాదుల మాస్టర్‌మైండ్ మహమ్మద్‌తో కలిపి పలు బ్యాంకుల్లో జాయింట్ అకౌంట్స్ ఉన్నాయి" అంటూ కేటుగాళ్లు ఫోన్ చేస్తారని సజ్జనార్ వివరించారు. అంతటితో ఆగకుండా.. తాము పోలీసులమేనని నమ్మించేందుకు ఐడీ కార్డులు, ఎఫ్ఐఆర్ కాపీలను వాట్సాప్‌లో పంపుతూ.. బెదిరిస్తారన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐఐటీ పీహెచ్‌డీ స్కాలర్ నుంచి కేటుగాళ్లు ఇలా విడతల వారీగా రూ.31 లక్షలను దోచుకున్నట్లు చెప్పారు. "ఆ పీహెచ్‌డీ స్కాలర్ ల్యాప్‌టాప్, ఫోన్‌ను కేటుగాళ్లు హ్యాక్ చేశామంటూ భయపెట్టారు. హౌస్ అరెస్టు చేస్తున్నామంటూ ఆరు రోజులు ఇంట్లోంచి బయటకు రాకుండా చేశారు. అసలు ఈ కేసేంటి? నాకేం సంబంధం అని బాధితుడు ప్రశ్నిస్తున్నా.. బెదిరింపులను పెంచుతూపోయారు. జాయింట్ అకౌంట్‌లో అనుమానాస్పద లావాదేవీల పేరుతో.. బాధితుడి కుటుంబ సభ్యులు పొదుపు చేసుకున్న రూ.31 లక్షలను తమ ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. జాయింట్ అకౌంట్ల లావాదేవీలు సక్రమంగా ఉంటే.. ఆ మొత్తం తిరిగి ఇచ్చేస్తామని చెప్పారు. నగదు బదిలీ జరిగాక.. వారి ఫోన్లు స్విచాఫ్ కావడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు" అని సజ్జనార్ వివరించారు. ఇలాంటి మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ మోసం జరిగితే.. సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేయాలని వివరించారు.

మధురానగర్‌లో రూ.98వేలకు టోపీ

పైన పేర్కొన్న తరహాలోనే మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఓ కేసు నమోదైంది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. వెంగళరావునగర్‌లో నివసించే షెఫాలి పులిగిర్తి అనే మహిళకు ఈ నెల 21న ఓ కాల్ వచ్చింది. "ఫెడెక్స్ నుంచి ఫోన్ చేస్తున్నాం. మీ ఆధార్, ఫోన్ నంబర్‌తో ముంబై నుంచి ఇరాన్‌కు ఓ కొరియర్ బుక్ అయ్యింది. ముంబై నార్కోటిక్స్ బ్యూరో తనిఖీల్లో.. ఆ కొరియర్‌లో 50 ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్ ఉన్నాయి" అంటూ అవతలి వ్యక్తి బెదిరించాడు. తాను ఎలాంటి కొరియర్ బుక్ చేయలేదని బాధితురాలు చెప్పగా.. ముంబై నార్కోటిక్స్ బ్యూరో వారితో కాన్ఫరెన్స్ కలిపాడు. అవతలి వ్యక్తి.. మీరు వెంటనే ముంబై రావాలని, విచారణకు హాజరవ్వాలని ఆదేశించారు. తాను అక్కడికి రాలేనని, బాధితురాలు చెప్పగా.. స్కైప్‌లో విచారిస్తామని చెప్పారు. వీడియో కాల్‌లో పోలీసు యూనిఫాం వేసుకున్న వ్యక్తి బెదిరింపులకు దిగుతూ.."మీ ఆధార్ కార్డుకు టెర్రరిస్టు అకౌంట్లతో లింకులున్నాయి. మీ ఖాతాను, అందులోని లావాదేవీలను పరిశీలించాలి" అని డిమాండ్ చేశాడు. ఆమె అకౌంట్‌లో రూ.98 వేలున్నట్లు స్క్రీన్‌షాట్ పంపగా.. ఆ మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. "మీ లావాదేవీలు సవ్యంగా ఉన్నట్లు తేలితే.. మీ డబ్బు తిరిగివస్తుంది" అని చెప్పాడు. తర్వాత డబ్బు ఎంతకీ రాకపోవడం, అవతలి వ్యక్తి ఫోన్ స్విచాఫ్ ఉండడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



తాడ్వాయి అడవుల్లో కార్చిచ్చు

- ఐదు రోజులుగా అదుపులోకి రాని మంటలు
- విలవిల్లాడుతున్న వన్యప్రాణులు
- ఫైర్ లైన్లు ఏర్పాటు చేసినా ఫలితం అంతంతమాత్రమే

ములుగు, మార్చి 24: ములుగు జిల్లా ఏటూరునాగారం అభయారణ్యంలో కార్చిచ్చు రగులుకుంది. ఐదు రోజులుగా అడవిని మంటలు దహించి వేస్తున్నాయి. తాడ్వాయి, పస్రా, లింగాల, మేడారం, ఏటూరునాగారం, షాపల్లి, పెద్ద వెంకటాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లోని అడవుల్లో వ్యాపించిన మంటలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. వేసవి కావడం, మంటలు వ్యాపించడంతో అటవీ జంతువులు విలవిల్లాడుతున్నాయి. అగ్నికీలలకు విలువైన వృక్ష సంపద మంటల్లో కాలిపోతోంది. అడవుల్లో సంచరించే అరుదైన అడవిదున్నలు, అడవి పందులు, జింకలు, దుప్పులు తదితర వన్యప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితికి మానవ తప్పిదమే కారణంగా తెలుస్తోంది. ప్రతి ఏటా వేసవిలో అడవుల్లో మంటలు వ్యాపిస్తుండగా నివారణ కోసం గతంలో అటవీ అధికారులు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. తునికాకు సీజన్ మొదలవుతుండగా కొమ్మ కొట్టాల్సి ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా తునికాకు కాంట్రాక్టర్లు... ఉద్దేశపూర్వకంగానే అడవికి నిప్పు పెట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. మంటలను ఆర్పేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో గొత్తికోయ, ఆదివాసీ పల్లెలు ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెన్నూరులో గడియారాల పంపిణీ

చెన్నూరు, మార్చి 24 : మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని పలు కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన గోడ గడియారాలను రెండు రోజుల నుంచి నాయకులు, కార్యకర్తలు పంపిణీ చేస్తున్నారు. గోడ గడియారాలపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఫొటోతోపాటు కేసీఆర్, కేటీఆర్ ఫొటోలున్నాయి. గడియారంపై కారు గుర్తుకే ఓటేద్దాం... అభివృద్ధి యజ్ఞాన్ని కొనసాగిద్దామని... బాల్క సుమన్ ఎమ్మెల్యే చెన్నూరు అని ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ గడియారాలు తెప్పించినట్లు తెలుస్తోంది. అప్పుడు పంపిణీ చేయకుండా మిగిలిన గడియారాలను మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల కోసం పంపిణీ చేస్తున్నారా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఎస్ఎల్‌బీసీ సొరంగం గట్టెక్కేనా!

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాధాన్యం లేని జాబితాలో ఉండిపోయిన ప్రాజెక్టు

- 15 నెలలుగా నిలిచిపోయిన పనులు
- కొత్త ప్రభుత్వంలో మళ్లీ ప్రాధాన్యం
- అంచనాల సవరణకు ఫైలు సమర్పణ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ప్రాధాన్యం లేని జాబితాలో ఉన్న శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ పనులు గట్టెక్కుతాయా? కొత్త ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రాధాన్య జాబితాలో చేర్చినా ఎప్పట్లోగా పనులకు ఆమోద ముద్ర వేయనుంది? ప్రస్తుతం నీటిపారుదల శాఖలో ఇదే చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం 2016లో కాళేశ్వరం హెడ్‌వర్క్‌ల (మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు పంప్‌హౌస్) నిర్మాణం ప్రారంభించి మూడేళ్లలోనే పూర్తి చేయగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనులను మాత్రం అటకెక్కించింది. గత పదేళ్లలో కేవలం ఒక్క కి.మీమేర తవ్వకం పూర్తయింది. నిధులు కేటాయించకపోగా టీబీఎంలు పాడైనా పట్టించుకోకపోవడంతో 15 నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఈ టన్నెల్ పనులు పూర్తయితే 3 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు గ్రావిటీతో అందేది. భారీగా కరెంట్ బిల్లులు వచ్చే ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం నెత్తినపెట్టుకోగా గ్రావిటీ ద్వారా నీరందించే ఈ టన్నెల్ పనులను విస్మరించింది.

రెండింతలు పెరిగిన అంచనా వ్యయం

శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను సొరంగం ద్వారా తరలించడానికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును రూ.1925 కోట్లతో ప్రతిపాదించారు. 19 ఏళ్లు పూర్తి కావస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో అంచనా వ్యయం ప్రస్తుతం రూ.4637.75 కోట్లకు చేరింది. 43.93 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వాల్సి ఉండగా ఇప్పటిదాకా 34.37 కిలోమీటర్ల మేర తవ్వారు. ఇందులో 33 కిలోమీటర్ల మేర ఉమ్మడి రాష్ట్రంలో తవ్వగా గత పదేళ్లలో కేవలం ఒక్క కిలోమీటర్ మాత్రమే తవ్వారు. ఒక సొరంగం శ్రీశైలం వైపు నుంచి, మరొకటి మన్నెవారిపల్లి (అచ్చంపేట) నుంచి తవ్వాలి. మరో 9.56 కిలోమీటర్లు తవ్వితే ఉమ్మడి నల్లగొండ జిల్లా సాగు/తాగునీటి అవసరాలు తీరతాయి. ఈ ప్రాజెక్టు ప్రతిపాదన 1969లోనే వచ్చింది. అప్పట్లోనే దీనికి 150 టీఎంసీలు కేటాయించాలని బచావత్ ట్రిబ్యునల్ ముందు కోరినా అది జరగలేదు. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు ప్రతిపాదనలు ఏకకాలంలో రాగా కుడిగట్టు పనులు 1990లోనే పూర్తయ్యాయి. ఎడమగట్టు పథకం పనులు మాత్రం 2005 నుంచి కొనసాగుతూనే ఉన్నాయి.

తల్లిదండ్రులు డబ్బులివ్వడం లేదని సొంత ఇంటికి నిప్పు

- వరంగల్ జిల్లా నాగారంలో ఓ కుమారుడి దాష్టీకం
- రూ.50 వేల ఆస్తినష్టం



నెక్కొండ, మార్చి 24: చేసిన అప్పులు తీర్చడానికి తల్లిదండ్రులు డబ్బులివ్వడంలేదనే కోపంతో ఓ కుమారుడు ఏకంగా తన సొంతింటికే నిప్పుపెట్టాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామంలో ఆదివారం జరిగింది. నాగారానికి చెందిన వ్యవసాయ కూలీలు కుమ్మరి వెంకన్న- ఐలమ్మ దంపతుల కుమారుడు మధు పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల నుంచి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాలకు మధు రూ.1.50లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు తీర్చడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులపై నెల రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన మధు డబ్బు విషయమై మరోసారి తల్లిదండ్రులతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి ఇల్లంత చల్లి నిప్పుపెట్టాడు. మంటలు వ్యాపించడంతో స్థానికులు వెంటనే స్పందించి వాటిని ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న దుస్తులు, వంట సామగ్రి, తలుపులు, కిటికీలు దగ్ధమయ్యాయి. రూ. 50వేల వరకు ఆస్తినష్టం వాటిల్లిన్నట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మధును అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై మధు తల్లిదండ్రులు, బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బొమ్మలు: అక్బర్

రంగుల చేతులు

బజారులో అమ్మకానికి ఉన్న
ఇన్ని హోళీ రంగుల్ని చూస్తుంటే
అప్పుడెప్పుడో చిన్నప్పుడు
దోస్తుల పిడికిళ్లలోంచి
నామీదికి విజృంభించబడిన
ఆనాటి రంగులు గుర్తుకొస్తున్నాయి.
గోడ దూకిన రంగులు
నక్కి నక్కి దాక్కున్న రంగులు
నిశ్శబ్దంగా కిటికీలు తెరిచిన రంగులు...
తీసేదాకా తలుపులు బాదిన రంగులు
దుప్పటి లాగిన రంగులు
వెనుక నుండి హఠాత్తుగా దాడిచేసిన
రంగులు
రోడ్డు మీద పరుగెత్తించిన రంగులు
సైకిల్ ముందుచక్రాన్ని ఆపిన రంగులు
వెనుక చక్రం వెనుక
పరుగెత్తి పరుగెత్తి అందుకోలేకపోయిన
రంగులు
పళ్లకు రుద్దిన రంగులు
కళ్లల్లో పడ్డ రంగులు
వాగునీటిలో కలిసిపోయిన రంగులు
వారందాకా ఒంటిమీదినుండి
వెళ్లిపోని రంగులు


★ ★ ★

బజారులో
అన్ని రంగులూ కొలువుతీరి ఉన్నాయి
ఆ రంగుల్ని పూసే
అప్పటి మిత్రుల చేతివేళ్లే
కొన్ని
కనిపించడం లేదు
చదువుకోంద్రా అంటే
వినని చేతివేళ్లు
హోటళ్లకు నీళ్లు
మోసిన చేతివేళ్లు
సున్నం పనిలో నిచ్చెన మీదినుండి
జారిపడి మంచానికి పరిమితమైన
చేతివేళ్లు
ఆటోనడుపుతున్న చేతివేళ్లు
'అప్పట్నుండీ సెంట్రింగ్ పనేరా'
అని బలహీనంగా నవ్వే చేతివేళ్లు
మట్టిరంగులో కలిసిపోయిన
కొన్ని చేతివేళ్లు
బూడిదరంగు వైపు కరిగిపోయిన
కొన్ని చేతివేళ్లు

★ ★ ★

ఇవ్వాళ కొన్ని రంగుల్ని
ఆకాశంలోకి విసురుతాను
తిరిగివచ్చి
అవి నామీదే పడతాయి
అవి -
వెళ్లిపోయిన చిన్ననాటి మిత్రులు
ఈ హోళీ పండుగ నాడు
పైనుండి నామీదకు విసిరిన
రంగులని
భావించుకుంటాను.

● భగవంతం



రచయిత ఆస్తిగా సాహిత్యం



పదేళ్ళ క్రితం మరణించిన స్పానిష్ రచయిత గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ ఆఖరు నవలను ఆయన అభీష్టానికి భిన్నంగా ఇటీవల ప్రచురించడాన్ని గురించి 'ద టెలిగ్రాఫ్ ఇండియా'లో మార్చ్ 10న 'ఆగస్ట్ టోన్స్' పేరిట ఒక సంపాదకీయం వచ్చింది. ఇది స్థూలంగా రచనల గురించి, వాటి ప్రచురణల గురించి, వాటి ప్రచురణకు సంబంధించిన నైతికత, చట్టబద్ధతల గురించి కొన్ని మౌలికమైన ప్రశ్నలను రేకెత్తించింది.

ఏ 'రచన'నైనా ఒక స్థల కాలాల్లో రాతలో పెట్టబడిన ఆలోచనల సమాహారంగా మనం అంగీకరిస్తే అట్టి రచనల హక్కుల గురించి మాట్లాడుకోవచ్చు. అలా రాయబడిన రచనలు రచయితల ఆస్తిగా పరిణమించాయని తెలుస్తుంది. ఆ విధంగా వారికి కలిగిన ఆస్తి హక్కులు వారు చనిపోయిన తరువాత వారి వారసులకు సంక్రమించడమూ చూస్తున్నాం. చరిత్రలో ప్రచురణకర్తలు బయలుదేరిన తరువాత ఈ హక్కులు మరింత స్థిరత్వాన్ని పొందాయి. మళ్లీ ప్రచురించే హక్కు ఐన కాపీరైట్‌ను రచయిత తన దగ్గరే ఉంచుకోవడమో లేక ప్రచురణకర్తలే కొనుక్కోవడమో జరుగుతూ ఉంది.

రాయడం ద్వారా లేక ప్రచురింపబడడం ద్వారా వచ్చిన ఈ హక్కులు మౌఖిక సాహిత్యానికి లేకపోవడం గమనించాలి. మౌఖిక సాహిత్యం తరతరాలుగా ఒకరి నుండి మరొకరికి, ఒక తరం నుండి మరో తరానికి నోటి ద్వారా అందివ్వబడుతుంది. ఇలా తరతరాలుగా వస్తున్న సాహిత్యానికి కర్తలెవరో చెప్పలేం. ఒకరి నుండి మరొకరికి, మరో తరానికి అందించబడే క్రమంలో కొన్ని మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉన్నందువల్ల కూడా ఇలాంటి సాహిత్యానికి ఒకే కర్తను నిర్ధారించడం కూడా కష్టం. కాలానుగుణంగా మారగలిగే ఈ లక్షణమే మౌఖిక సాహిత్యాన్ని సజీవంగా ఉంచుతుంది. కానీ లిఖిత సాహిత్యానికి అబ్బిన హక్కులు నోటి ద్వారా అందుతున్న ఈ సాహిత్యానికి లేకపోవడం శోచనీయమే. ఇందుకు భిన్నంగా లిఖిత సాహిత్యం ఒక రచయిత పేరుతో ప్రచురింపబడి, తర్వాత ఇక మార్పులు చేర్పులకు వీలులేని స్థిరత్వాన్ని పొందుతుంది.

ఈ నేపథ్యం నుండి చూస్తే ఒక రచయిత తాను చనిపోయిన తరువాత తన రచనలను ప్రచురించవద్దని కానీ, వాటిని ధ్వంసం చేయమని కానీ తన వారసులను ఆదేశించినప్పుడు వారికి అందుకు భిన్నంగా వ్యవహరించే నైతిక హక్కు ఉంటుందా? ఇటీవల మరణించిన ఒడియా రచయిత జయంతా మహాపాత్రా మరణానంతరం ప్రచురించని తన రచనలనన్నింటినీ కాల్చివేయమని వీలునామాలో రాయడం గమనించవచ్చు.

ఈ సందర్భంలో రచయితలు ఆచరించే మరికొన్ని పద్ధతులు రేకెత్తించే మరికొన్ని ప్రశ్నలను మీముందు పెడతాను. కొంతమంది తాము రాసుకున్న రచనలను ప్రచురింపబడిన తరువాత కూడా మార్పులు చేర్పులతో మళ్ళీ ప్రచురిస్తుంటారు. ఒక సారి తన రచన ఒక తీరుగా ప్రచురింపబడి కాపీరైట్ వచ్చిన తరువాత అదే రచనను మార్పులతో ప్రచురించే హక్కు రచయితలకుంటుందా? కొంతమంది వేరే రచయితల ప్రచురింబడిన రచనలలో కొన్ని పాత్రలను తీసుకుని వాటిని తమకు అనుకూలమైన రీతిలో మలుచుకుని, మార్చుకుని తమ పేరుతోనో, పూర్వ రచయిత ప్రభావాన్ని బహిరంగంగా కృతజ్ఞతా భావంతో చెప్పుకుంటూనో ప్రచురిస్తారు. రచన తాలూకు కాపీరైట్ ఇలాంటి పద్ధతి ఒప్పుకుంటుందా? కేశవరెడ్డి హెమ్మింగ్వేను అనుసరించిన తీరు లేవనెత్తిన ప్రశ్నలు తెలుగు పాఠకులకు సుపరిచితమే. ఇక రీరైటింగ్ పేరుతో ప్రసిద్ధ రచనలను కాలానుగుణంగా తిరగ రాసే పద్ధతి ఒక ప్రధాన ప్రక్రియగా పలు భాషల్లో జరగడం మనం చూస్తూనే ఉన్నాం. ఐతే ఇవన్నీ కాపీరైట్ చట్టాన్ని అతిక్రమిస్తున్నట్టేనా?

ఇక అనువాదాల విషయానికొద్దాం. గొప్ప సాహిత్యంగా పరిగణించబడ్డ రచనలన్నీ ప్రపంచమంతటా అనువాదాల రూపంలో వివిధ భాషల్లోకి అనువదింపబడడం జరుగుతూనే ఉంది. అందులో భాగంగా ఆయా ప్రాంతాల మతాల, రాజకీయ, సాంఘిక పరిస్థితుల ప్రభావంవల్ల, అక్కడక్కడా అనువాదకులు తీసుకొన్న వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబిస్తూ తమదైన రీతిలో వ్యక్తపరచిన రచనలు, తెలుగులో మహాభారతం లాంటి ఉదాహరణలు, అన్ని దేశాల్లో ఉన్నాయి. కాపీరైట్ చట్టం వచ్చిన తర్వాత మూల రచయితల నుండి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితివల్ల ఈ వెసులుబాటు కొంతవరకూ అనువాదకులు కోల్పోయారనే చెప్పాలి.

రచనలు, అవి స్వతంత్ర రచనలైనా, అనువాదాలైనా అవి చేసే వారి మేధోసంబంధమైన శక్తిని, ప్రతిభను వ్యక్తపరచేవిగా, ప్రత్యేక సాంఘిక, రాజకీయ, మరెన్నో

> ఒక రచయిత తాను చనిపోయిన తరువాత తన రచనలను ప్రచురించవద్దని కానీ, వాటిని ధ్వంసం చేయమని కానీ తన వారసులను ఆదేశించినప్పుడు వారికి అందుకు భిన్నంగా వ్యవహరించే నైతిక హక్కు ఉంటుందా?

ఇతర పరిస్థితులకులోనై ఉద్భవిస్తాయి. కాలప్రవాహంలో ఒక రచన ముందుగానూ, మరొకటి తరువాతా రావొచ్చు. అలాంటప్పుడు తదుపరిగా వెలువడే సాహిత్యాన్ని ముందు వెనుకల నెపంతో, ఆస్తి హక్కుల పరిరక్షణ పేరు విలువలేనిదిగా పరిగణించడం సబబేనా? సాహిత్యాన్ని అమ్మే, కొనే వస్తువుగా పరిగణించడం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పరిణామ పర్యవసానంగా భావించవచ్చా? ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఓపెన్ ఆక్సెస్ వెబ్‌సైట్‌లలో తమ ఆలోచనల్ని పంచుకోవడం అనే పద్ధతి ఈ పరిస్థితులను అధిగమించడానికి సహకరిస్తుందా?

● ఎమ్. శ్రీధర్

మెతుకు కలల బ్రతుకు పద్యం

కలలకు రంగులు అద్దాలి
కళకు మెరుగులు దిద్దాలి
పడుగు పేక పద్యం
అల్లుతూనే ఉండాలి
పొయ్యి మీది కుండ
పరమాన్నం అయ్యే వరకు

మెతుకు పోగయ్యే వెతుకులాట
ఎప్పుడూ ఒడ్డునపడ్డ చేపపిల్లే

నోరులేని బ్రతుకు
మగ్గంతో మాట్లాడుతుంది
కండెపోగుతో మాట్లాడుతుంది
ఎంత మాట్లాడితే అంత
బువ్వ కూడుతుందని

నగరం చుట్టూ గిరికీలు కొడుతూ
గిరాకీ లేదని
కాలం
మూడు పుష్కరాలు తిన్నది

పని సమంగా పంచుకునే ధర్మనీతి
పాతిపెట్టి
దర్జాగా పెద్దర్వాజా
కలలు ఎత్తుకుపోయే దొంగశాస్త్రం
చదువుతున్నది

బెల్లం లాంటి మాటలకు
ఎత్తిన పిడికిళ్ళు
తలలూపుతున్న చంటి పోరలు
కొడవలి లాంటి ప్రశ్నలు
నక్క జిత్తులకు
నానుతున్న తాబేలు బుర్రలు
సింహం లాంటి వాళ్ళు
రింగు మాస్టర్ ముందు
డూడూ బసవన్నలు

పైసకు కాకపోయినా
పనికి చేయిచాపు నా సోదరులు
తాటాకు చప్పుళ్ళకు
బెదురుతున్న కుందేలు పిల్లలు



నేత కూలీ ఎవుసం
ఎవడు పెట్టిన ఇత్తనమో
పంట
ఎప్పటికీ చేతికి రాదు.

● గజ్జెల రామకృష్ణ
✆ 89774 12795

రసరంజని వార్షికోత్సవం

రసరంజని 31వ వార్షికోత్సవ వేడుకలు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో మార్చి 25 నుంచి 27 వరకు జరుగుతున్నాయి. 25న ప్రారంభ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్, బొల్లినేని కృష్ణయ్య, మామిడి హరికృష్ణ, బుర్రా సాయిమాధవ్ పాల్గొంటారు. 26న రెండవ రోజు కార్యక్రమంలో మాజీ స్పీకర్ యస్. మధుసూదనాచారి, మాడభూషి శ్రీధర్, యం.దివాకరబాబు అతిథులుగా పాల్గొంటారు. 27న ముగింపు సభలో కె.వి. రమణాచారి; తనికెళ్ళ భరణి; డి.యస్.యస్. మూర్తి అతిథులుగా పాల్గొంటారు.

కందిమళ్ళ సాంబశివరావు

అంతఃప్రపంచంలో కవిత్వాన్వేషణ

తన తొలి కవితా సంపుటి 'కుండీలో మర్రి చెట్టు' (1993)తో సున్నితత్వం ఉన్న సుకవిగా గుర్తింపులోకి వచ్చాడు రవిశంకర్. తర్వాత ముప్ఫయ్యేళ్ళ వ్యవధిలో 'వేసవి వాన', 'రెండో పాత్ర', 'మంచు కరిగాక' సంపుటాల్ని వెలువరించాడు. అన్నీ కలిపి ఓ 180 కవితలు, అంతే!


తన మొదటి సంపుటి 'కుండీలో మర్రిచెట్టు'తో ప్రామిసింగ్ పొయెట్‌గా రూఢీ అయిన రవిశంకర్ తదనంతర సంపుటాల లోనూ అదే ఒరవడిని కొనసాగించాడు. ఎక్కడా తొట్రుపడలేదు. దారి తప్పలేదు. తనదైన సున్నితత్వాన్ని కోల్పోలేదు. ఆకాశమే హద్దుగా కొమ్మలూ, రెమ్మలూ, ఊడల్తో దశ దిశలకీ విస్తరించే మర్రి చెట్టు రెక్కల్ని విరిచి కుండీలో అలంకారప్రాయమైన 'మరుగుజ్జు వృక్షం'గా మలచటాన్ని ఇతివృత్తంగా తీసుకొని గొప్ప కవిత నిర్మించాడు. ఇదే పుస్తకంలో తన మాతృమూర్తి మరణానికి కారణమైన వైద్యుడి నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, 'నిన్నెప్పటికీ క్షమించలే' నంటూ రాసిన కవితని చదివినప్పుడు కలిగే అలజడీ అశాంతీ మనల్ని వెంటాడతాయి. రవిశంకర్ కవిత్వం సరళంగా, సూటిగా ఉంటూనే చెరగని అనుభూతి ముద్ర వేస్తుంది. ఏం రాసినా ఒక యెరుక, స్పష్టత తోనే రాశాడు. అపభ్రంశ పదాలూ, వాక్యాల్ని గుప్పించి అయోమయంలోకి నెట్టి, అదే కవిత్వమని భ్రమింప జేయలేదు. అతడికి శబ్దలౌల్యం లేదు. సర్కస్ ఫీట్లు చెయ్యడు.

> సాధారణ అంశాల్ని కవిత్వంగా మలిచే క్రమంలో సార్వత్రిక సత్యాలుగా ఆవిష్కరించినప్పుడు, అట్లా ఆవిష్కరించిన పద్యాలు తమ పరిధిని మించిన విస్తృతార్థాన్ని ఇస్తే కనుక అవి తెరచుకున్న పద్యాలని ఇస్మాయిల్ అభిప్రాయం! ఆ అర్థంలో రవిశంకర్ కవితలు కూడా తెరచుకున్న పద్యాలే!

అచ్చమైన వాడుక భాషలో రాస్తాడు.

తనదైన అనుభవాన్ని తన భావనా పటిమతో బలంగా నిర్మిస్తాడు రవిశంకర్. అతడి కవిత్వపు భాష జీవితమంత సరళం. జీవితంలాగే ప్రగాఢం. పొయెట్రీ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్ స్కూల్‌కి చెందిన వాడు. 1980 ప్రాంతాల్లో ఈ అనుభవ కవిత్వానికి కాకినాడే వేదిక! నాకూ, గోదావరిశర్మకి, రవిశంకర్‌కి, శిఖామణికి, రవిప్రకాష్‌కి, చినవీరభద్రుడికి... మా అందరికీ లచ్చిరాజువీధి లోని ఇస్మాయిల్ గారి ఇల్లే సమావేశ స్థలి. ఇస్మాయిల్ ముందుమాటల తోనే నా 'అంతర్నేత్రం', శిఖామణి 'మువ్వల చేతి కర్ర', రవిశంకర్ 'కుండీలో మర్రి చెట్టు' కవితాసంపుటాలు వెలువడటం ఒక విశేషం! నా కవితల్ని ఇస్మాయిల్ తెరచుకున్న పద్యాలు అన్నారు. సాధారణ అంశాల్ని కవిత్వంగా మలిచే క్రమంలో సార్వత్రిక సత్యాలుగా ఆవిష్కరించినప్పుడు, అట్లా ఆవిష్కరించిన పద్యాలు తమ పరిధిని మించిన విస్తృతార్థాన్ని ఇస్తే కనుక అవి తెరచుకున్న పద్యాలని ఇస్మాయిల్ అభిప్రాయం! ఆ అర్థంలో రవిశంకర్ కవితలు కూడా తెరచుకున్న పద్యాలే!

'ఆఖరి మనిషి' కవితలో రవిశంకర్ ఇలా అంటాడు: "క్రమక్రమంగా/ మరణానికి అలవాటు పడటమే/ జీవితంగా మారిపోతుంది./ నటులే కాదు, ప్రేక్షకులు కూడా/ ఒకరొకరుగా నిష్క్రమిస్తారు/ రంగస్థలం మీది విషాదానికి/ కలిసి కన్నీరు పెట్టటానికి/ ఇరువైపులా ఎవరూ కనపడరు." ఆధునిక మానవ జీవన విషాదానికి, బంధాల లోని డొల్లతనానికి ఇంతకి మించి వేరే వ్యాఖ్యానం ఏముంటుంది?



'ఆట' అనే ఇంకో కవితలో- "చుట్టూ మంచు కప్పబడినప్పుడు/ చెట్లు యోగ ముద్ర దాలుస్తాయి/ అది కరిగాక అదే చెట్ల మీద/ అవే పువ్వులు వలస పక్షుల్లా వచ్చి వాల్తాయి./ అవే వానలు, అవే ఎండలు/ అలాగే కురిసి, మెరుస్తాయి/ రాలే ఆకుల మీద అవే రహస్య హస్తాలు/ రంగు రంగుల సంతకాలు చేస్తాయి." ఒక దృశ్యాన్ని కవిత్వం చేసి అన్యాపదేశంగా చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పబూనటమే రవిశంకర్ కవిత్వ లక్షణం! విలియం కార్లోస్ విలియమ్స్ అంటాడు, "కవిత్వాన్ని వినిపించకు. చూపెట్టు" అని! నిజమే కదా! ధ్వనించేది కవిత్వమే కాదు. దృశ్యమానమై ఇంద్రియాల్ని స్పృశించేదే సిసలైన కవిత్వం. కవిత్వానికి రంగూ, రుచీ, వాసనా ఉంటాయి. వాటిని సమర్థవంతంగా పట్టి చూపి, ప్రకటించగలిగిన వాడే కవి! అటువంటి ఆధునిక కవి రవిశంకర్!

సర్వ సాధారణమైన ఒక చిన్న అనుభవాన్ని సార్వత్రిక సత్యంగా మలచి 'మళ్ళీ వసంతం' అనే పద్యం రాశాడు రవిశంకర్. "నిత్యం పరిభ్రమించే భూమి మీద/ ప్రతి జీవికి ఋతువులుంటాయి/ కానీ, ఒక చెట్టును మాత్రమే వసంతం/ మళ్ళీ మళ్ళీ వచ్చి తట్టి పలకరిస్తుంది," అంటాడు.

వర్షంలో చెట్టు గురించి ఇలా రాస్తున్నాడు: "జలజలా కురిసే వానలో/ తలారా స్నానం చేసి/ తడి బట్టలతో సిగ్గుల మొగ్గైన/ పడచు పిల్లలా మెరుస్తుంది."

మంచు కరిగాక కన్పట్టే దృశ్యాన్నిలా కళ్ళక్కడుతున్నాడు: "పదిలంగా నిన్న మోసిన అడుగుజాడల్ని/ మంచు ఈ రోజు మర్చిపోయింది/ అది వదిలి వెళ్లిన జాడలు మాత్రం/ అక్కడక్కడా మెరుస్తున్నాయి." ఇక్కడ మంచు మనిషికి ప్రతీక! మనిషి గతిస్తాడు. కానీ, అతను వదిలివెళ్లిన జ్ఞాపకాలు అన్నీ ఇన్నీ ఉంటాయి. ఆ జ్ఞాపకాల్లో అతను జీవించే ఉంటాడు. రాత్రి కురిసి ఉదయానికి కరిగి అదృశ్యమయ్యే 'మంచు'కి శాశ్వతత్వాన్ని ఆపాదిస్తున్నాడు కవి. ఇటువంటి భావలయతోనే అప్పుడే పుట్టిన కూతురి గురించి రాశాడు రవిశంకర్. అమ్మ పోలికతో కూతురు పుట్టటాన్ని, "పెద్దల పోలికలు పిల్లల్లో రావటం వల్ల తర తరాలకి వాళ్ళ జ్ఞాపకాలు పదిలమౌతాయనే" అర్థంలో!



స్థిరంగా, సచేతనత్వంతో, సున్నితమైన కవిత్వాన్ని రాస్తున్న రవిశంకర్, "ఇక ముందు రోజుల కోసం ఒక కొత్త శక్తిని/ సమకూర్చుకొని/ ఇంకొక కొత్త దీపాన్ని వెలిగించే చమురు కోసం/ అంతః ప్రపంచంలో అన్వేషణ సాగించా"లని, "ఈ కారుచీకటిలోకి మిణుగురేదో/ ఒక సంశయాత్మక కాంతి బిందువై/ ప్రవేశించాలి" అని తను అన్నట్టు గానే, తానొక కాంతి బిందువై పఠితల హృదయాలలోకి ప్రవేశించి అనవరతం ప్రసరిస్తూనే ఉండాలని అభిలషిద్దాం!

● రవూఫ్
✆ 98491 93657

నలువైపులా ఒకే దృశ్యం

ప్రతిరోజూ పరీక్షే. బతుకంతా పరుగే.
ఏం బావుకుంటున్నదీ ఎవరికీ అర్థం కాదు.

థర్డ్ డిగ్రీ దెబ్బలు. తకిట తధిమి నృత్యాలు.
ఏ పక్క చెవినీ నోచుకోని హాహాకారాలు.

సర్వం పైసాచికం. బంధాలు కేవలం
బంధనాలు.
ఎవరికెవరూ ఏమీ కారనే ఏకవాక్య
తీర్మానాలు.

విషాదం విడిగా ఉండదు. ముసుగుకూ,
ముస్తాబుకూ అవినాభావ సంబంధం.

స్థల కాలాదులు నిమిత్త మాత్రం. నాటకం
నిత్యకృత్యం. పెదవి అంచు ప్రేమలయందు
జగతి వర్ధిల్లుచున్నది.



● మోహన్ రుషి

కవిత - 2023

సాహితీమిత్రులు, విజయవాడ ప్రతి ఏటా తెస్తున్న కవిత వార్షికల్లో భాగంగా ఈ సంవత్సరం మే 1న వెలువడబోయే 'కవిత 2023' కోసం కవితల ఎంపిక జరుగుతోంది. మా దృష్టికి రాని కవితల కోసం ఆహ్వానం పలుకుతున్నాం. మీరు పంపే కవితలు 2023 జనవరి నుంచి డిసెంబర్ మధ్య ఏదైనా ప్రింట్ లేదా ఆన్‌లైన్ పత్రికలలో ప్రచురితమైనవై ఉండాలి. ఎంపికపై తుది నిర్ణయం సంపాదకులదే. మీ కవితల సాఫ్ట్ కాపీని ఈమెయిల్: editor.kavita2023@gmail.com కు మార్చ్ 30 లోగా మెయిల్ చేయాలి.

సాహితీమిత్రులు

ఉగాది కవిసమ్మేళనం

ఉగాది కవి సమ్మేళనం ఏప్రిల్ 5 ఉదయం 10గంటలకు సిద్దిపేటలోని కొత్త బస్టాండ్ దగ్గర శివానుభవ మంటపంలో జరుగుతుంది. పాల్గొన్న కవులు కవయిత్రులకు 'శ్రీ వేముగంటి నరసింహాచార్యుల ఉగాది పురస్కారం' ప్రదానం చేయబడును. అన్ని ప్రాంతాల వారు పాల్గొనవచ్చు.

వెన్నెల సాహితీ సంగమం

"కులంతో ముడిపడిన ప్రతీ జీవన సందర్భం నాకు కథావస్తువే"

దళితకథా సాహిత్యంలో సైతం తనదైన వస్తువుతో ఆధునిక దళిత జీవితాలను ఆవిష్కరిస్తున్న పసునూరి రవీందర్ కథలు ఇప్పటికే హిందీ, కన్నడ భాషలలోకి అనువాదం అయ్యాయి. తాజాగా పాంథర్స్ పా పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో అతని మొదటి కథా సంపుటి 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' (కె. దామోదర్రావు సారథ్యంలో) ఇంగ్లీషులోకి అనువాదం అయ్యింది. ఈ సందర్భంగా పసునూరి రవీందర్ పలకరింపు...



పసునూరి రవీందర్ • పలకరింపు

దళిత కథను పట్టణ బాట పట్టించిన మీకు... ఆ కోణంపై పట్టు ఎలా దొరికింది?

ఇందుకు నా నేపథ్యమే కారణం. నేను పుట్టి పెరిగిన సెమీ అర్బన్ జీవితమే కారణం. నాకంటే ముందు దళిత సాహిత్యకారులంతా గ్రామం తాలూకు కుల వివక్ష మీద దృష్టిసారించారు. నేను పట్టణంలో జీవిస్తుండడం వల్ల ఇక్కడ దళితులు ఎదుర్కునే వివక్ష అర్థమైంది. అందుకే ఈ పట్టణకేంద్ర వివక్షను వస్తువుగా ఎంచుకున్నాను. గ్రామాల్లో అనేక అవమానాలు పడి పట్టణాలకు వచ్చిన దళితులను పట్టణాలు, నగరాలు సైతం ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. ఈ జీవితాన్ని అనుభవిస్తే తప్ప దాన్ని రాయలేం. అట్లా నేను రెండు దశాబ్దాలుగా నగరంలో చూస్తున్న కుల వికృత పోకడలను కథలుగా మలుస్తున్నాను. ఇందుకోసం నేను పెద్దగా వెతుక్కోవాల్సిన పరిస్థితేమీ లేకుండానే కులం నెట్వర్క్ నన్ను వైఫైలా వెంటాడుతూనే ఉంది.

ఇటీవల మీ రెండవ కథా సంపుటి 'కండీషన్స్ అప్లయ్'లో వస్తు విస్తృతి గురించి?

ఇందులో 19 కథలు ఉన్నాయి. దీనిని లిఖిత ప్రెస్ ప్రచురించింది. పట్టణకేంద్ర కుల వివక్షతతో పాటు దళిత కన్నీళ్లు కష్టాలే కాదు, దళిత సంస్కృతి, దళిత విజయాలు కూడా నమోదు చేయాలనే స్పృహతో నేను ఈ కథలు రాశాను. ముఖ్యంగా తెలంగాణ అవతరణ అనంతరపు పరిస్థితుల మీద కూడా కథలు ఉన్నాయి. అలాగే ఆధునికత పేరుతో అభివృద్ధి మాత్రమే కాదు ధ్వంసమవుతున్న మానవ సంబంధాల తాలూకు ప్రతిఫలనాలు సైతం నా కథా వస్తువులుగా మారాయి. నేను రాయకుండా ఉండలేని ఇతివృత్తాలు ఇవి. రోజురోజుకు విస్తరిస్తున్న కులజాడ్యపు జబ్బు ఇప్పుడు పట్టణాల్లో సైతం తిష్ట వేయడమే అందుకు కారణమని నమ్ముతాను.

ఎక్కువగా ఇంగ్లీష్ టైటిల్స్ పెడుతుంటారు... దళిత సాహిత్యం లేదా దళిత పాఠకులు ఆ స్థాయి చైతన్యాన్ని కలిగి ఉన్నారనా మీ ఉద్దేశ్యం?

నా ఉద్దేశ్యం అది కాదు. కాకుంటే ప్రత్యామ్నాయ పంథాను సృష్టించడంలో ఇది కూడా ఒక ఎత్తుగడగా నేను భావిస్తున్నాను. సాంస్కృతిక పరాయికరణ ప్రభావం దళిత రచయితల మీద కూడా చాలా ఉంది. దళితులకు సొంత కల్చర్ ఉంది. అది వారి జీవన విధానం నుండి వచ్చింది. ఆ మూలవాసీ తాత్విక భూమికతో కూడిన శీర్షికలు పెట్టాలి. కాకుంటే పాఠక లోకం దళిత సాహిత్యాన్ని గురించి అంత ఆసక్తి చూపి అర్థం చేసుకుంటుందని నేను అనుకోను. ముఖ్యంగా ఈ తరం చదవాలంటే ఈ రకమైన టైటిల్స్ తప్పవు. అలాగే నా ఇతివృత్తానికి సరిపడే టైటిల్ ఇంగ్లీషులో దొరికితే దానిని పెట్టడం వల్లనే పాఠకులకు ఎక్కువగా రీచ్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

> రానున్నదంతా బహుజన సాహిత్య యుగమే. దళితుల్లో రచనలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్త కలాలు, గళాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు కారణం అంబేద్కరిస్టు చైతన్యమే. సాహిత్య రంగంలో తిష్టవేసుకున్న విశ్రాంతవర్గాల సాహిత్యం ఆగిపోనుంది. కింది కులాల నుండి ఎదిగి వస్తున్న విద్యావంతులు సాహిత్య ప్రాముఖ్యతను గుర్తిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరపు పరిస్థితుల ప్రభావం మీ కథలపై ఎలా ఉంది?

తెలంగాణకు ముందైనా, తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరమైనా దళితుల జీవితాల్లో పెద్దగా మార్పు వచ్చిందేమీ లేదు. చితికిపోయిన అమరవీరుల కుటుంబాల దైన్య స్థితి మీద, నిరుద్యోగుల గోసల మీద సైతం నేను దళిత నేపథ్యం నుండి రాస్తున్నాను. ముఖ్యంగా కులంతో ముడిపడిన ప్రతీ జీవన సందర్భం నాకు కథా వస్తువే. అది రాసేవరకు నా వెంటపడుతూనే ఉంటుంది. అట్లా నిత్యం ప్రతీపోట కులం వల్ల బాధింపడే బాధితులంతా నా కథల్లోని పాత్రలుగానే మారుతుంటారు. ముఖ్యంగా దళితుల మీద పెరిగిపోతున్న దాడులు సైతం ఇంకా రాయాల్సే ఉంది.

కథా ప్రక్రియే గాక కవిత్వం, పాట, పరిశోధన, విమర్శ వంటి ప్రక్రియల్లో మీరు ఏకకాలంలో రచనలు చేయడం గురించి చెప్పండి?


ఈ ప్రక్రియలేవి కావాలని ఎంపిక చేసుకొని రాస్తున్నవి కావు. నేను బేసికల్లీ సామాజిక కార్యకర్తను. ఉద్యమ అవసరాల్లో భాగంగా ఏది అవసరమైతే అది రాస్తున్నాను. ఇక సఫలం, విఫలం అనేది పాఠకులు చెప్పాలి. నేను వందకు పైగా పాటలు రాశాను. విమర్శ మీదే ఎంఫిల్, పీహెచ్డీ చేశాను. అలాగే చాలామందిలాగే నేను కూడా మొదట కవిత్వమే రాశాను. ఆ తరువాతే మిగిలినవి రాసుకుంటూ వచ్చాను. ఇట్లా ఆయా ప్రక్రియల్లోకి ప్రవేశం అనేది నాకు తెలియకుండానే జరిగిపోయింది. ఇప్పటికి కూడా సామాజిక ఉద్యమ అవసరాల్లో భాగంగా నా వంతు పాత్ర పోషించడం కోసమే రాస్తాను.

దళిత కథ గమ్యం - గమనం ఎలా ఉన్నాయి?

రానున్నదంతా బహుజన సాహిత్య యుగమే. దళితుల్లో రచనలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్త కలాలు, గళాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు కారణం అంబేద్కరిస్టు చైతన్యమే. సాహిత్య రంగంలో తిష్టవేసుకున్న విశ్రాంతవర్గాల సాహిత్యం ఆగిపోనుంది. కింది కులాల నుండి ఎదిగి వస్తున్న విద్యావంతులు సాహిత్య ప్రాముఖ్యతను గుర్తిస్తున్నారు. ముఖ్యంగా సాహిత్యంలో తమ పేజీని వెతుక్కుంటున్నారు. తొంభయవ దశకంలో జి.లక్ష్మీ నర్సయ్య, త్రిపురనేని శ్రీనివాస్ వంటి వారు వేసిన మార్గాన్ని మరింత పటిష్టం చేస్తున్నారు. ఇటీవల సంగిశెట్టి శ్రీనివాస్, గుడిపల్లి నిరంజన్ సంపాదకత్వంలో 'తెలంగాణ దళిత కథ' అనే బృహత్ కథా సంకలనం వెలువడింది. మూడేళ్లుగా దళిత కథా వార్షిక వెలువడడం కొత్త చరిత్ర. అలాగే జిలుకర శ్రీనివాస్ 'బైండ్ల చంద్రయ్య' వంటి కథలు వచ్చాయి. సామాజిక బాధ్యతతో కూడిన దళిత కథకు ఇది వికసన దశ అని చెప్పవచ్చు.

✆ 77026 48825

ఆదివారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 37.0°C | కనిష్టం : 24.0°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.34 గం..
సహర్ : మంగళవారం ఉ : 4.54 గం..

అరకొర వేతనం జీవనం

- అవస్థల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు
- దశాబ్దాలుగా పని చేస్తున్నా వెట్టిచాకిరి విధులు
- అసలు పనులకు అదనంగా పథకాల బాధ్యతలు
- జీతాల పెంపు విన్నపాలు బుట్టదాఖలవుతున్న వైనం
- కొత్త ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలతో టీచర్లు, ఆయాలు



హనుమకొండ సిటీ, మార్చి 24: గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య పరిరక్షణలో వారిదే కీలక పాత్ర. శిశువు ఆరోగ్య పరిరక్షణతో పాటు మూడేళ్ల నుంచి ఆరేళ్లవరకు పిల్లలకు విద్యాబుద్ధులు కలిగించడంలో నిర్విరామ కృషి చేస్తుంటారు. విద్య ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు తెలియచేసి పిల్లల చదువును అడ్డుకోకుండా మెప్పించడంలో నిరంతర శ్రమ పడుతుంటారు. ఒకవైపు ఈ బాధ్యతలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, అనేకానేక సర్వేల నమోదులోనూ వారు విధులు నిర్వహిస్తున్నారు. ఇంత చేసినా వారి వేతనాలు అరకొరే. చాలీచాలని వేతనాలతో మూడు దశాబ్దాలకు పైగా విధులు నిర్వహిస్తూ అలసి సొలసిన జీవితాలు, జీతాలతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విసిగివేసారుతున్నారు. వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి చేస్తున్న విన్నపాలు బుట్టదాఖలు అవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అయినా తమ బతుకులను మారుస్తుందనే ఆశతో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

రూ.13,600 వేతనమే..

1975లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రారంభమైంది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్య పరిరక్షణ, విద్యను అందించడం ప్రధాన విధులుగా అంగన్‌వాడీ టీచర్లు పని చేస్తున్నారు. అయితే వీరి వేతనాల విషయంలో ప్రభుత్వం మాత్రం స్పందించ డం లేదు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. లక్ష్యాల సాధనకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై మోపిన విధుల భారానికి సమానంగా వేతనాలు మాత్రం అందచేయడం లేదు. టీచర్లకు రూ.13,600 మాత్రమే అందచేస్తోంది. ఆయాలకు రూ.7,800 జీతాన్ని ఇస్తోంది. 1000 నుంచి 1500 వందల జనాభాకు అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రా ల ద్వారా పోష్టికాహారాన్ని అంగన్‌వాడీ టీచర్లు అందచేస్తున్నారు. ఇక బాలింతలకు సైతం ఆరోగ్యక రమైన విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. 3 నుంచి 6 ఏళ్ల పిల్లలకు విద్యతోపాటు ఆరోగ్యం, కేంద్రాల్లో పౌష్టికాహారం అందించే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ దశలో ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వేతనాలను పెంచకపోవడం విమర్శలకు తావిస్తోంది.

30 ఏళ్లుగా పని చేస్తున్నా..

అంగన్‌వాడీ టీచర్లలో కొందరు 30 ఏళ్లకుపైగా పని చేస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ వేతనాలు పెంచడం లేదని అసంతృప్తికి లోనవుతున్నారు. ఇక పలు చోట్ల టీచర్లు రెండేసి కేంద్రాలకు సైతం విధులు నిర్వహిం చాల్సి వస్తోంది. ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తు న్నారు. టీచర్ల నియామకాలు చేపట్టకపోవడమే ఇం దుకు కారణం. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యాలూ కుంటుపడుతున్నాయి. మరికొన్ని చోట్ల ఆ యా పనులు కూడా టీచర్లే చేసుకోవాల్సి వస్తోంది.



గర్భిణీలకు పౌష్టికాహార ప్రాధాన్యతను చెబుతున్న టీచరు (ఫైల్)

ప్రీ ప్రైమరీ టీచర్లుగా గుర్తించాలి..

తమను ప్రీప్రైమరీ టీచర్లుగా గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వానికి దశాబ్దాలుగా విజ్ఞప్తి చేస్తున్నారు. 3 నుంచి 6 ఏళ్ల వయస్సులోని పిల్లలకు విద్యను అందిస్తున్న దశలో తమను ప్రీప్రైమరీ టీచర్లుగా ప్రభుత్వం గుర్తించాలని అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వాలకు విన్నవిస్తూ వస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన ఉండడం లేదు. ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు వేసవిలో 45 రోజుల వరకు సెలవులు ఉంటాయి. తమకు మాత్రం సెలవులే ఉండవని, ఏడాది పొడవునా విధులు నిర్వహించాల్సి వస్తోందని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం ఒంటిపూట నిర్వహణ జరపాలని వేడుకున్నా పాలకులు పట్టించుకోవడం లేదంటున్నారు.

రూ.26వేల వేతనం ఇవ్వాలి..

ప్రభుత్వం రూ.26వేల కనీస వేతనాన్ని ఇవ్వాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ఆయాలకు రూ.18వేల వేతనం కల్పించాలనే డిమాండ్లు ఉన్నాయి. ఈ డిమాండ్ల సాధన కోసం టీచర్లు, ఆయాలు ధర్నాలు, నిరసనలు ఇలా వివిధ రూపాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ పోరాటాన్ని సాగిస్తున్నారు.

- అలాగే ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేసి ప్రీ ప్రైమరీ టీచర్లుగా గుర్తించాలని, సర్వీస్ మేరకు వేతనాలు కల్పిస్తూ సంవత్సరానికి రూ.500 ఇంక్రి మెంట్ అందచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. శాఖాపరమైన పరీక్షల నిర్వహణతో వయస్సుతో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించా లంటున్నారు.
- రిటైర్మెంట్ అయిన టీచర్లకు రూ.5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షలు అందచే యాలని, కారుణ్య నియామకాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు, ఈహెచ్ఎస్ కల్పన, ప్రతి నెల 1వ తేదీనే వేతనాల అందజేత తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నారు.

అదనపు బాధ్యతలు

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణే టీచర్ల ప్రధాన బాధ్యత. అయితే వీరిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు భారాలను మోపుతోంది. వేతనాలను పెంచడంలో దృష్టిపెట్టని ప్రభుత్వాలు.. అదనపు పనులను మాత్రం అంగన్‌వాడీ టీచర్లకు అప్పగిస్తోంది. అనేక సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, సర్వేలు చేపట్టడంలో డ్వాక్రా సంఘాల తరువాత ఆ స్థాయిలో అదనపు భారాన్ని అంగన్‌వాడీ టీచర్ల నెత్తిన పడుతోంది. వేతనాలు పెంచకుండా ఉన్న పనులకు తోడు అదనపు పనులు అప్పగించడం భారంగా పరిణవించిందని టీచర్లు వాపోతున్నారు. హనుమకొండ జిల్లాలో పరకాల, భీమదేవరపల్లి, హనుమకొండతో కలిసి మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా, టీచర్లు, ఆయాలు కలిపి 753 వరకు పని చేస్తున్నారు. వీరంతా వేతనాల సమస్యను ఎదుర్కొంటున్నారు.



కారు స్టీరింగ్ ఎవరికో?!

వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్ష పగ్గాలు ఎవరికి దక్కేనో?

- అరూరి రమేష్ రాజీనామాతో ఏర్పడ్డ ఖాళీ
- కొత్త అధ్యక్షుడి కోసం అధిష్ఠానం అన్వేషణ
- పెద్ది సుదర్శన్‌రెడ్డి వైపే బీఆర్ఎస్ నేతలు చూపు
- పరిశీలనలో నన్నపునేని, చల్లా, పెద్ది స్వప్న పేర్లు
- పార్టీని బలోపేతం, వలసలను నిలువరించే నేతకే పగ్గాలు
- కొత్త అధ్యక్షుడిపైనే రెండు లోక్‌సభ అభ్యర్థుల గెలుపు బాధ్యతలు

(వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వరంగల్ గులాబీ కారు స్టీరింగ్ ఎవరికి చేతికి ఇవ్వాలో బీఆర్ఎస్ అధిష్ఠానం అన్వేషిస్తోంది. వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఇటీవల బీజేపీలో చేరారు. దీంతో వరంగల్ గులాబీ కారు ముందుకు నడిపే నాయకుడి కోసం అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఇప్పటికే ఒక్కొక్కరు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్న క్రమంలో.. జిల్లా అధ్యక్ష పదవిని పార్టీని బలోపేతం చేస్తూ వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని గెలిపించే సత్తా ఉన్న నాయకుడికి అప్పగించాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లుగా సమాచారం. దీంతో పలువురు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతల పేర్లను పరిశీలిస్తోంది. అయితే గులాబీ పార్టీ పగ్గాలు ఎవరికి

▸▸ మిగతా 8వ పేజీలో..

నమో.. నారసింహో..

- నేటి నుంచి కొమ్మాల జాతర
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- కోడ్‌తో రాజకీయ ప్రభలు, డీజేల నిషేధం



శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

గీసుగొండ, మార్చి 24: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతర నేటి నుంచి వైభవంగా ప్రారంభంకానుంది. ఉగాది వరకు సాగే జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ యేడు ఎన్నికల కోడ్ ఉండడంతో జాతరలో రాజకీయ ప్రభలను, డీజేలను నిషేధించారు. 50 సీసీ కెమెరాలను జాతరలో ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు. భారీ పోలీస్‌బందో బస్తును ఏర్పాటు చేశారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునే నిర్వహణ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం హోలి వేడుకల్లో మునిగి తేలి సాయంత్రం కొమ్మాల జాతరకు వాహనాలు, ఎడ్లబండ్లపై భక్తులు తరలిరాటవం ఆనవాయితీగా వస్తోంది. దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, సంగెం మండలాల భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే వరంగల్ మహానగరం నుంచి కూడా ఎడ్లబండ్లపై పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. వరంగల్ -నర్సంపేట రోడ్డులో బారులు తీరే ఎడ్లబండ్ల సవ్వడులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు ఆలయ ఈవో శేషగిరి, వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు తెలిపారు. జాతరలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రవిందర్ హెచ్చరించారు.

కాగా, కొమ్మాల ఆలయ పరిసరాలు దుకాణాలతో సందడిగా మారాయి. ఇటీవల టెండర్లు పూర్తవడంతో టెండరు పొందినవారు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆలయ గోపురాన్ని విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. దీంతో ఆలయ పరిసరాలు విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్నాయి.

అరూరికే ఖరారు

- భారతీయ జనతా పార్టీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా రమేష్
- ఐదో జాబితాలో ప్రకటించిన అధిష్ఠానం
- ఎట్టకేలకు ఉత్కంఠకు తెర

హనుమకొండ టౌన్, మార్చి 24: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఇటీవలే బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. బీజేపీ వరంగల్ లోక్‌సభ టికెట్ కోసం అరడజను మందికి పైగా ఆశావహులు ప్రయత్నాలు చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పరకాల మునిసిపల్ చైర్మన్ రాజభద్రయ్య, బీజేపీ సీనియర్ నేతలు చింత సాంబమూర్తి, మాజీ మంత్రి గుండె విజయరామారావులతో పాటు మాజీ డీఐజీ టి.కృష్ణప్రసాద్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు అరూరికే కమలనాథులు మొగ్గుచూశారు. కాగా, వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఖరారు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి తేలలేదు.

వరంగల్ లోక్‌సభ సీటుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. బీజేపీకి మద్దతు ఇస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో బీజేపీ పెద్దలు సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో బీజేపీలో చేరేందుకు అరూరి రమేష్ సముఖత వ్యక్తం చేశారు. అయితే అరూరి బీజేపీలోకి వెళ్ల కుండా బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఒకదశలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసేందుకు రమేష్ ప్రెస్‌మీట్ పెడితే.. అదే రోజు బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, బస్వరాజు సారయ్య, నాగుర్ల వెంకన్న తదితరులు రమేష్‌ను బలవంతంగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి కేసీఆర్‌తో సమావేశం నిర్వహిం చారు. వరంగల్ ఎంపీ టికెట్ రమేష్‌కు ఇచ్చేందుకు కేసీఆర్ అంగీకరించినప్పటికీ పోటీకి అరూరి సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో వెంటనే కడియం కావ్య పేరును అధిష్ఠానం ప్రకటించింది. దీంతో పార్టీ మారటంపై అరూరి కొంత తర్జనభర్జనల తరువాత బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఈనెల 17న కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం జిల్లాలో బీజేపీ ముఖ్యులను కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. అనుకున్నట్లుగానే ఆదివారం ఐదో జాబితాలో అరూరి రమేష్ పేరును అధిష్ఠానం ఖరారు

▸▸ మిగతా 8వ పేజీలో..



హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డిని కలిసిన అరూరి రమేశ్

బయోడేటా

పేరు	అరూరి రమేశ్
తండ్రి	గట్టుమల్లు
తల్లి	వెంకటమ్మ
భార్య	కవితకుమారి
విద్యాభ్యాసం	ఎంఏ ఎల్ఎల్‌బీ, సోషియాలజీ
పిల్లలు	కుమారుడు విశాల్, కుమార్తె అక్షిత
కులం	మాదిగ
స్వగ్రామం	జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్ గ్రామం

కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచండి

నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కంట్రోల్ సెంటర్‌లో అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 24: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ (ఐసీసీసీ) నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. కమిషనర్ మున్సిపల్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును ఏజెన్సీ సభ్యులు కమిషనర్‌కు విశ్లేషించారు.

బల్దియా పరిధిలో ఇప్పటికే 7 చోట్ల ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌కు సంబంధించిన ఏర్పాటు చేశామన్నారు. ఇంకా 3 జంక్షన్‌లలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. గతంలో అనుసరించిన పద్ధతి ప్రస్తుత అడ్వాన్స్ పద్ధతిని వివరించారు. జంక్షన్‌కు ఒక వైపు మాత్రమే ఐసీసీసీ ప్రత్యేక యాప్ ద్వారా ట్రాఫిక్ నియంత్రించొచ్చని చెప్పారు. ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చూడొచ్చని వెల్లడించారు. ఏఐసీసీ టెక్నాలజీ ద్వారా వాహనాల గుర్తింపు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘింపుపై చలనాలు విధించనున్నట్లు చెప్పారు. 66 డివిజన్‌లవ్యాప్తంగా జీఐఎస్ సిస్టమ్ ద్వారా ప్రత్యేక మ్యాప్‌ను రూపొందించామన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అన్ని డివిజన్‌లలో సర్వే నిర్వహించి పూర్తి సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌కు అనుసంధానం చేసినట్లు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా త్వరిగతిన పనులు పూర్తి చేసి సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని కమిషర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ సంజయ్‌కుమార్, ఐటీ మేనేజర్ రమేష్, టెక్నీషియన్ పవన్‌లు పాల్గొన్నారు.

అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్

- రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు మొండిచేయి
- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

దేవరుప్పుల, మర్చి 24: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని, వందరోజుల పాలనలో ఆరు గ్యారంటీలు అంటూ నేడు మొండి చేయి చూపిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం ఆయన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావితండాలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో నీళ్లు రాక బోర్లకు నీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు హరీశ్‌రావుతో ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలను చూపించి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటికే 100 రోజుల్లో రాష్ట్రంలో 180మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. రైతులను ఆదుకోవటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. గోదావరి నదిలో నీళ్లఉన్నాకూడా రైతులకు అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆరుగ్యారంటీల్లో రైతులకోసం చెప్పిన ఏ ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నాయకులు అమలు పర్చలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాలువల్లో పుష్కలంగా నీళ్లు పారాయని, రైతులు రెండు పంటలు పండించుకుని సంతోషంగా ఉండేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ వచ్చాక నీళ్లలేవు, కరెంటు లేదని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.25వేలు నష్ట పరిహారం ఇవ్వాలని, వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరు సోమయ్య, హన్మంతు, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.



చింతబాయితండాల్లో రైతులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

హరీశ్‌రావు.. ఇంకా బుద్ధి రాలేదా?

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, మార్చి 24: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావుకు ఇంకా బుద్ధి రాలేదా అంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జనగామలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనలో 120 మంది చనిపోయినట్లు హరీశ్‌రావు మాట్లాడడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మతిభ్రమించి మాట్లాడవద్దని సూచించారు. నిజాయితీ ఉంటే వాస్తవా లతో నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రజలను రెచ్చగొట్టి వారి ప్రాణాలను హరించవద్దని సూచించారు. రాజకీయ ఉనికి కోసం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ప్రజలే రాళ్లతో కొడతారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ దందా బయటపడినా ఆమె ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రజలను నమ్మించే యత్నాలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం దోపిడీని ప్రజలు గుర్తించార న్నారు. తెలంగాణను దోచుకుతిన్నందువల్లే బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని పేర్కొన్నారు. అయినా ఇంకా బీఆర్ఎస్ ముఖ్య నేతలకు బుద్ధి రాలేదని విమర్శించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజాదరణ పొందుతున్నారని నాయిని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసిన మేలంటూ ఏమీ లేదన్నారు. వందరోజుల పాలనలోనే కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తే ఊరుకునేది లేదని నాయిని హెచ్చరించారు.

ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ సుమన్‌కు పురస్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.సుమన్‌కు హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 2023-24 విద్యాసంవత్సరానికి గాను అకడమీషియన్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ 51వ వార్షిక అవార్డుల కార్యక్రమంలో డాక్టర్ సుమన్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విశిష్ట అతిథులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ జేబీ రావు, డీఆర్‌డీవో జనరల్ మేనేజర్ రాజాబాబు హాజరయ్యారు. కాగా, అసోసి యేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా డాక్టర్ సుమన్ పురస్కార ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే ప్రముఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అవార్డును అందుకున్న డాక్టర్ సుమన్‌ను ఎస్సార్ వర్సిటీ వీసీ దీపక్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.



పురస్కార ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న డాక్టర్ సుమన్

25 కోడెలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, మార్చి 24: అనుమానాస్పదంగా డీసీఎంలో తరలిస్తున్న 25 కోడెలను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం కోదాడ నుంచి పెద్దపల్లికి డీసీఎంలో 25 కోడెలను నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా ఓఆర్‌ఆర్‌పై పోలీసులు పట్టుకున్నారు. ఏడు మాత్రమే డీసీఎంలో తరలించాల్సి ఉండగా, 25 కోడెలను తరలిస్తుండటంతో అనుమానం వచ్చి పట్టుకున్నారు.

తరలిస్తున్న నలుగురు వ్యక్తులనుంచి సరైన సమాధానం రాకపోవడంతో కోడెలను ముప్పారంలోని బృందావన్ గోశాలకు తరలించారు. నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కేయూ ఎస్‌ఐ దేవేందర్ ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

- ఏప్రిల్ మూడోవారం నుంచి కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1078 కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం దిగుబడి 14.13 లక్షల మెట్రిక్ టన్నులు
- అందుబాటులో చాలినన్ని గన్నీ బ్యాగులు
- కమీషన్ చెల్లింపులో జాప్యం.. 22 కోట్ల బకాయిలు



ధాన్యం సేకరణ కేంద్రం

హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)ఉమ్మడి వరంగల్ జిల్లాలో యాసంగి (రబీ) సీజన్ ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్ 9.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందు కోసం 1078 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఉమ్మడి జిల్లాలో ఈ సారి యాసంగిలో 9,18,337.59 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 14,13,454 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు అధికారులు పూనుకుంటున్నారు.

మొదలుకానున్న కోతలు

ఉమ్మడి జిల్లాలో మరో 15 రోజుల్లో యాసంగి వరి కోతలు ప్రారంభం కానున్నాయి. గతేడాది సెప్టెంబరులో పంటలు వేసిన రైతులు వరికోతలకు సిద్ధమవుతున్నారు. డిసెంబరు, జనవరి నెలల్లో నాట్లు వేసిన రైతులకు మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. జిల్లాలో వరి కోతలు ప్రారంభమైతే పెద్ద ఎత్తున మార్కెట్‌కు ధాన్యం వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా రైతులు పౌరసరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయం చేస్తారు. ఇప్పటి నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు చేస్తేనే వరి కోతలు వచ్చే సరికి అవి అందుబాటులోకి వస్తాయి. లేకుంటే రైతులు గతేడాదిలా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కాగా ఈ యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున వరిని సాగు చేయగా సాగునీటి సరఫరా, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల నీటి తడులు లేక పొలాలు నెర్రెలుబారాయి. కొందరు మధ్యలోనే పంటను వదిలేస్తున్నారు. దీనికితోడు వడగల్లు, అకాల వర్షాల బెడద కూడా పొంచి ఉంది. ఈ నేపథ్యంలో త్వరగా కోతలు ప్రారంభించి వెంటనే ధాన్యాన్ని విక్రయించాలని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాకు రూ. 2203,. కామన్ ధాన్యానికి క్వింటా రూ. 2183 మద్దతు ధరను ప్రకటించింది.

ఇతరులు కనిపించొద్దు..

రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తులెవరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనిపించకుండా తగిన జాగ్రతలు తీసుకోవల సిందిగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ధాన్యం సేకరణ సిబ్బందికి అప్పుడే ఆదేశాలు జారీ చేశారు. అప్పులు వడ్డీ భారం దృష్ట్యా సకాలంలో సీఎంఆర్ డెలివరీ, బకాయిల రికవరీ జరిగేలా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

గన్నీ బ్యాగులు..

ధాన్యం సేకరణలో గన్నీ బ్యాగుల పాత్ర కీలకం. చాలినన్ని గన్నీ బ్యాగులు లేకుంటే దాని ప్రభావం సేకరణపై పడుతుంది. ఈ దృష్ట్యా సేకరణ ప్రారంభానికి ముందే అన్ని జిల్లాల్లో గన్నీ బ్యాగులు చాలినంత మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని జిల్లాలో అప్పటికే అవసరమైనన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచారు. ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కాగానే వీటిని ఆయా కేంద్రాల ఇండెంట్‌ను బట్టి సరఫరా చేస్తారు. గత యాసంగి సీజన్ కన్నా ఈ సారి ధాన్యం దిగుబడులు పెద్దగా పెరిగే అవకాశాలు లేనందు వల్ల ప్రస్తుతం ఉన్న బ్యాగులు సరిపోతా యని అధికారులు చెబుతున్నారు.

కమిషన్ బకాయిలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పౌరసరాలశాఖ కమిషన్‌ను వెంట వెంటనే చెల్లించకపోవడంతో బకాయిలు రూ. కోట్లలో పేరుకు పోతున్నాయి. ప్రస్తుతం మూడు సీజన్ల బకాయిలు కేంద్రాలకు రావలసి ఉన్నది. సుమారు ఒక్కో జిల్లాకు రూ. 3 నుంచి రూ. 4 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 20 కోట్ల మేరకు బకాయిలు ఉన్నట్టు అంచనా. దీంతో ఐకేపీ, పీఏసీఎస్ అధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై గత కొద్ది రోజులుగా ఒత్తిడి తెస్తున్నాయి. తమకు కమిషన్ బకాయలు చెల్లిస్తే తప్పా ఈ సారి కేంద్రాలను తెరవమని హెచ్చరించాయి. దీనితో ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కావడానికి ముందు మార్చి చివరి వారంలో బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

సౌకర్యాలు..

కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను పౌరసరఫరాల శాఖ అధికారులు కల్పిస్తున్నారు. రైతులు అమ్మకానికి కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షాల వల్ల తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం తూకం త్వరిత గతిన జరిగేందుకు వీలుగా చాలినన్ని తూకం యంత్రాలను, ధాన్యం తేమను కొలిచే పరికరాలను కూడా చాలినన్ని సమకూరుస్తున్నారు. వీటితో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని విల్లులకు చేరవేసేందుకు అవసరమైన లారీలను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలతో ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఈసారి కొత్తగా టెండర్లు పిలిచే అవకాశం లేనందు వల్ల గత లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లనే ఈ సీజన్‌లో కొనసాగించనున్నట్టు తెలుస్తోంది.

జిల్లాల వారీగా..

- వరంగల్ జిల్లాలో రబీలో ధాన్యం కొనుగోలుకు 208 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఈ సారి 1,10,70540 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగయింది. దాన్యం దిగుబడి 2,55,429.18 మె.ట ఉండవచ్చునని అంచనా వేశారు. 1.50 లక్షల మెట్రిక్ టన్నులు మేరకు కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు.
- హనుమకొండ జిల్లాలో 150 కేంద్రాల ద్వారా 1,61 లక్షల మె.ట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో 1,18,061.06 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ మేరకు 3,16,231.57 మె.ట. ధాన్యం దిగుబడి రావచ్చునని అంచనా.
- జనగామ జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు 195 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటి ద్వారా 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సీజన్‌లో 4,33,289.87 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ మేరకు 4,03,468.30 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం సేకరణకు ఈ సారి 192 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 1.70 లక్షల మె.ట ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో 128516.57 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2,52,766.60 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా వేస్తున్నారు.
- ములుగు జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాల ద్వారా 85 వేల మె.ట ధాన్యం సేకరించనున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 46979.40 ఎకరాల్లో వరి సాగు చేశారు. 10477547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.20 లక్షల మెట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో ఈ సారి 80,785.29 ఎకరాల్లో వరి సాగుకాగా దిగుబడి 209976 మెట కావచ్చునని భావిస్తున్నారు.

మహిళపై యువకుడి దాడి

హనుమకొండ టౌన్, మార్చి24: తెల్లవారుజామున ఓ యువకుడు ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ నానా హంగామా చేశాడు. అడ్డుకోబోయిన తల్లిపై కర్రతో దాడిచేసిన సంఘటన హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమార్‌పల్లిలో చోటుచేసుకుంది. కాజీపేటకు చెందిన మల్యాల రమేశ్ అనే యువకుడు.. ఈ నెల 19న ఉదయం 6 గంటల ప్రాంతంలో కుమార్‌పల్లిలోని ఓ మహిళ ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ ఇళ్లంతా గాలించాడు. ఈలోగా మహిళ పోలీసులకు ఫోన్‌చేయడానికి ప్రయత్నిస్తుండగా కర్రతో మహిళ ముఖంపై బలంగా కొట్టగా ముఖంపై గాయాలయ్యాయి. ఆ తర్వాత యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత మహిళ కె.మాధవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వడం లేదంటూ సొంతింటికే నిప్పు

ఇంట్లో సామగ్రి దహనం



నాగారంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

నెక్కొండ, మార్చి 24: చేసిన అప్పులు తీర్చడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని కోపంతో కుమారుడు ఏకంగా ఇంటికే నిప్పుపెట్టిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. వ్యవసాయ కూలీలు కుమ్మరి వెంకన్న-ఐలమ్మ దంపతుల కుమారుడు మధు పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల క్రితం మధు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. వ్యక్తిగత అవసరాలకు మధు రూ.1.50లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు తీర్చడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను నెల రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం కుటుంబంతో మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లిలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చాడు. అక్కడి మధు తల్లిదండ్రులు కూడా వచ్చారు. అక్కడ కూడా డబ్బుల విషయంలో తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. అదే రోజు రాత్రి మధు ఒంటరిగా నాగారంలోని ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి ఇల్లంత చల్లి నిప్పుపెట్టాడు. మంటలు వ్యాపించడంతో స్థానికులు వచ్చి మంటల్ని ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామగ్రి, తలుపులు, కిటికీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో కారణంగా రూ.50వేల వరకు ఆస్తినష్టం వాటిండి. విషయం తెలుసుకున్న ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకొని మధును అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై మధు తల్లిదండ్రులు, బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సుధాకర్‌రావు సేవలు మరువలేనివి

సంతాప సభలో పాల్గొన్న మాజీ మంత్రులు, ప్రభుత్వవిప్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు



సుధాకర్‌రావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు

పెద్దవంగర, మార్చి 24 : పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ వైద్య ఆరోగ్యశ్రీ ట్రస్టు మాజీ చైర్మన్ డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు (74) నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు అందించిన సేవలు మరవలేనివని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం వడ్డెకొత్తపల్లిలో సుధాకర్‌రావు నివాసంలో ఏర్పాటు సంతాప సభలో పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సబ్బండ వర్గాల అభ్యున్నతికి, నియోజకవర్గ అభివృద్ధితో పాటు రైతుల కష్టాలు తీర్చడానికి శ్రీరాంసాగర్ కాలువద్వారా చెరువులు నింపడానికి కృషి చేశారని గుర్తు చేశారు. నిత్యం కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుండేవారని, విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో పనిచేసి సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సేవ కార్యక్రమాలు, వైద్య సేవలందించారని తెలిపారు. వారి కుటంబ సభ్యులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో సుధాకర్‌రావు విగ్రహ ప్రతిష్టాపనకు కృషి చేస్తామని తెలిపారు. సంతాప సభలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ జీసీసీ గాంధీ నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎంపీపీ ఆంజయ్య, జడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, నాయకులు నవీన్, ఐలయ్య, సుధీర్, సీతారాములు, జాటోతు నెహ్రూనాయక్, హరిప్రసాద్, ముత్తినేని శ్రీనివాస్, కుమార్, కుటుంబ సభ్యులు, పలు ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్‌లో నిబంధనలకు తూట్లు

తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్



క్యాంపు అధికారి గోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం క్యాంపుల్లో అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత సేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియారిటిని అతిక్రమించి అధికారులు డ్యూటీలు ఇస్తున్నారని, 10 నుంచి 20 యేళ్ల అనుభం ఉన్న ప్రైవేటు లెక్చరర్లకు క్యాంపుల్లో ఏఈలుగానే విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈలుగా అవకాశం ఇవ్వకుండా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పైస్థాయి విధుల్లో పనిచేస్తున్న కొంతమంది అధ్యాపకులకు ఎన్నిలకు డ్యూటీలు పడినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి డబుల్ డ్యూటీలు చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్‌లోనే ఆర్జేడీ కార్యాలయాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం క్యాంపు అధికారి ఎ.గోపాల్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

కాంట్రాక్టర్ గుప్పిట్లోనే సింథటిక్ ట్రాక్

- డీఎస్‌ఏకు అందుబాటులోకి రాని జేఎన్‌ఎస్ ట్రాక్
- నిర్మాణమై రెండున్నరేళ్లయినా అప్పగింతలో జాప్యం
- కంప్లీషన్ లెటర్ ఇచ్చి ఆర్నెళ్లు
- అయినా పట్టించుకోని పీఆర్ శాఖ



డీఎస్‌ఏకు అప్పగించని హనుమకొండ జేఎన్‌ఎస్ లోని అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్

వరంగల్ స్పోర్ట్స్, మార్చి24: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో నిర్మించిన అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్ పనులు పూర్తయి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇంకా కాంట్రాక్టర్ గుప్పిట్లోనే ఉంది. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నేటి వరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ)కు అప్పగించక పోవటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా..

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఖేలో ఇండియా పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి, అత్యాధునిక హంగులతో సింథటిక్‌ట్రాక్‌ను మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధమాన అథ్లెట్లకు జాతీయ, అంతర్జాతీయస్థాయి శిక్షణతో పాటు మెరికల్లాంటి క్రీడాకారులకు వేదికగా నిలిచేందుకు సుమారు రూ.7కోట్ల నిధులతో 400 మీటర్ల, 8లైన్లతో కూడిన అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్‌ను కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ట్రాక్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో ఆ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) వీసీ, ఎం.డి. పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్‌తో ఒప్పందం కుదుర్చుకొని పీఆర్ శాఖ 2019 ఆగస్టు నెలలో ట్రాక్ నిర్మాణ పనుల కోసం టెండర్లను ఆహ్వానించింది. ఢిల్లీకి చెందిన శివనరేష్ అనే సంస్థ పనులు దక్కించుకుంది. సింథటిక్‌ట్రాక్‌తో పాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా భవనం నిర్మించాలనే ఒప్పందంతో 2020 మార్చి నెలలో పనులు ప్రారంభించింది. అయితే ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ.. కాంట్రాక్టర్ 2021 సెప్టెంబరు నెలలో ట్రాక్ పనులు పూర్తి చేశామని చెప్పినప్పటికీ సింథటిక్‌ట్రాక్ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ ప్రత్యేక అనుమతితో ఇదే యేడు సెప్టెంబరు నెల 15నుంచి 19వరకు జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నూతనంగా నిర్మించిన అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్‌పై లాంఛనంగా కొనసాగాయి. జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు కాంట్రాక్టర్ నేతృత్వంలో జరగడం, ట్రాక్ పనులు మొదలు పెట్టిన 9నెలలు వ్యవధిలో పనులు పూర్తి చేసి ట్రాక్ అప్పగించకపోవడంతో డీఎస్‌ఏ అధికారులు ట్రాక్‌ను అప్పగించడానికి కంప్లీషన్ రిపోర్టు ఇవ్వాలని పీఆర్ శాఖకు లేఖ రాశారు. సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్ విభాగం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండగా, ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా రెండేళ్ల అనంతరం సర్టిఫికెట్‌ను డీఎస్‌ఏకు పంపించారు. దీంతో డీఎస్‌ఏ అధికారులు పీఆర్ శాఖ ఇచ్చిన లేఖను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) టెక్నికల్ విభాగానికి పంపించడంతో సంబంధిత అధికారులు సింథటిక్‌ట్రాక్‌ను సందర్శించారు. అయితే ఇందులో కొన్ని లోపాలున్నాయని తేల్చారు. సింథటిక్‌ట్రాక్‌లో ఉన్న లోపాలను కాంట్రాక్టర్ ద్వారా సరిచేసి ట్రాక్‌ను అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని పీఆర్‌శాఖకు ఆరు నెలల కిందట డీఎస్‌ఏ అధికారులు లేఖ పంపినప్పటికీ ఇప్పటివరకు పీఆర్‌శాఖ అధికారులు కానీ, సదురు నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ స్పందించకపోవడం దురదృష్టకరమని క్రీడాభిమానులు వాపోతున్నారు.

అంతే కాకుండా ఇటీవల డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ద్వారా కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ వర్చువల్ పద్ధతిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులు సమక్షంలో ప్రారంభించారు. సాక్ష్యాత్తు కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ సాయ్, సాట్ స్పోర్ట్స్ అధికారుల సమక్షంలో ట్రాక్‌ను ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణిని వీడకుండా ట్రాక్‌ను అప్పగించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ట్రాక్ నిర్మాణ పనులకు రూ.7కోట్లకు గాను రూ.3.50కోట్ల చెల్లింపులు మాత్రమే జరిగాయని, మిగతా డబ్బులు రావాలని కాంట్రాక్టర్ చెబుతున్నప్పటికీ.. దీనికి ట్రాక్ అప్పగించడానికి సంబంధం లేదని పలువురు అంటున్నారు. ట్రాక్ అప్పగించడానికి అభ్యంతరాలు ఉండకూడదనే పీఆర్‌శాఖ అధికారులు కంప్లీషన్ లేఖను డీఎస్‌ఏ అధికారులకు ఇచ్చారంటున్నారు. అయితే ట్రాక్ నిర్మాణం పూర్తయి రెండున్నరేళ్లు ఏళ్ల గడిచినా ట్రాక్‌ను ఎందుకు అప్పగించడం లేదని పీఆర్‌శాఖ.. సాట్ అధికారులను వివరణ కోరారు. అయితే ట్రాక్ మధ్యలో చిన్న లోపాలున్నాయని, వాటిని సరిచేయించడంలో జాప్యం జరుగుతోందని, త్వరలోనే డీఎస్‌ఏకు ట్రాక్‌ను అప్పగించేలా చూస్తామని చెప్పడం కొసమెరుపు.

ఆర్నెళ్ల కిందటే కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు..

- అశోక్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమకొండ

సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు ట్రాక్‌ను తనిఖీ ఆర్నెళ్ల కిందటే డీఎస్‌ఏకు కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులకు కంప్లీషన్ లెటర్‌ను పంపించారు. ట్రాక్‌ను సందర్శించి లోపాలున్నాయని గుర్తించారు. కాంట్రాక్టర్ ట్రాక్‌పై ఉన్న లోపాలను పరిష్కరించే విధంగా పీఆర్‌శాఖ చర్యలు చేపట్టి త్వరితగతిన ట్రాక్‌ను డీఎస్‌ఏకు అప్పగించాలని ఆర్నెళ్ల కిందటే సాట్ అధికారులు లేఖ రాసినప్పటికీ నేటివరకు పీఆర్‌శాఖ అధికారులు స్పందించడం లేదు.

నోరూరిస్తున్న హలీమ్, హరీస్

- వరంగల్ త్రినగరిలో జోరుగా అమ్మకాలు
- 200లకు పైగా విక్రయ కేంద్రాలు
- ఆసక్తిగా తింటున్న ప్రజలు



కొత్తూరు జెండా ప్రాంతంలో హలీమ్, హరీస్‌లను వండుతున్న మాస్టర్

వడ్డెపల్లి, మార్చి 24: రంజాన్ మాసం హలీమ్, హరీస్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఉపవాస దీక్షలతో శుష్కించిన శరీరానికి బలవర్ధకమైన అల్పాహారంగా వీటిని తీసుకుంటారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం పూర్తయ్యాక ముస్లింలు హలీమ్, హరీస్ తింటారు. వరంగల్ నగరంలోని మండిబజార్, హనుమకొండలోని న్యూ రాయపుర, అశోక హోటల్ ప్రాంతం, సుబేదారి, కలెక్టరేట్‌తోపాటు కాజీపేట రైల్వే జంక్షన్ ఏరియాల్లో వీటి విక్రయాలు రంజాన్ మాసంలో ప్రతీ రోజు సాయంత్రం జోరుగా సాగుతున్నాయి.

తయారీ విధానం ఇలా..

ప్రధానంగా గొర్రె, మేక మాంసంతో తయారుచేసే దాన్ని హలీమ్ అంటారు. చికెన్‌తో చేసే వంటకాన్ని హరీస్ అని పిలుస్తారు. హోటళ్ల ముందు ఇటుకలతో తయారు చేసిన బట్టీలతో నిర్మించిన బట్టీలపై కట్టెలతో మంట పెడుతూ వీటిని వండుతారు. మాస్టర్లు తొలుత మాంసాన్ని శుభ్రం చేస్తారు. ఆ తర్వాత కాజు, బాదం, కిస్మిస్, పిస్తా, మునఖా, అంజీర్ వంటి దినుసులు కలిపి నీటిలో చాలా సేపు ఉడికిస్తారు. తర్వాత నానబెట్టిన గోధుమ రవ్వ , స్వచ్ఛమైన నేతిలో పాలు, పెరుగు పోసి మరో రెండు గంటల పాటు ఉడికించి తెడ్లతో బాగా కలియబెడుతారు. మెత్తగా ఉడికిన తర్వాత సాయంత్రం వేడిగా ఉన్న హలీమ్, హరీస్‌లను సిద్ధంగా పెడతారు. వీటిని గరిటెతో తీసి కప్పుల్లోకి తీసి కొత్తిమీర, పూదీన, నిమ్మకాయ ముక్క, కీర దోస, క్యారెట్‌తో పాటు కోడి గుడ్డును సైతం అలంకరించి హలీమ్, హరీస్‌తో పాటు సూప్‌ను వడ్డిస్తారు. నగర వాసులంతా వీటిని తినడానికి ఇష్టపడుతారు.

చారిత్రక నేపథ్యం..

హలీమ్ వంటకానికి శతాబ్ధాల చరిత్ర ఉంది. సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాల్లో ప్రథమంగా ప్రారంభమైన హలీమ్ కాలక్రమేపి విశ్వవ్యాప్తిలోకి వచ్చిం ది. తొలుత హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో ఈ వంటకం పరిచయమైంది. ఒకప్పుడు చాలా మంది వరంగల్ నగర వాసులు హలీమ్, హరీస్ తినేందుకు హైదరాబాద్‌కు వెళ్లొచ్చేవారు. సుమారు నాలుగు దశాబ్ధాల క్రితం వరంగల్ హలీమ్, హరీస్ బట్టీలు వెలిశాయి. తొలుత హైదరాబాద్‌కు చెందిన మాస్టర్లే వరంగల్‌కు వచ్చి హలీమ్, హరీస్ వండేవారు. క్రమేపీ వరంగల్‌కు చెందిన మాస్టర్లు సైతం ఈ వంటకాల తయారీపై పట్టు సాధించారు. వరంగల్ త్రినగరికి చెందిన వారందరికీ రుచికరమైన హలీమ్, హరీస్‌ను అందిస్తున్నారు. నోరూరించే విధంగా రుచికరమైన ఈ వంటకాలను తినడానికి నగర వాసులంతా ఎంతో మక్కువ కనబరుస్తున్నారు. ముస్లింలే కాక ఇతరులు సైతం వీటిని తినడానికి ఎంతో ఇష్టపడుతున్నారు.

దిల్‌షాద్ హోటల్‌లో తొలిసారి..

ప్రప్రథమంగా వరంగల్ నగరంలోని మండిబజార్ (దిల్‌షాద్ హోటల్)లో హలీమ్, హరీస్‌ను వండి నగర ప్రజలకు పరిచయం చేశారు. ఒకప్పుడు హనుమకొండ సుబేదారి, కాజీపేట, నయీంనగర్‌లోని ముస్లింలు మండి బజార్‌కు వచ్చి హలీమ్, హరీస్‌లను తినేవారు. ఆ తర్వాత హనుమకొండలోని కోహినూర్ హోటల్, సుబేదారిలోని మునవర్ హోటల్‌లో హలీమ్, హరీస్ వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వరంగల్ త్రినగరిలో సుమారు 200 లకు పైగా హలీమ్, హరీస్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. మెర్క్యూరి లైట్లతో విక్రయ కేంద్రాలను శోభాయమానంగా అలంకరించడంతో వినియోగదారులు ఇష్టంగా తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

- అమ్మకాలు బాగున్నాయి..

- ఎంఏ లతీఫ్, సుబేదారి బడేమసీద్..



రంజాన్ మాసం కాబట్టి ఇఫ్తార్ తర్వాత ముస్లింలు ఎక్కువగా హలీమ్, హరీస్‌ను తినడానికి రావడంతో అమ్మకాలు బాగానే ఉన్నాయి. ముస్లింలతో పాటు ఇతరులు కూడా వీటిని తినడానికి ఇష్టపడటంతో హాట్ కేకుల్లా అమ్మకాలు సాగుతున్నాయి. హలీమ్ ప్లేట్ ధర రూ. 200, హరీస్ ప్లేట్ ధర రూ. 120 పలుకుతుంది.



హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీ వద్ద హరీస్, హలీమ్‌లను వండుతున్న మాస్టర్లు





ఆదివారం అర్ధరాత్రి నిట్ వద్ద ప్రమాద దృశ్యం

అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

నిట్ వద్ద కారు - బైక్ ఢీకొని యువకుడి మృతి

కాజీపేట, మార్చి 24 : కాజీపేట నిట్ వద్ద ఆదివారం అర్ధరాత్రి సుమారు 1.15గంటలకు కారు- బైక్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భూపాలపల్లికి చెందిన సురేందర్ (35) కాజీపేట నుంచి హనుమకొండకు బైక్‌పై వెళుతుండగా, కారు హనుమకొండ నుంచి కాజీపేట వైపు వస్తోంది. ఈ క్రమంలో నిట్ వద్ద కారు-బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సురేందర్ తల పగిలి అక్కడికక్కడే మరణించాడు. వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేటలో ఇఫ్తార్ విందు

కాజీపేట, మార్చి 24 : కాజీపేట 40వ డివిజన్‌లో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లిం మధ్య సోదర భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు ఎస్‌కే అజ్గర్, సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, సిలివేరు విజయభాస్కర్‌తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన రామక్రిష్ణ

హనుమకొండ సిటీ, మార్చి 24: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఎస్‌సీ సెల్ అధ్యక్షుడు, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి జ్ఞాపికను అందచేశారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి వరంగల్ ఎంపీ టికెట్ ఇప్పించాలని రామక్రిష్ణ కోరారు.



సీఎంతో పెరుమాండ్ల రామక్రిష్ణ

పరికిపండ్ల అశోక్‌కు సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న పద్మబ్రహ్మణ సంఘం సభ్యులు

హనుమకొండ చౌరస్తా, మార్చి24: ప్రముఖ హోమియోపతి డాక్టర్, సైకాలజిస్ట్, సామాజికవేత్త, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఇండియా ఎక్సలెన్సీ జాతీయ అవార్డు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని పద్మబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం హనుమకొండ 4వ డివిజన్ రెడ్డికాలనీ పద్మశాలీ పరపతి సంఘం ఫంక్షన్‌హాల్లో పద్మబ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు మలిపెద్ది కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానుకోట జిల్లా పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై అశోక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ గవర్నర్ లింగమూర్తి, పద్మశాలి సంఘం సభ్యులు అమరేందర్, బ్రహ్మకుమారి వేల్పుల నరేష్, సందీప్, సూర్యనారాయణ, దివ్యశ్రీ, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వాహనాలపై నిఘా పెట్టండి

• నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తాజాజీ వాకడే
• ఎంజీఎం చెక్ పోస్టు అకస్మిక తనిఖీ



ఎంజీఎం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 24: నగరంలో పర్యటిస్తున్న అనుమానాస్పద వాహనాలపై నిఘా పెట్టాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. వరంగల్ తూర్పు పరిధిలోని ఎంజీఎం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆదివారం అకస్మికంగా పరిశీలించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎస్ఎస్‌టీ బృందాలు సమర్థవంతం గా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలు పక్కాగా పాటించాలని ఆదేశించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, డబ్బులు, మద్యం, గిఫ్ట్‌లతో పాటు ఇతర వస్తువులపై నిఘా పెట్టాలని సూచించారు. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది విధుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఎస్‌టి టీమ్ ముఖ్య అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి పాల్గొన్నారు.

మంచిని పెంచడానికి కవిత్వం దోహదపడుతుంది

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

హనుమకొండ కల్చరల్, మార్చి 24: మంచిని పెంచడానికి కవిత్వం ఎంతగానో దోహదపడుతుందని, ఆ రకంగా కవులు కృషి చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో 'ఎల్లలు లేని కవిత్వంపై మానవాళికి మార్గదర్శనం' అనే అంశంపై ఆదివారం హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని టీజీవో భవన్‌లో సర్వభాష కవి సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నవీన్ మాట్లాడుతూ.. సమాజ మార్పు కోసం, సమాజ ప్రగతి కోసం కవులు రచనలు ఉపయుక్తంగా ఉంటాయని కొనియాడారు. ఈ సందర్భంగా పద్య కవులను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో చైతన్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుర్రపు దామోదర్, సంస్థ బాధ్యులు మహ్మద్ సిరాజుద్దీన్, ఆచార్య బానోతు సురేశ్‌లాల్, శ్రీపాద సుధాకర్‌రావు, ఆచార్య గూడ నరసింహమూర్తి, ఘంటా రామిరెడ్డి, ఆచార్య కొక్కొండ విజయబాబు, సంస్థ పీఆర్‌ఓ నిమ్మల శ్రీనివాస్, ఏసీపీ విజయ్ కుమార్, సామాజిక వేత్తలు అనితరెడ్డి, కాజీపేట పురుషోత్తం, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, సూత్రపు అభిషేక్, గట్టు మహేశ్‌బాబు, విప్పనపల్లి రవికుమార్‌తో పాటు పలువురు పద్య కవులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తదితరులు

సైకాలజీతో విస్తృత ఉపాధి అవకాశాలు

కేయూ క్యాంపస్, మార్చి 24: సైకాలజీతో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్, సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. ఆదివారం ఎస్డీఎల్‌సీఈ 2021-23 ఏడాది సైకాలజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులతో ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 21వ శతాబ్దంలో సైకాలజిస్టుల అవసరం పెరిగిందన్నారు. ఒత్తిడి, మానసిక ఆందోళన, ఏకాగ్రత లోపించడం మనుష్యుల్లో పెరుగుతోందన్నారు. సైకాలజిస్టుల కౌన్సెలింగ్ సేవలు ప్రతీ రంగంలో అవసరమని చెప్పారు. వర్సిటీలో సైకాలజీ విద్యార్థులకు తరగతి బోధనతోపాటు ప్రయోగపూర్వక ట్రైనింగ్, అలాగే విశ్లేషణాత్మక బోధన చేపట్టడం జరుగుతోందని చెప్పారు. ఫొటో సెషన్‌లో సైకాలజీ విభాగం ప్రొఫెసర్లు జి.రామేశ్వరం, డాక్టర్ నహేదా పర్వీన్, డాక్టర్ మాలతి, కందాల రామయ్య, జి.అపర్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేణుగోపాలస్వామి రథోత్సవం

మడికొండ, మార్చి 24 : గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. మహిళలు కోలాటాలు ఆడుతూ స్వాగతం పలుకగా గజవాహనం పై స్వామి వారు పురవీధులలో ఊరేగారు.

స్థానిక కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం బండ్ల తీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నిగ్గుల సతీష్, కల్లెపు నరేష్, పత్తిపాక ఉపేంద్రాచారి, దువ్వ శ్రీకాంత్, నార్లగిరి సతీష్‌కుమార్, విజయ్‌కుమార్, బోగి దయాకర్, ఉజ్జేతుల ప్రణీత్, బజ్జూరి శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గజవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి



గోపాల్‌పూర్‌లో కామదహనం చేస్తున్న దృశ్యం

ఘనంగా కామదహనం

వడ్డేపల్లి, మార్చి 24 : హనుమకొండలోని వివిధ డివిజన్లలో కామదహనం వేడుకలను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, జవహర్ కాలనీలో కాంగ్రెస్ నేత కొంక హరిబాబు, బీజేపీ నేత బండి హరీష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కామదహనంనిర్వహించారు. కాకతీయ నగర్ కాలనీలో కాలనీ ప్రతినిధి సోయం ఓదెలు, బృందావన్ కాలనీలలో రచ్చ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కామదహనం వేడుకలను జరుపుకున్నారు.

ఘనంగా మట్టాల ఆదివారం

న్యూశాయంపేట, మార్చి 24 : న్యూశాయంపేటలో హెర్మోన్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టాల ఆదివారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు న్యూశాయంపేటలోని వీధుల్లో ఏసుక్రీస్తు జయం జయం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా హెర్మోన్ బాప్టిస్ట్ చర్చి వరకు వెళ్లారు.

కార్యక్రమంలో హెర్మోన్ బాప్టిస్ట్ చర్చి పెద్దలు విశ్రాం కిరణ్, మంద ఆంధ్ర య్య, మంద సుదర్శన్, వస్కుల జాన్, విక్టర్, మంద సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: కడపికొండ శివారులోని రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీలో ఆదివారం కల్వరి ప్రేమ మందిరం ఆధ్వర్యంలో మట్టల ఆదివారపు ఆరాధనోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కొబ్బరి మట్టలు, ఈత మట్టలు చేతపట్టుకొని హోసన్న జయము జయము అంటూ క్రీస్తు సువార్తను ప్రకటించారు. ఈసందర్భంగా రెవరెండ్ బి.కరుణాకర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేసినట్లు పేర్కొన్నారు.



కడపికొండ రాజీవ్ గృహకల్ప వద్ద ఆరాధన జరుపుకుంటున్న భక్తులు

● వడ్డేపల్లి: 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని సాలెం బాప్టిస్టు చర్చి ఫాస్టర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసు నామస్మరణతో గోపాల్‌పూర్ పుర వీధులు మార్మోగాయి. గోపాల్‌పూర్‌లోని ప్రధాన వీధుల్లో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాలెం బాప్టిస్టు చర్చి అధ్యక్షుడు ఇమ్మడి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కందుకూరి విల్సన్, జాయింట్ సెక్రటరి కందుకూరి పూర్ణచందర్, గిన్నారపు రాజు, కందుకూరి రాజు, ఇమ్మడి ఆదాం క్రైస్తవులు మట్టల ఆదివారంలో పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న ఇనగాల

అమ్మవారి సన్నిధిలో కుడా చైర్మన్

వరంగల్ కల్చరల్, మార్చి 24: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్‌గా నియమితులైన అనంతరం మొదటిసారిగా ఆదివారం అమ్మవారికి పూజలు చేవారు. యోగా గురువు ఉమామహేశ్వర్ సబిత దంపతులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ధ్యాన యోగ గురువుగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఉమామహేశ్వర్ అమ్మవారిని దర్శించుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మడికొండ, మార్చి 24: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రాజబాబు వివరాల మేరకు.. శనివారం సాయంత్రం చిర్ర రమేష్(55) అనే వ్యక్తి తన ఇంటిపైన ఉన్న పెంట్‌హౌస్ వద్ద ఉండగా ఫిట్స్ రావడంతో అదుపు తప్పి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎంకు తరలించగా వైద్యులు చికిత్స చేసి పంపారు. రాత్రి మళ్లీ ఫిట్స్ రావడంతో తిరిగి ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే రమేష్ మృతిచెందాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు శశి కుమార్, శరత్ ఉన్నారు. కుమారుడు శశికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనంతమల్లయ్య సిద్ధాంతి పంచాంగం ఆవిష్కరణ

కాజీపేట, మార్చి 24 : కాజీపేట శ్వేతార్కమూల గణపతి దేవాలయంలో ఆదివారం దివంగత ఐనవోలు అనంత మల్ల య్య శర్మ సిద్ధాంతి రాసిన శ్రీక్రోధి నామ సంవత్సర సూర్య సిద్ధాంత పంచాంగ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో గురుమదనానంద సరస్వతీ పీఠాధిపతులు మధుసూదనానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా ఈ ఆవిష్కరణ జరిగింది. అనంతరం శ్రీ క్షేత్ర పీఠానికి అ నంత మల్లయ్య కుమారులైన ఐనవోలు రాధాకృష్ణ శర్మ సాయికృష్ణ శర్మలను సిద్ధాంతులుగా ప్రకటించారు. కార్యక్రమంలో భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు, వెయ్యి స్తంభాల దేవాలయం ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, పద్మాక్షి ఆలయ ప్రధాన పూజారి నాగిళ్ల శంకర్ శర్మ, హైదరాబాద్ సరస్వతి పీఠ వ్యవస్థాపకులు గంగు సచ్చిదానందమూర్తి, పూజారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జయంతి ఉత్సవాలు

వడ్డెపల్లి, మార్చి 24 : హనుమకొండ గోకుల్ నగర్‌లోని పోచమ్మ గుడి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తమండలి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. రుత్వికులు పొట్లపల్లి రాజేశ్వర్‌రావు, ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో మహా పడిపూజను కన్నుల పండువగా నిర్వహించారు. భక్తుల భజన కీర్తనలతో శబరిగిరీశుడి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో గోకుల్ అయ్యప్ప భక్త మండలి ప్రతినిధులు చల్లా రాజు, మూగల కుమార్ యాదవ్, ఎల్లావుల సతీష్‌యాదవ్, మూ గల రాజ్‌కుమార్, బంక సంపత్ యాదవ్, నక్క రాజ్‌కుమార్, బంక చంద్రశేఖర్ యాదవ్, బంక రమేష్ యాదవ్‌తో పాటు భక్తులు అధి క సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామిని కొలిచారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాదిగలకు సీట్లిస్తే బీజేపీని ఓడిస్తాం

వడ్డెపల్లి, మార్చి 2 : లోక్‌సభ ఎస్సీ స్థానాలను మాదిగలకు కేటాయిస్తే బీజేపీని ఓడిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జాతీయ ప్రధాన కార్యదర్శి పసుల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు లోక్‌సభ ఎస్సీ రిజర్వేషన్ స్థానాలను బీజేపీ మాదిగలకు ఇవ్వడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు బహుజన ద్రోహులని మండిపడ్డారు. ప్యాకేజీ ప్రవీణ్‌కుమార్‌ను నాగర్ కర్నూల్‌లో చిత్తుగా ఓడించాలని బహుజన ఓటర్లకు పసుల రాంమూర్తి పిలుపు నిచ్చారు బీజేపీలో ఉన్న మాల కులస్తులు స్వచ్ఛందంగా బయటకు వచ్చి ఎస్సీ వర్గీకరణను, మనువాదానికి వ్యతిరేక పార్టీలలో చేరాలని కోరారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర జిల్లా నాయకులు ఉసిల్ల కుమార్, సురాసి విక్రమ్‌కుమార్, మన్నె శ్రీనివాస్, కడారి కుమారస్వామి పాల్గొన్నారు.

అరూరికే ఖరారు

5వ పేజీ తరువాయి

చేయటంతో బీజేపీలో సంబరాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా...

కాంట్రాక్టర్‌గా ఉన్న ఆరూరి రమేష్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రెండోసారి 2018లో కూడా భారీ మెజారిటీతో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా అరూరి రమేష్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. అయితే 2023 ఎన్నికల్లో అరూరి రమేష్ ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి వరంగల్ టికెట్ ఆశించిన అరూరికి అధిష్ఠానం నిరాశ మిగిలింది. దీనికి తోడు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అరూరి గమనించారు. ఈ క్రమంలో బీజేపీ నుంచి ఆఫర్ రాగానే పార్టీ మారారు. బీజేపీ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు.

కారు స్టీరింగ్ ఎవరికో?!

(5వ పేజీ తరువాయి)

దక్కుతాయో అనే ఉత్కంఠ వరంగల్ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నెలకొంది.

కారు స్టీరింగ్ ఖాళీ

బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి ఖాళీ ఏర్పడింది. వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా కొనసాగిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్. ఈనెల 17న పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో పార్టీ పగ్గాలు ఎవరి చేతిలో లేక గులాబీ కారు మూలకు పడింది. అయితే మే 13న లోక్‌సభ ఎన్నికలు ఉండటంతోపాటు వరంగల్, మహబూబాబాద్ అభ్యర్థులుగా కడియం కావ్య, సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలకు టికెట్ ఇచ్చారు. ఈ క్రమంలో అత్యవసరంగా వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్‌కు అధ్యక్షుడిని నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. దీంతో సరైన నేత కోసం అధిష్ఠానం పలువురి పేర్లు పరిశీలిస్తోంది.

పలువురి పేర్లు పరిశీలన

బీఆర్‌ఎస్‌కు వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి వైపు పార్టీ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా 12ఏళ్లకు పైగా పెద్ది సుదర్శన్‌రెడ్డి పని చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్దికి పరిచయాలున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాకు అధ్యక్షుడిగా పని చేసిన సుదర్శన్‌రెడ్డి.. చిన్న జిల్లాకు అధ్యక్ష బాధ్యతలు తీసుకుంటారా? అనే చర్చ పార్టీలో జరుగుతోంది. అయితే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, వరంగల్ జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న పెద్ది స్వప్నకు పార్టీ జిల్లా పగ్గాలు ఇచ్చి, సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా పార్టీలో నడుస్తోంది. భార్యాభర్తలకు జోడు పదవులపై పార్టీలో అభ్యంతరాలు వస్తే.. ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డిల పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. అయితే పరకాల నియోజకవర్గంలో కొన్ని మండలాలు హనుమకొండ జిల్లాలో, మరికొన్ని మండలాలు వరంగల్ జిల్లాలో ఉన్నాయి. ఈ కోణంలో ఏమైనా అభ్యంతరాలు వస్తాయా? అనే చర్చ కూడా పార్టీలో జరుగుతోంది.

అలాగే వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు పార్టీ పగ్గాలు ఇస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా బీఆర్‌ఎస్‌లో సాగుతోంది. జిల్లా కేంద్రంలో ఉండే అవకాశం ఉన్న నరేందర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించే విషయంలోనూ ఆలోచనలు చేస్తున్నట్లుగా సమాచారం. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేరును కూడా పార్టీ పరిశీలించింది. అయితే ఆయన స్థాయికి ఇది చిన్న పదవి అవుతుందేమో అనే ఆలోచనలో పార్టీ ఉంది. వీరితో పాటు మరో నలుగురైదుగురు ఉద్యమకారులు, సీనియర్ల పేర్లను బీఆర్‌ఎస్ నేతలు పరిశీలిస్తున్నారు. అయితే మెజారిటీ నేతలు ప్రస్తుతం పార్టీ ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు మోయటం సులభం కాదని, గతానుభవం దృష్ట్యా పెద్ది సుదర్శన్‌రెడ్డికి పదవి ఇస్తేనే బాగుంటుందని సీనియర్లు సూచిస్తున్నట్లుగా సమాచారం.

లోక్‌సభ ఎన్నికల భారం

మే 13న లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. వరంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య, మహబూబాబాద్ అభ్యర్థిగా మాలోతు కవిత పేరును అధిష్ఠానం ప్రకటించింది. అయితే బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయాక అనేకమంది కీలక నేతలు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీల్లో చేరుతున్నారు. వరంగల్ జిల్లాలో కీలకమైన నేతలు అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బీఆర్‌ఎస్‌ను వీడారు. మరికొంత మంది నేతలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వరంగల్ మేయర్ గుండు సుధారాణి కూడా పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీని బలోపేతం చేస్తూ పార్టీ నుంచి వలసను నిలువరించాల్సిన బాధ్యత కూడా కొత్త అధ్యక్షుడిపైనే ఉంటుందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా వరంగల్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటే వరంగల్ జిల్లాలోనే వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు పరకాల, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు, డివిజన్‌లు ఉన్నాయి.

మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గం ఉంది. దీంతో వరంగల్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ ఎన్నికలను భుజస్కంధాలపై వేసుకుని నడిపించే బాధ్యత కూడా వరంగల్ జిల్లా అధ్యక్షుడిపైనే ఉంటుంది. పార్టీ ప్రస్తుతం క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమర్థవంతమైన నాయకుడికి వరంగల్ జిల్లా పగ్గాలు ఇవ్వాలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లుగా సమాచారం. ఈ నెలఖారులోగా, లేదంటే ఏప్రిల్ మొదటి వారంలో పార్టీ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అధ్యక్షుడు కూడా లేని వరంగల్ కారు పార్టీని గాడిలో పెట్టేందుకు బీఆర్‌ఎస్ అధిష్ఠానం దృష్టి పెట్టడం గులాబీ క్యాడర్‌లో చర్చనీయాంశంగా మారింది.



లాడో బాయ్... ఒకప్పుడు అయిదు రూపాయల కూలీ... ఇప్పుడు ఆమె పెయింటింగ్స్ పికాసో చిత్రాల సరసన సగర్వంగా నిలిచాయి. పిథోరా చిత్రకళకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన మహిళల్లో ఆమె ఒకరు. సంప్రదాయానికి ఆధునికతను మేళవించి వర్ణవిన్యాసం చేస్తున్న లాడో బాయ్ కథ ఇది...

కూలీ కుంచె... దేశాలు దాటింది

"మాది మధ్యప్రదేశ్‌లోని ఝబువా దగ్గరలోని బడీ బావడీ అనే చిన్న గ్రామం. రెక్కాడితే కాని డొక్కాడని భిల్ల గిరిజన కుటుంబం. రాయడం, చదవడం వచ్చు... అదే నా చదువు. బొమ్మలు వెయ్యడంలో నైపుణ్యం మాత్రం చిన్న వయసునుంచే వచ్చింది. దానికి కారణం... చిత్రలేఖనం మా జీవితాలతో విడదీయలేని భాగం. నేను 1954లో పుట్టాను. అప్పట్లో మా గ్రామంలో రంగులు, బ్రెష్‌లు ఉండేవి కావు. చెక్కని కుంచెగా రూపొందించుకొనేవాళ్ళం. బొగ్గు, ఎర్ర మట్టి, ఆకులు, బియ్యపు పిండితో రకరకాల రంగులు తయారు చేసేవాళ్ళం. పెళ్ళిళ్ళయినా, పండుగలైనా ఇంటి గోడల మీద బొమ్మలు వేయడం, వస్త్రాల మీద వేసిన చిత్రాలను తుమ్మ జిగురుతో గోడలపై అంటించడం మా ప్రాంతంలో సర్వసాధారణం. ఈ కళలో మా నాయనమ్మ దగ్గర ఎన్నో మెళకువలు నేర్చుకున్నాను. నాకు పన్నెండేళ్ళు వచ్చేసరికి ఇంటి పరిస్థితి మరింత దిగజారింది. గత్యంతరం లేక ఏదైనా పని చూసుకుందామని మా అన్నయ్య, వదిన భోపాల్‌కు వలస వచ్చారు. వాళ్ళ వెనుకే నేను కూడా. కూరగాయలు అమ్మడం, అడవి నుంచి కట్టెలు తెచ్చి విక్రయించడం... ఇలా చాలా పనులు చేశాం. చివరకు ఒక చోట భవన నిర్మాణ కూలీలుగా కుదిరాం. ఆ కట్టడం... భోపాల్‌లో సుప్రసిద్ధమైన భారతీయ భవన్. సకల కళలకూ కేంద్రంగా రూపుదిద్దుకున్న భవన నిర్మాణంలో ప్రముఖ కళాకారుడు, రచయిత అయిన జగదీశ్ స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. మా అన్నయ్యకు ఇరవై రూపాయలు, మా వదినకు పది రూపాయలు, నాకు అయిదు రూపాయలు కూలీగా దొరికేది.



స్వామినాథన్ ప్రోత్సాహంతో...

ఊరుకాని ఆ ఊర్లో నాకు ఏమీ తోచేది కాదు. ఖాళీ సమయాల్లో కాగితాలు, పెన్సిల్ తీసుకొని బొమ్మలేస్తూ ఉండేదాన్ని. అది ఒక రోజు స్వామినాథన్ కంట పడింది. ఆయన నా వివరాలు తెలుసుకున్నారు. మర్నాడు కొన్ని కాగితాలు, రంగులు తీసుకొచ్చి ఇచ్చారు. "నీకు తోచిన బొమ్మలు వెయ్యి. బాగా వెయ్యి" అని ప్రోత్సహించారు. నా చిత్రాలను పరిశీలించి, సూచనలు, సలహాలు ఇచ్చేవారు. "నీలో మంచి నైపుణ్యం ఉంది. మరింత సాధన చేస్తే మంచి చిత్రకారిణివి అవుతావు" అని చెప్పేవారు. కొన్నాళ్ళకు భారతీయ భవన్ నిర్మాణం పూర్తయింది. వేరే చోట పనిలో చేరాం. అప్పుడు కూడా బొమ్మలు వెయ్యడం, స్వామినాథన్‌కు చూపించడం కొనసాగించాను. కొన్నాళ్ళ తరువాత భోపాల్‌లోని ఆదివాసీ లోక్ కళా అకాడమీలో ఆయన నన్ను చేర్పించారు. అక్కడ నాకు భూరీబాయ్ పరిచయం అయ్యారు. గిరిజనులకు ప్రత్యేకమైన పిథోరా కళాకృతులను కాగితం మీద గీసి, ప్రాచుర్యంలోకి తెచ్చిన మొదటి వ్యక్తి ఆమె. పద్మశ్రీ పురస్కారం కూడా అందుకున్నారు. భూరీ సహచర్యం నాకు చిత్రకళలో కొత్త విషయాలెన్నో నేర్పింది. మా భిల్ల గిరిజనుల సంప్రదాయ రీతి అయిన పిథోరా చిత్రకళ మీదే పూర్తిగా దృష్టి కేంద్రీకరించాను. నా చిత్రాలతో మనదేశంలోనే కాదు, విదేశాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహించాను. ఈ ఏడాది జనవరి 20 నుంచి మార్చి మూడు వరకూ ఇటలీ మిలాన్ నగరంలోని పలాజ్జినా ట్రోంబినీ మ్యూజియంలో విశ్వవిఖ్యాత చిత్రకారులైన పికాసో తదితరుల చిత్రాల సరసన పద్మశ్రీ జోధియాబాయ్, పద్మశ్రీ భూరీబాయ్‌లతో పాటు నా పెయింటింగ్స్ కూడా చోటు చేసుకోవడం మాటల్లో వివరించలేని అనుభూతి. మన దేశ గిరిజన చిత్రకారులకు తొలిసారిగా దక్కిన అరుదైన గౌరవం ఇది.

ఎన్నడూ ఊహించలేదు...

నా వ్యక్తిగత విషయాలకు వస్తే... మా భిల్ల గిరిజన తెగకు చెందిన పెయింటర్ తెరూ తహెద్‌ను వివాహం చేసుకున్నాను. కొన్నేళ్ళ క్రితం ఆయన మరణించారు. అది నాకు అంతులేని విషాదాన్ని విగిల్చింది. నలుగురు పిల్లల భారం నా మీద పడింది. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అయినప్పటికీ ధైర్యంతో ముందుకు సాగాను. నా నలుగురు పిల్లలకు, కోడలికి కూడా ఈ కళను నేర్పాను. పిథోరా చిత్రకళకు కొత్త గుర్తింపును, అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన చిత్రకారిణుల్లో ఒకరిగా నన్ను పలు సంస్థలు గుర్తించి పురస్కారాలను అందజేశాయి, సత్కారాలు చేశాయి. పెద్దగా చదువుకోని, సాధారణ మహిళనైన నాకు ఎందరో ప్రముఖుల నుంచి ఇన్ని ప్రశంసలు దక్కుతాయని, అయిదు రూపాయల కూలీగా మొదలై లక్షల్లో అమ్ముడయ్యే పెయింటింగ్స్ వేసే స్థాయికి చేరుతాననీ ఏమాత్రం ఊహించలేదు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని కలుసుకోవడం నేను ఎన్నడూ మరచిపోలేని అనుభవం. ఒకప్పుడు ఇల్లు వదిలి వెళ్ళాలంటే భయపడేదాన్ని. ఇప్పుడు ప్రపంచమంతా ఒంటరిగానే వెళ్తున్నాను. ప్రకృతి, ఆధ్యాత్మికత, చుట్టూ ఉన్న జీవజాలం... ఇవన్నీ గిరిజనుల జీవితాల్లో, కళల్లో అంతర్భాగం. సంప్రదాయికమైన పిథోరా చిత్ర శైలిలో ఆధునికమైన, సమకాలీనమైన సామాజిక అంశాలను చిత్రించడం నాకు ఇష్టం. నేను గీసే చిత్రాల్లో జంతుప్రపంచం, భిల్లుల ఆచార వ్యవహారాలు, పండుగలు ప్రధానంగా ఉంటాయి. చిన్నప్పుడు మా పెద్దల నుంచి విన్న జానపద కథలను కూడా వివరంగా పెయింటింగ్స్ వేశాను. నాకు దైవభక్తి ఎక్కువ. నేను గీసే చిత్రాలు దైవానికి ప్రీతిపాత్రంగా ఉండాలనేది నా తపన. అందుకే పెయింటింగ్స్ వేసేటప్పుడు చాలా నిష్ఠగా ఉంటాను. నా చిత్రాల ద్వారా పిథోరా కళనూ, సంస్కృతి సంప్రదాయాలను, భిల్లుల జీవన శైలిపై అవగాహనను భావి తరాలకు అందించాలనేది నా కోరిక."



పోలీసు అధికారి అవ్వాలని కోరుకున్నా... తల్లితండ్రుల ప్రోత్సాహంతో రంగస్థలం వైపు అడుగులు వేశారు ప్రొఫెసర్ భళ్లమూడి పద్మప్రియ. చివరకు దాన్నే ఆమె కెరీర్‌గా మలుచుకుని... నేడు ఎందరో ఔత్సాహికులను నాటక రంగానికి అందిస్తున్నారు. నటిగా రెండు వందలకు పైగా నాటకాలు... రెండు వేలకు పైగా ప్రదర్శనలు... దర్శకురాలిగా ఎన్నో ప్రయోగాలు. తెలుగు వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా బహుముఖ సేవలు అందిస్తున్న పద్మప్రియ ప్రస్థానం 'నవ్య'కు ప్రత్యేకం.

డైలాగ్ రాక్షసి అని పిలిచేవారు

"నాటక రంగంలో ఒక నటిగా కన్నా దర్శకురాలిగా పేరు సంపాదించుకోవడం చాలా కష్టం. మగవాళ్ల కంటే చాలా భిన్నంగా, మరింత సృజనాత్మకంగా ప్రతిభను చాటగలిగినప్పుడే రంగస్థలంలో మనకంటూ ఒక గుర్తింపు లభిస్తుంది. అందుకు పురుషులకంటే మరింత ఎక్కువ కష్టపడాలి కూడా. అప్పుడే మనదైన ముద్రతో రాణించగలం. నామటుకు నేను నలభైకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించాను. 'పద్మప్రియ నాటకాలన్నీ దేనికదే ప్రత్యేకమనే' ప్రశంసలను ప్రేక్షకుల నుంచి అందుకొన్నాను. జాలర్ల జీవిత ఇతివృత్తంగా సాగే 'మోరియా' నాటక ప్రదర్శన కోసం రవీంద్ర భారతి వేదిక మీద ఏకంగా సముద్రం సెట్ వేశాను. పురాతన గ్రీకు నాటకం 'యాంటిగోనే'లో పాత్రధారులకు గోనె సంచులతో కాస్ట్యూమ్స్ డిజైన్ చేయడంతోపాటు ఆ నాటకాన్ని ఆరుబయట ప్రయోగాత్మకంగా ఎన్విరాన్‌మెంటల్ థియేటర్ ప్రక్రియలో ప్రదర్శించాను. 'కౌముది మహోత్సవం', 'అంతర్యుద్ధం', 'కట్టు బానిస', 'కాగితం పులి'... ఇలా నా దర్శకత్వంలోని ప్రతి నాటకాన్నీ సందర్భానుసారంగా లైటింగ్ ఎఫెక్టులు, విభిన్నమైన రంగాలంకరణ లాంటి మోడ్రన్ థియేటర్ టెక్నిక్స్‌తో వినూత్నంగా చూపించడానికి ప్రయత్నించాను. వాస్తవికేతర నాటకాలను ఎంపిక చేసుకోవడం... వాటికి సింబాలిజం, ఎక్స్‌ప్రెషనిజం, ఎగ్జిస్టెన్షియలిజం లాంటి ఆధునిక పద్ధతులను మిళితం చేయడం నాకు ఇష్టం. నా దర్శకత్వంలోని ప్రతి నాటకానికీ సెట్, కాస్ట్యూమ్స్‌లను నేనే డిజైన్ చేసుకొంటాను.

> ### అదే పెద్ద సవాలు...
> నాటక రంగంలో పని చేసే ఆడవాళ్ల సమస్యల గురించి చర్చకు వచ్చిన సందర్భాలు ఇంతవరకు పెద్దగా లేవు. కారణం ఈ రంగంలో నటీమణులుగా మినహా మిగతా విభాగాల్లో మహిళలు పెద్దగా లేకపోవడమే. రంగస్థలంలో మనకు ఉన్న మహిళా దర్శకులను వేళ్ల మీద లెక్కించవచ్చు. నాటక ప్రదర్శన ప్రదేశాలలో చాలా సందర్భాలలో కాస్ట్యూమ్స్ మార్చుకోడానికి, కాసేపు విశ్రాంతి తీసుకోడానికి కూడా ఆడవాళ్లకు సరైన వసతులుండవు. ఇక మరుగుదొడ్లు లాంటి సౌకర్యాల సంగతి సరేసరి. ఈ రంగంలోకి రావాలంటే కుటుంబం అనుమతి తప్పనిసరి. రిహార్సిళ్లు, ప్రదర్శనలంటూ... ఇంటికి చేరడానికి ఒక వేళాపాళ అంటూ ఉండదు. కనుక ఇటు వృత్తి జీవితాన్ని అటు కుటుంబ బాధ్యతలనూ సమన్వయం చేసుకోవడం ఈ రంగంలోని ఆడవాళ్లకు అతిపెద్ద సవాల్. దానికితోడు ఇక్కడ ప్రతి మహిళ తన భద్రత, కన్వీనియెన్స్ చూసుకుంటూ పని చేయాలి. కనుక నాటక రంగంలోని మహిళలకు కొన్ని వెసులుబాట్లు అవసరం.

ఔట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించేలా...

ఔత్సాహిక నాటకాలకు భిన్నంగా రంగస్థలంపై విభిన్న ప్రయోగాలు చేయడానికి అవసరమైన కొత్త చూపును నాకు ఇచ్చింది మాత్రం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీనే. అక్కడ నేను థియేటర్ ఆర్ట్స్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో మా ప్రొఫెసర్ డీఎస్ఎన్ మూర్తి నాకు ఒక సన్నివేశాన్ని ఇచ్చి డైరెక్టు చేయమన్నారు. అప్పటికే కొన్ని వందల నాటకాల్లో నటించిన అనుభవం ఉన్న నాకు ఇదొక లెక్కా అనుకొని, ఠపీమని చేసి చూపించాను. 'పక్కా పరిషత్ నాటకంలా చేశావు. ఇది చేయడానికైతే ఇక్కడి వరకు రానక్కర్లేదు. విభిన్నంగా ఆలోచించాలి కదా' అన్నారు మూర్తి సర్. ఆ మాటలు నన్ను ఔట్ ఆఫ్ దిబాక్స్ ఆలోచించేలా చేశాయి. రంగస్థలంపై ప్రయోగాలు చేయడానికి ప్రేరణ కలిగించాయి. అదే యూనివర్సిటీలో తర్వాత 'రంగస్థల శిక్షణతో వ్యక్తిత్వ వికాసం' అంశం మీద పీహెచ్‌డీ కూడా పూర్తి చేశాను. తెలుగు నాటకరంగంలో మొట్టమొదటగా పీహెచ్‌డీ చేసిన మహిళను నేనే అని తెలిసి సంబరపడ్డాను.

పట్టాభిరాం సహకారంతో...

నా పరిశోధన కూడా చాలా సవాళ్లతోనే సాగింది. 'రంగస్థల శిక్షణతో వ్యక్తిత్వవికాసం' టాపిక్ తీసుకొంటానని మా గైడ్ ప్రొఫెసర్ బిట్టు వెంకటేశ్వర్లుతో చెప్పినప్పుడు... 'చాలా మంచి అంశం. కాకపోతే దీని మీద రిఫెరెన్స్ పుస్తకాలంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. థీసెస్ రాయడానికి కూడా చాలా కష్టమవుతుంది' అని ఆయన అన్నారు. 'మరెవ్వరూ చెయ్యలేదు కనుకే నేను చేస్తాను' అని మా గైడ్‌ను ఒప్పించిమరీ అదే టాపిక్ ఎంపిక చేసుకున్నాను. వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్‌ను కలిసి, మొదట ఆయన సూచించిన వ్యక్తిత్వవికాస పుస్తకాలన్నీ చదివాను. తర్వాత కొద్ది రోజులు ఆయనతో పాటు కౌన్సెలింగ్ సెషన్స్‌లో కూర్చొని విన్నాను. అలా క్రమశిక్షణ, సమయపాలన, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి, ఏకాగ్రత పెరుగుదల, సమష్టి తత్వం... లాంటి లక్షణాలు రంగస్థల శిక్షణతో పెంపొందుతాయని రూఢీ చేస్తూ వాటన్నింటినీ థీసెస్‌లో సవివరంగా రాశాను. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే రంగస్థల ఆటలు కూడా బోలెడున్నాయి. అందుకే ప్రతి ఒక్క ఇంటర్నేషనల్ స్కూల్లో ఇప్పుడు థియేటర్ ట్రైనర్‌ను తప్పనిసరిగా నియమిస్తున్నారు. అలా నేనూ ఒక కార్పొరేట్ పాఠశాలలో కొంతకాలం పని చేశాను. సిగ్గు, బిడియం లాంటివాటిని అధిగమించడానికి, స్పీచ్‌ను మరింత మెరుగుపరుచుకోడానికి రంగస్థల శిక్షణ చాలా తోడ్పడుతుంది. కొన్ని రకాల మానసిక సమస్యలకు కూడా ఇది గొప్ప ఉపశమనం. కనుక వర్క్‌షాప్స్ ద్వారా చాలా మందికి రంగస్థల నటనలో శిక్షణ ఇచ్చాను.

అలా మొదలైంది...

నా బాల్యం చాలావరకు ప్రసిద్ధ నాటక ఉద్యమకర్త ఏఆర్ కృష్ణ గారింట్లోనే గడిచింది. అమ్మానాన్నకు ఆయనే పెద్ద దిక్కు కావడంతో స్కూలుకు సెలవులు వస్తే చాలు నేను కృష్ణ తాతయ్య వాళ్ల ఇంటికి వెళ్లేదాన్ని. ఆయన ఒడిలో కూర్చొని నాటకాల రిహార్సిల్స్ చూసేదాన్ని. అప్పుడప్పుడూ తాతయ్య నాతోనూ డైలాగులు చెప్పిస్తుండేవారు. పదేళ్ల వయసులో అనుకొంటా... కృష్ణ తాతయ్య దగ్గర ఒక చిల్డ్రన్స్ థియేటర్ వర్క్‌షాప్ పూర్తి చేసి 'మళ్లీ మళ్లీ పుడితే గిడితే' నాటకంలో మొట్టమొదటిసారి రంగస్థలం మీద నటించాను. తర్వాత పదో తరగతిలో ఉండగా 'రసరంజని' నిర్వాహకుల్లో ఒకరైన సోమేశ్వర రావు దర్శకత్వంలో 'కాకి ఎంగిలి' నాటకంలో కథానాయికిగా నటించాను. అది నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు.

'రంగస్థల సావిత్రి' అనేవారు...

రెండు వందలకుపైగా నాటకాల్లో... దాదాపు రెండు వేల ప్రదర్శనల్లో నటించాను. అతి తక్కువ సమయంలో సంభాషణలు కంఠతా చెప్పడం నా ప్రత్యేకత. అది చూసి చాట్ల శ్రీరాములు గారు నన్ను 'డైలాగ్ రాక్షసి' అని పిలిచేవారు. మరొక నాటకరంగ ప్రముఖుడు డీఎస్ దీక్షిత్ గారు ఒక జాతీయ సదస్సులో నన్ను 'రంగస్థల సావిత్రి' అంటూ కొనియాడారు. జేవీ రమణమూర్తి, మొదలి నాగభూషణశర్మ, కోటా శంకర్రావు లాంటి రంగస్థల హేమాహేమీల దర్శకత్వంలో... రాళ్లపల్లి, సుత్తివేలు, వీజేశర్మ, సాక్షి రంగారావు, తనికెళ్ల భరణి, జేవీ సోమయాజులు, రఘుబాబు తదితర ప్రముఖులతో కలిసి రంగస్థలం మీద పని చేయడం నాకు లభించిన అరుదైన అవకాశం. రంగస్థల నటిగా నాలుగు సార్లు నంది అవార్డు, ఒక జాతీయ పురస్కారాన్ని అందుకున్నాను.

జాతీయ స్థాయి ప్రదర్శనే లక్ష్యం...

వినోదం స్మార్ట్‌ఫోన్ రూపంలో ప్రతిఒక్కరికీ అరచేతిలోకి వచ్చిన తర్వాత నాటకాల హవా కాస్త తగ్గిన మాట వాస్తవమే. అయితే మంచి ఇతివృత్తంతో ఈ కాలానికి తగినట్టు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగాత్మకంగా రూపొందించిన నాటకాలను మాత్రం ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఇదివరకు నాటకాల్లో నటించే ఆడవాళ్లంటే సమాజంలో చాలామందికి చులకనా భావం. ఇప్పుడు పరిస్థితి మారింది. కానీ అమ్మాయిలు ఇటువైపు రావడానికి మొగ్గు చూపడం లేదు. సినిమా, టెలివిజన్ రంగాలవైపు వెళ్లడానికి ఎక్కువమంది ఇష్టపడుతున్నారు. టాటాప్లే డీటీహెచ్‌లో హిందీ ఇతర భాషల నాటకాలు కొన్ని రికార్డు చేసి మరీ ప్రసారం చేస్తున్నారు. అలా తెలుగు నాటకాలను కూడా చేయగలిగితే బావుంటుంది. ఓటీటీ లాంటి వేదికలతో కొత్త నటీనటులకు అవకాశాలు పెరిగాయి. తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళలు కోర్సు చేసిన మా విద్యార్థులు చాలామంది ఇప్పుడు వెబ్‌సిరీస్‌లు, ఓటీటీ సినిమాలకు పని చేస్తున్నారు. సినిమా, రంగస్థలం దేని ప్రత్యేకత దానిదే. తెలుగునాట నాటక రంగం ఒక పరిశ్రమగా ఎదిగే రోజు రావాలి. మన తెలుగు నాటకాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్నది నా ఆశయం. అందుకోసం నావంతు కృషి చేస్తున్నాను.

> ### అమ్మానాన్న ప్రోత్సాహం
> సాధారణంగా పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు నటన వైపు వెళతామంటే తల్లితండ్రులు వారిస్తుంటారు. నా విషయంలో మాత్రం అందుకు పూర్తి విరుద్ధం. నన్ను నాటక రంగం వైపు వెళ్లమని ప్రోత్సహించింది మా నాన్న భళ్లమూడి కృష్ణమూర్తి, అమ్మ కల్యాణి. వారిద్దరూ రంగస్థల నటులు. అలా ఒకరికొకరు పరిచయం కావడంతో, ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. మా నాన్న ఎయిరిండియాలో ఉద్యోగం చేస్తూనే మరో వైపు నాటక సంఘాన్ని నెలకొల్పి క్రమం తప్పకుండా ప్రదర్శనలిచ్చేవారు. మొదట మా అక్కను నాటక రంగంవైపు తీసుకెళ్లాలి అనుకొంటే, కొన్ని పరిస్థితులవల్ల అది కుదరలేదు. దాంతో నన్ను రంగస్థలానికి పరిచయం చేశారు.
> 'అమ్మాయిని ఇంజనీరింగో మెడిసినో చదివించాలి కానీ నాటకాల్లోకి పంపించడమేంటి? ఇదేం విడ్డూరం' అని ఇరుగుపొరుగు చాలామంది అమ్మను సూటిపోటి మాటలన్నారు. నేను కూడా కిరణ్ బేడీలాంటివారి స్ఫూర్తితో మొదట పోలీసు అధికారి అవ్వాలి అనుకున్నాను. 'కాస్త కష్టపడితే ఎవరైనా పోలీసు కావచ్చు. కానీ అందరూ నటులు కాలేరు' అన్న అమ్మ మాటలు నాకు ఇప్పటికీ జ్ఞాపకం. తర్వాత అమ్మ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళలు శాఖలో అధ్యాపకురాలిగా చేరారు. ప్రస్తుతం అదే యూనివర్సిటీలో అమ్మకు సహోద్యోగిగా నేను అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తుండటం నాకు లభించిన అరుదైన అవకాశం.

● సొంత్వన్
ఫొటోలు: రాజ్‌కుమార్

ఈ ప్రయాణం ఇంతటితో ఆగిపోదు

విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వం వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించారు. ఈ నెల 29న రాబోతోంది. రమాకాంత్ రెడ్డి ఆదివారం మీడియాతో ముచ్చటించారు.



డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి

"కలియుగం పట్టణంలో' అంటే ఊరిపేరు కాదు. కలియుగంలో మనుషులు ఎలా ఉన్నారు అనేది ఓ పట్టణానికి ముడిపెట్టి ఈ చిత్రంలో చూపించాం. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ అయినా ఇందులోని మదర్ సెంటిమెంట్, లవ్, యాక్షన్ ఎపిసోడ్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. వాటితో పాటు ఇందులో మంచి మెసేజ్ కూడా ఉంది. కాలేజీ స్టూడెంట్స్ అందరూ దానికి తప్పకుండా కనెక్ట్ అవుతారు. కోడి రామకృష్ణ 'అరుంధతి' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టి పలువురు దర్శకుల వద్ద పనిచేసాను. ఈ సినిమాను ఇండస్ట్రీ పెద్దలకు చూపించాం. మంచి కాంప్లిమెంట్స్ ఇచ్చారు. మొదటి సినిమానే బాగా చేసావు, డేరింగ్‌గా చేసావు అనడంతో ఎంతో ఆనందంగా అనిపించింది. ఈ సినిమాకు అజయ్ అరసాద మంచి మ్యూజిక్ అందించారు. ఈ 'కలియుగ పట్టణంలో' ప్రయాణం ఇంతటితో ఆగిపోదు..దీనికి సీక్వెల్‌గా 'కలియుగ నగరంలో' వస్తుంది" అని చెప్పారు.

నా నల్లా కలువా పువ్వా



చైతన్యారావు, అర్జున్ అంబటి హీరోలుగా కిశోర్ దాత్రి కథానాయికగా నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'. సతీశ్ రాపోలు దర్శకత్వంలో నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మించారు. ఏప్రిల్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'నా నల్లా కలువా పువ్వా' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం ఆదివారం విడుదల చేసింది. అత్యాచారాలకు గురవుతున్న అమ్మాయిల కుటుంబాల్లోని ఆవేదనను ఈ పాటలో మనసును కదిలించేలా చూపించారు. పెంచల్‌దాస్ సాహిత్యం అందిస్తూ, ఆలపించిన ఈ గీతానికి పి. ఆర్ స్వరాలు సమకూర్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సతీశ్ చెప్పిన కథ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. మంచి అవుట్‌పుట్ వచ్చింది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా నిర్మాత సహకారం వల్ల సినిమాను అనుకున్న విధంగా తీయగలిగాను. ప్రేక్షకులు మెచ్చే మంచి కమర్షియల్ చిత్రం అవుతుంది' అన్నారు.

సమంత సోయగం

అందం, చెక్కు చెదరని ఆత్మస్థైర్యం సమంత సొంతం . మయోసైటిస్ వ్యాధి బారిన పడినా కుంగిపోకుండా సినీ కెరీర్‌ను కొనసాగిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. 'సిటాడెల్: హనీ-బన్నీ' సిరీస్ షూటింగ్ పూర్తి చేసి మాంచి స్పీడ్ మీద ఉన్నారు సమంత. ఈసారి హాట్ ఫొటో షూట్‌తో కుర్రకారు హృదయలను కొల్లగొట్టారు. బ్లాక్ కలర్ సూట్‌లో హాట్ హాట్‌గా పోజులిచ్చారు. ఇప్పుడు ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం సమంత మయోసైటిస్‌కు చికిత్స తీసుకుంటూనే చిత్రీకరణల్లో పాల్గొంటున్నారు.



ఏప్రిల్‌లో లవ్ మీ



ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. దెయ్యాన్ని ప్రేమించిన ఓ యువకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో కథ సాగుతుంది. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మిస్తున్నారు. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కింది. ఈ హారర్ థ్రిల్లర్ రిలీజ్ డేట్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. 'లవ్ మీ' చిత్రాన్ని ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రం ఇస్తుందని ఈ సందర్భంగా యూనిట్ తెలిపింది. ఎం. ఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: పి. సి. శ్రీరామ్. ఎడిటర్: సంతోశ్ కామిరెడ్డి.

ఇళయరాజాగా ఇలా..!



ధనుశ్



ఇళయరాజా

మ్యాస్ట్రో ఇళయరాజా బయోపిక్ తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇందులో ఇళయరాజా పాత్రను ధనుశ్ పోషిస్తున్నారు. ఆయన ఇళయరాజా గెటప్పులో ఉన్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అచ్చు ఇళయరాజాను తలపించేలా ధనుశ్ కనిపించారు. 'ఇళయరాజా పాత్రలో ధనుశ్ ఎలా ఉన్నాడో చూడండి అంటూ' అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. 'ఇళయరాజా' బయోపిక్ అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఓజీ విలన్ వచ్చాడు



బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ 'ఓజీ' చిత్రంలో ప్రతినాయకుడి అవతారం ఎత్తిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ నటిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 27న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం ఇమ్రాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఇమ్రాన్ ఫస్టులుక్‌ను విడుదల చేసింది. ఇందులో సిగరెట్ వెలిగిస్తూ సీరియస్ లుక్‌లో ఆయన కనిపించారు.

భద్రాద్రిలో నేడు డోలోత్సవం, వసంతోత్సవం

భద్రాచలం మార్చి 24: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం గోదావరి నుంచి తీర్థ బిందెను తీసుకొచ్చి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి డోలోత్సవం, వసంతోత్సవాలకు అంకురార్పణ చేశారు. డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించే సోమవారం నిత్యకల్యాణాన్ని నిలిపివేయనున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 9 నుంచి శ్రీరామనవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా.. ఏప్రిల్ 17న స్వామి వారికి కల్యాణం నిర్వహించనున్నారు. కాగా, శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణానికి వినియోగించే తలంబ్రాల తయారీకి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. దేవస్థానం వైదిక సిబ్బంది వారి సతీమణులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గత ఏడాది 250 క్వింటాళ్ల తలంబ్రాలు సిద్ధం చేయగా ఈసారి 300 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్య కల్యాణం సదర్భంగా తలంబ్రాల తయారీ కోసం జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి భక్త బృందం 128 క్వింటాళ్ల బియ్యాన్ని భద్రాచలంకు తీసుకొచ్చింది. ఈ బియ్యాన్ని దేవస్థానం అధికారులకు అందజేసింది.

వర్షపు నీటి ఆదాపై రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్

» పట్టణాల్లో ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ నిర్మాణాలపై సర్వే

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణీకరణ పేరుతో పర్యావరణాన్ని, జలవనరుల సంరక్షణను గాలికొదిలేస్తే దాని దుష్పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పడానికి బెంగళూరులో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడే నిదర్శనం. నగర విస్తరణతో పాటు ఆక్రమణలతో బావులు, చెరువులు అంతరించిపోవడం, విపరీతంగా బోర్లు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి అక్కడ నీటి సమస్య మరింత జటిలంగా మారింది. హైదరాబాద్ లాంటి నగరంలోనూ వేలాది చెరువులు కనుమరుగవడంపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే మునిసిపాలిటీల్లో తాగునీటి సమస్య సవాలుగా మారుతోంది. భూగర్భ జలాల సంరక్షణతోపాటు నీటి వనరులను కాపాడుకోకపోతే భవిష్యత్తులో బెంగళూరులాంటి పరిస్థితులు మన దగ్గర కూడా పునరావృతం అయ్యే ప్రమాదం లేకపోలేదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా జలవనరుల సంరక్షణ, నీటి పొదుపుపై పట్టణ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు నెలలు కమిషనర్లను అప్రమత్తం చేసి చైతన్య కార్యక్రమాలతో పాటు నీటి పొదుపుపై అందర్నీ భాగస్వాములను చేయాలని సీడీఎంఏ దివ్య దేవరాజన్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా మునిసిపాలిటీలోల 250 గజాలు, అంతకంటే ఎక్కువ స్థలంలో ఇల్లు నిర్మించుకున్న వారు వర్షపు నీటి ఆదా కోసం ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ నిర్మాణాలు చేపట్టారో లేదో పురపాలక శాఖ యంత్రాంగం సర్వే చేసి నివేదిక ఇవ్వాలని సీడీఎంఏ ఆదేశించారు. నీటి పంపిణీ, పొదుపు, పునర్ వినియోగంపై దశలవారీగా మునిసిపాలిటీల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రూ.65.86 లక్షల నగదు.. 5.5 కిలోల వెండి సీజ్

షాద్‌నగర్ రూరల్, తలమడుగు, హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వాహన తనిఖీలు కొనసాగుతున్నాయి. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, ఇతర వస్తువులను పోలీసులు, అధికారులు ఎక్కడికక్కడ సీజ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.65.86 లక్షల నగదు, 5.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ జిల్లాలో చేసిన తనిఖీల్లో రూ46.61 లక్షల నగదు, రూ.6.23 లక్షల విలువైన వివిధ రకాల వస్తువులను సీజ్ చేశామని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా రాయికల్ టోల్‌ప్లాజా వద్ద ఓ బస్సులో తనిఖీ చేసిన అధికారులు ఓ విద్యార్థి వద్ద రూ.16.5 లక్షల నగదు, 5.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద ఓ కారులో రూ.2 లక్షలు, నిర్మల్ జిల్లా నర్సపూర్(జి) మండలంలో ఓ వాహనదారుడి వద్ద రూ.75వేలు సీజ్ చేశారు.

భక్తులతో కిటకిటలాడిన యాదగిరిక్షేత్రం


యాదగిరీశుడికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, మార్చి 24: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. ఉచిత దర్శనానికి మూడు గంటలు, వీఐపీ టికెట్ దర్శనానికి గంట సమయం పట్టింది. క్యూకాంప్లెక్స్‌లోని ఏసీలు పనిచేయకపోవడంతో ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులుపడ్డారు. 30వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.55,38,896 ఆదాయం సమకూరిందని ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. ఎండలు మండుతుండటంతో కొండపై భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఉపశమనం కోసం అధికారులు చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు.


ప్రధాన ఆలయంలో క్యూలైన్లలో భక్తుల రద్దీ

ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ నేత!

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన దర్యాప్తులో పాత్రధారుల లెక్కతేల్చిన అధికారులు.. ఇప్పుడు సూత్రధారులపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ఈ కేసులో ముందు నుంచి ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు కీలక నిందితుడని పోలీసులు భావించినా అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న అరెస్టు తర్వాతే ఆ విషయాన్ని రూఢీ చేసుకున్నారు. వీరిద్దరినీ పశ్చిమ మండలం పోలీసులు ఆదివారం నాంపల్లి కోర్టు న్యాయమూర్తి కన్నయ్యలాల్ ఇంటి వద్ద(కొంపల్లి) హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్టులో గత ప్రభుత్వ హయాంలో విపక్ష నేతలు, అధికారులు, ఇతరుల ఫోన్లను అనధికారికంగా ట్యాపింగ్ చేయడానికి ప్రభాకర్‌రావు ఆదేశాలే కారణమని భుజంగరావు, తిరుపతన్న వాంగ్మూలమిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనక బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత ఉన్నట్లు స్పష్టం చేశారు. "గత ప్రభుత్వ హయాంలో ఓ బీఆర్ఎస్ కీలక నేత చెప్పిన నంబర్లను ట్యాప్ చేసినట్లు భుజంగరావు, తిరుపతన్న అంగీకరించారు. సదరు నేత ఇచ్చే నంబర్లను వీరిద్దరూ ప్రణీత్‌రావుకు చేరవేసేవారు. ప్రణీత్‌రావు ఇచ్చే ఔట్‌పుట్‌ను ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తిరిగి బీఆర్ఎస్ నేతకు అందజేసేవారు. అప్పట్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ(ఓఎస్‌డీ)గా ఉన్న రాధాకిషన్‌రావు ఇచ్చిన నంబర్లన్నీ ట్యాప్ చేసినట్లు ఒప్పుకొన్నారు. వాటి ఔట్‌పుట్‌ను కూడా ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తిరిగి రాధాకిషన్‌రావుకు పంపేవారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు నుంచి వందల మంది రాజకీయ నాయకుల నంబర్లను ట్యాప్‌చేసినట్లు భుజంగరావు, తిరుపతన్న అంగీకరించారు" అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ కేసులో మరో కీలక నిందితుడు, ఐన్యూస్ యజమాని శ్రవణ్‌కుమార్‌రావు, ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు విదేశాల్లో ఉన్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఆ ముగ్గురిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఇప్పటికి ప్రభాకర్‌రావు ప్రధాన నిందితుడని, ఆ తర్వాత వరుసగా ప్రణీత్‌రావు, రాధా



కిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్న ఉన్నట్లు ఓ అధికారి వివరించారు. బీఆర్ఎస్ నేతల ప్రమేయం బయటపడితే వారు ప్రధాన నిందితులుగా చేరతారని పేర్కొన్నారు. భుజంగరావు, తిరుపతన్నకు 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. మరోవైపు ప్రణీత్‌రావు పోలీసు కస్టడీ ముగియడంతో అతణ్ని కూడా న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఆయనకు ఈనెల 28 వరకు రిమాండ్ విధించారు. ఆ వెంటనే ముగ్గురినీ చంచల్‌గూడ జైలుకు తరలించారు. భుజంగరావు, తిరుపతన్నలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ వెస్ట్‌జోన్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. భుజంగరావు, తిరుపతన్న తమ వాంగ్మూలాల్లో నేరాన్ని అంగీకరించిన నేపథ్యంలో నేడో రేపో వారిద్దరినీ సస్పెండ్ చేస్తూ డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరినీ కస్టడీకి తీసుకుని, విచారిస్తే మరికొందరు అధికారుల పాత్ర బయటపడే అవకాశాలున్నాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ప్రణీత్‌రావు వాంగ్మూలం మేరకు నల్లగొండలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్, వరంగల్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను పశ్చిమ మండలం పోలీసులు విచారించారు.

ప్రభాకర్‌రావు నోరు విప్పితే..!

ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు కీలక నిందితులు విచారణలో చెప్పిన పేరు ప్రభాకర్‌రావు. ఆయన ఆదేశాలతో విపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అంగీకరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. ప్రభాకర్‌రావు కూడా పాత్రధారి అని దర్యాప్తు అధికారులు ఖరారు చేశారు. సూత్రధారులు ఎవరనేది తెలియాలంటే ప్రభాకర్‌రెడ్డి అరెస్టు కావాల్సిందేనని చెబుతున్నారు. ఆయనను విచారిస్తే ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ల ట్యాపింగ్ చేశారో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. ప్రధాన సూత్రధారులకు వ్యతిరేకంగా కేసు బలంగా ఉండాలంటే ప్రభాకర్‌రావు వాంగ్మూలం కీలకమని న్యాయనిపుణులు చెబుతున్నారు.

ఐన్యూస్ యజమాని ఇంట్లో సర్వర్లు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఐన్యూస్ టీవీ చానల్ యజమాని శ్రవణ్‌కుమార్‌రావు పాత్ర కీలకమని దర్యాప్తు అధికారులు తేల్చారు. ప్రణీత్‌రావు విచారణలో శ్రవణ్‌రావు పేరు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారుజామును శ్రవణ్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించిన వెస్ట్‌జోన్ పోలీసులు.. రెండు ల్యాప్‌టాప్‌లు, 4 ట్యాబ్‌లు, 5 పెన్‌డ్రైవ్‌లు, ఒక హార్డ్‌డిస్క్, ఒక డీవీఆర్(సీసీకెమెరా ఫుటేజీ)ని సీజ్ చేశారు. వాటిని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. వాటిలోని సమాచారాన్ని రిట్రీవ్ చేస్తే.. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరెవరున్నారనే విషయం బయటపడుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇదివరకే ప్రణీత్‌రావు ఫోన్ చాటింగ్‌లను రిట్రీవ్ చేసినప్పుడు శ్రవణ్‌రావుతో సంభాషణలు, ఇతర ఆధారాలను సేకరించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కోసం శ్రవణ్‌రావు తన మీడియా సంస్థలో ప్రత్యేక సర్వర్‌రూమ్‌ను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు ప్రణీత్‌రావుకు సమాచారం అందజేసేవాడని గుర్తించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు నేతలు కూడా తరచూ శ్రవణ్‌రావు ఇంటికి వచ్చివెళ్లినట్లు, గంటల తరబడి భేటీ అయినట్లు పోలీసులు ఆధారాలను సేకరించారు. డీవీఆర్ డేటాను రిట్రీవ్ చేస్తే.. మరికొందరు నేతల ప్రమేయం బయటపడే అవకాశాలున్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

మునుగోడు ఉప ఎన్నికకు ఫోన్ ట్యాపింగ్ లింకు?

» ప్రతిపక్షాల వ్యూహాలను

పసిగట్టి బీఆర్ఎస్‌కు సమాచారం!

యాదాద్రి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త అంశాలు వెలుగు చూస్తున్నాయి. మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపులోనూ ఫోన్ ట్యాపింగ్ కీలక పాత్ర పోషించినట్లు చర్చ జరుగుతోంది. ప్రతిపక్ష పార్టీల నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేసి, వారి వ్యూహాలను పసిగట్టి.. నాటి అధికార పార్టీకి సమాచారం అందించినట్లు, ప్రతిపక్షాలకు చెందిన రూ.కోట్ల నగదును నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకొని స్వాధీనం చేసుకున్నట్లు అనుమానాలు తెరపైకి వస్తున్నాయి. నాటి ఉప ఎన్నికకు ఫోన్ ట్యాపింగ్ లింకు తప్పకుండా ఉంటుందని రాజకీయ నేతలు భావిస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నికను బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో .. అక్కడ హోరాహోరీ పోరు జరిగింది. బీఆర్ఎస్ తమ బలగాన్ని మొత్తం మునుగోడులోనే రంగంలోకి దింపింది. బీజేపీ జాతీయ నాయకత్వం సైతం ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా గెలుపొంది, తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా నిలవాలని తీవ్రంగా ప్రయత్నించింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిని గెలిపించుకుని.. సిటింగ్ స్థానాన్ని కాపాడుకోవడంతో పాటు రాష్ట్రంలో తమ సత్తా చూపించాలని భావించింది. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను వినియోగించింది. కొంతమంది బీజేపీ నేతలకు చెందిన నగదును హైదరాబాద్‌లోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చివరికి అధికార బీఆర్ఎస్ అభ్యర్థే గెలుపొందారు. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో నాటి ఉప ఎన్నికపై అనుమానాలు బలపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన భుజంగరావు గతంలో పొలిటికల్ ఇంటెలిజెన్స్ విభాగంలో, తిరుపతన్న ఎస్ఐబీలో అదనపు ఎస్పీలుగా విధులు నిర్వర్తించారు. వీరితోపాటు పలువురు అధికారులు మునుగోడు నియోజకవర్గంలోనే రెండు నెలల పాటు మకాం వేసి కీలక అంశాలపై దృష్టి కేంద్రీకరించినట్టుగా అనుమానాలు తెరపైకి వస్తున్నాయి.

బీఆర్ఎస్ ఎంపీ సంతోష్‌పై భూ కబ్జా కేసు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు ఆరా తీయగా.. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్‌తో పాటు లింగాలరెడ్డి శ్రీధర్.. ఈ గదులకు సంబంధించి జీహెచ్ఎంసీకి ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నట్లు తేలింది. లోతుగా విచారించగా.. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ఇంటి నెంబర్లు సిద్ధం చేసి కబ్జా చేసినట్లు గుర్తించారు. దీంతో కంపెనీ ప్రతినిధి చింతా మాధవ్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీ సంతోష్‌కుమార్, లింగాలరెడ్డి శ్రీధర్‌పై సెక్షన్ 420, 468, 471, 447, 120(బి) రెడ్ విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

ఫోర్జరీ చేయలేదు.. కొనుగోలు చేశాను: సంతోష్

తనపై కేసు నమోదు చేయడాన్ని ఎంపీ సంతోష్‌కుమార్ తప్పుబట్టారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు కేసు పెట్టారని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. షేక్‌పేటలో ఇంటి స్థలాన్ని తాను సేల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేశానని తెలిపారు. దీనిపై ఏదైనా న్యాయపరమైన అభ్యంతరాలుంటే ముందుగా తనకు లీగల్ నోటీసు ఇవ్వాలని, కనీసం వివరణ అయినా అడగకుండా ఫోర్జరీ చేశానంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం, కేసు పెట్టడం సరికాదని అన్నారు. షేక్‌పేటలోని సర్వే నంబర్ 129/54లోఉన్న 904 చదరపు గజాల ఇంటిస్థలాన్ని తాను రూ.3 కోట్ల 81 లక్షల 50 వేలు చెల్లించి శ్యాంసుందర్ ఫుల్జాల్ అనే వ్యక్తినుంచి 2016లో (సేల్ డీడ్ నంబర్ 5917/2016. 11 నవంబరు 2016) చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ ఇంటిస్థలం 1350 చదరపు గజాలు అంటూ పోలీసులు, మీడియా చెబుతున్నారని, కానీ.. తాను కొన్నది 904 గజాలేనని వెల్లడించారు. ఇందులో ఫోర్జరీ అనే అంశానికి తావులేదని, ఈ భూమిపై ఎవరైనా విచారణ చేసుకోవచ్చని, ఎలాంటి అభ్యంతరం లేదని, న్యాయపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడలేదని, డబ్బులు పెట్టి కొన్న ఆస్తిపై అనవసర నిందలు వేస్తూ.. ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని తప్పుబట్టారు.

మెస్ చార్జీలు పెరిగేదెన్నడో?

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. మెస్ చార్జీల పెంపుతో ప్రభుత్వంపై ఎంత భారం పడుతుందనే అంశాలపై చర్చించారు. అదే రోజు (మార్చి 1నే) మెస్ బిల్లులను పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకున్నామని, సంబంధిత నివేదికను సీఎంకు పంపామని హరీశ్ ప్రకటించారు. అంతా బాగానే ఉన్నా.. చార్జీల పెంపుపై ఉత్తర్వులు మాత్రం ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా చార్జీలను పెంచాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

పెంచుతాం అన్నారు..

మెస్ బిల్లులను 25 శాతం పెంచాలని అప్పటి మంత్రులు నిర్ణయించారు. 3-7వ తరగతి విద్యార్థులకు రూ.1,200; 8-10వ తరగతి విద్యార్థులకు రూ.1,400; ఇంటర్, పీజీ విద్యార్థులకు రూ.1,875 చొప్పున ఇవ్వాలని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. సీఎం ఆమోదముద్ర పడిన తర్వాత మెస్ బిల్లులు పెరుగుతాయని ప్రకటించారు. తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు. మెస్ బిల్లుల పెంపుతో ప్రభుత్వంపై ఏటా రూ.302 కోట్ల భారం పడుతుందని కూడా నిర్ధారించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల హాస్టళ్లు కలిపి 3,214 ఉండగా, వీటిలో (2022-23 విద్యా సంవత్సరం గణాంకాల ప్రకారం) 8,59,959 మంది విద్యార్థులు ఉన్నారు. బిల్లుల అంశాన్ని తేల్చకపోవడంతో విద్యార్థులకు పూర్తిస్థాయి మెనూ అందడంలేదు. చికెన్, గుడ్డు, ఇతర కూరగాయలు సైతం పూర్తిగా అందించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదిలా ఉండగా ఈ ఏడాది క్లాసులు ప్రారంభమైన మొదట్లోనే పలు గురుకుల, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అనారోగ్యం పాలయ్యారు. హాస్టళ్లలో ఆహారం కలుషితం అవుతోందని, నాణ్యమైన నిత్యావసరాలను వినియోగించడంలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు తమకు 10 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. అయితే గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

కాస్మెటిక్, డే స్కాలర్‌ల చార్జీల పరిస్థితి?

సంక్షేమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల మెస్ బిల్లులను పెంచాలని నిర్ణయం తీసుకున్న సర్కారు వాటినే పెంచలేదు. ఈ నేపథ్యంలో కాస్మెటిక్ చార్జీలు, కాలేజీలకు వెళ్లే డే స్కాలర్ విద్యార్థులకు చెల్లించే మెస్ బిల్లుల పెంపు పరిస్థితి ఏంటన్నది తేలలేదు. నిత్యావసరాలతో పాటు కాస్మెటిక్ చార్జీలు కూడా పెరిగిన నేపథ్యంలో వీటి ధరలను కూడా పెంచాలని విద్యార్థుల నుంచి డిమాండ్లు వస్తున్నాయి.

సున్నానికీ నోచుకోని బీసీ హాస్టళ్లు!

» పదేళ్లుగా చిన్నపాటి మరమ్మతులూ కరువే

» చాలా చోట్ల భవనాలు పెచ్చులూడుతున్న వైనం

» ప్రభుత్వ పరిధిలోని 390భవనాల్లో ఇదే పరిస్థితి

» మరమ్మతులకే 15 కోట్లు ఖర్చవుతుందని అంచనా

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లు అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. చాలా చోట్ల భవనాల లోపల పెచ్చులూడిపోతున్నాయి. ఇక, మరుగుదొడ్లు, స్నానపు గదుల గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. ఆయా భవనాలకు గత పదేళ్లలో ఒక్క సారి కూడా సున్నం వేయలేదంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేనితనం వెరసి.. కొన్నేళ్లుగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ కలిపి మొత్తం 703 హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 390 భవనాలు ప్రభుత్వం పరిధిలో ఉండగా, మరో 313 హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పరిధిలో కొనసాగుతున్న హాస్టల్ భవనాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. భవనాల బాగోగులపై గత ప్రభుత్వం ఏ మాత్రం దృష్టి సారించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలోనే ఆయా సంక్షేమ వసతి గృహాలన్నింటినీ పరిశీలించి, ఏమైనా మరమ్మతులు ఉంటే చేయాలి. ఇది సాధారణంగా జరగాల్సిన ప్రక్రియ. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ పరిధిలో కొనసాగుతున్న 390 హాస్టళ్లలో పదేళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఏళ్ల తరబడి అలాగే కొనసాగించడంతో ఇపుడు ఒక్కో హాస్టల్‌లో చేపట్టాల్సిన చిన్నపాటి మరమ్మతులకే దాదాపు రూ.40లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల బీసీ సంక్షేమ శాఖపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమీక్ష నిర్వహించగా.. బీసీ హాస్టల్ భవనాలకు పదేళ్ల నుంచి సున్నాలు కూడా వేయలేదని అధికారులే స్వయంగా చెప్పినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలోని బీసీ హాస్టళ్లకు మరమ్మతులు చేయాలంటూ జిల్లాల కలెక్టర్లకు బీసీ శాఖ కమిషనర్ ఇటీవలే లేఖ రాశారు. దీంతో ఆయా వివరాలు ఇవ్వాలని కలెక్టర్లు కోరగా.. పదేళ్ల నుంచి చాలా భవనాలకు అసలు సున్నమే వేయలేదని, మొదటగా సున్నం వేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని జిల్లా అధికారులు కోరినట్టు తెలిసింది. మరుగుదొడ్లు, స్నానపు గదులు, భవనాల లోపలివైపు పెచ్చులూడిపోవడం సహా పలు ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయంటూ ఏకరువు పెట్టినట్టు సమాచారం. క్షేత్ర స్థాయి నుంచి అందించిన జాబితాలను చూసి, ఇన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయా అంటూ కలెక్టర్లు, బీసీ శాఖ ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు సంబంధించి సుమారుగా ఒక్కో హాస్టల్‌కు రూ.40లక్షల చొప్పున ఖర్చవుతుందని, మొత్తం 390 హాస్టళ్లకు రూ.13-15 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు నియోజక వర్గాల అభివృద్ధి నిధులు లేదా ఇతర ప్రత్యేక నిధులను వినియోగించి హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టాలని భావిస్తున్నారు.

సంజూ..సత్తా

రాజస్థాన్ శుభారంభం
20 పరుగులతో లఖ్‌నవూ ఓటమి


సంజూ శాంసన్ (52 బంతుల్లో 82 నాటౌట్)

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) క్రునాల్ (బి) మొహిసిన్ 24, బట్లర్ (సి) రాహుల్ (బి) నవీన్ 11, శాంసన్ (నాటౌట్) 82, పరాగ్ (సి) దీపక్ (బి) నవీన్ 43, హెట్‌మయెర్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 5, జురెల్ (నాటౌట్) 20; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 193/4; వికెట్ల పతనం:** 1-13, 2-49, 3-142, 4-150; **బౌలింగ్:** మొహిసిన్ 4-0-45-1, నవీనుల్ హక్ 4-0-41-2, క్రునాల్ 4-0-19-0, బిష్ణోయ్ 4-0-38-1, యష్ ఠాకూర్ 3-0-43-0, బదోని 1-0-6-0.

లఖ్‌నవూ: డికాక్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 4, రాహుల్ (సి) జురెల్ (బి) సందీప్ 58, పడిక్కల్ (బి) బౌల్ట్ 0, బదోని (సి) బట్లర్ (బి) బర్గర్ 1, హుడా (సి) జురెల్ (బి) చాహల్ 26, పూరన్ (నాటౌట్) 64, స్టొయినిస్ (సి) జురెల్ (బి) అశ్విన్ 3, క్రునాల్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 173/6; వికెట్ల పతనం:** 1-4, 2-10, 3-11, 4-60, 5-145, 6-154; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-35-2, బర్గర్ 3-0-30-1, అశ్విన్ 4-0-35-1, అవేశ్ 3-0-21-0, చాహల్ 3-0-25-1, సందీప్ 3-0-22-1.

జైపూర్: ఐపీఎల్‌ను రాజస్థాన్ రాయల్స్ విజయంతో ఆరంభించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సంజూ శాంసన్ (52 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సలతో 82 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో సత్తా చాటిన వేళ.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 20 పరుగుల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 193 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (29 బంతుల్లో ఫోర్, 3 సిక్సర్లతో 43) అదరగొట్టాడు. లఖ్‌నవూ బౌలర్లలో నవీనుల్ హక్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో లఖ్‌నవూ ఓవర్లన్నీ ఆడి 173/6 స్కోరు మాత్రమే చేసింది. బౌల్ట్ (2/35) దెబ్బకు జెయింట్స్ 11/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ రాహుల్ (58), దీపక్ హుడా (26) 4వ వికెట్‌కు 49 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. వీరి భాగస్వామ్యం బలపడుతున్న సమయంలో హుడాను చాహల్ అవుట్ చేశాడు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సలతో 64 నాటౌట్), రాహుల్.. 5వ వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యంతో రాజస్థాన్ శిబిరంలో గుబులు రేపారు. అయితే, డెత్ ఓవర్లలో సందీప్ శర్మ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లఖ్‌నవూ జోరును అడ్డుకొన్నాడు. ఆఖరి 4 ఓవర్లలో 49 పరుగులు కావాల్సిన సమయంలో.. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న రాహుల్‌ను సందీప్ క్యాచ్ అవుట్ చేసి లఖ్‌నవూను దెబ్బతీశాడు.

ఆదుకొన్న శాంసన్, పరాగ్: అంతకుముందు రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు బట్లర్ (11), యశస్వీ జైస్వాల్ (24) పవర్‌ప్లేలోపే పెవిలియన్ చేరారు. అయితే, కెప్టెన్ శాంసన్‌కు పరాగ్ రూపంలో చక్కని సహకారం లభించడంతో స్కోరు వేగం పుంజుకొంది. 9వ ఓవర్‌లో యష్ బౌలింగ్‌లో పరాగ్ బంతిని బౌండ్రీ అవతలకు తరలించగా.. శాంసన్ 2 సిక్సలతో 21 పరుగులు రాబట్టడంతో రాజస్థాన్ 84/2తో నిలిచింది. 15వ ఓవర్‌లో నవీన్ బౌలింగ్‌లో 4,6తో జోరుచూపిన పరాగ్.. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అవుటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో శాంసన్, ధ్రువ్ జురెల్ (20 నాటౌట్) వేగంగా 43 పరుగులు జోడించడంతో.. రాజస్థాన్ స్కోరు 190 మార్క్ దాటింది.

హర్షిత్ రాణాకు భారీ జరిమానా

కోల్‌కతా: ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన కోల్‌కతా నైట్ రైడర్స్ పేసర్ హర్షిత్ రాణాపై భారీ జరిమానా పడింది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో రెండుసార్లు అనుచితంగా ప్రవర్తించడంతో అతడి మ్యాచ్ ఫీజు లో మొత్తం 60 శాతం కోత విధించారు. రెండుసార్లు కోడ్ ఉల్లంఘించిన రాణా మ్యాచ్ ఫీజులో 10, 50 శాతం జరిమానా విధించామని ఐపీఎల్ తెలిపింది. అయితే, ఆ సందర్భాల గురించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు. అయితే, సన్‌రైజర్స్ ఓపెనర్ మయాంక్ అవుటై వెళ్తున్నప్పుడు రాణా ఫ్లయింగ్ కిస్ ఇచ్చి.. అతడిని రెచ్చగొట్టేలా ప్రవర్తించడం ఇందుకు ఒక కారణమని తెలుస్తోంది.

ముంబై.. అదే తీరు!


విజయానందంలో గిల్, ఉమేశ్


సాయి సుదర్శన్ (45)

నేటి మ్యాచ్
బెంగళూరు X పంజాబ్
రాత్రి 7.30 గం. నుంచి

ఓటమితో ఆరంభం
గుజరాత్ బౌలర్లు అదుర్స్
ఆఖరి ఓవర్‌లో విజయం

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో తమ ఆరంభ మ్యాచ్‌ను ఓడడం ముంబై ఇండియన్స్‌కు ఆనవాయితీగా మారినట్టుంది. గుజరాత్ టైటాన్స్‌ను ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేయడంతో 2012 సీజన్ తర్వాత తమకు తొలి మ్యాచ్ విజయం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అయ్యారు. తీరా చివరి ఆరు ఓవర్లలో.. చేతిలో ఏడు వికెట్లున్నా 48 రన్స్ చేయలేక చతికిలపడింది. దీంతో కొత్త కెప్టెన్ వచ్చినా వరుసగా 12వ 'తొలి' ఓటమి తప్పలేదు. అటు టైటాన్స్ బౌలర్లు మాత్రం పట్టు వదలకుండా, కీలక డెత్ ఓవర్లలో పైచేయి సాధించడం ఫలితాన్నిచ్చింది. దీంతో ఆదివారం ఉత్కంఠ భరితంగా ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆరు పరుగుల తేడాతో గుజరాత్ నెగ్గింది. గిల్‌కు కెప్టెన్‌గా ఇదే తొలి మ్యాచ్. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (45), గిల్ (31), తెవాటియా (22) రాణించారు. బుమ్రాకు మూడు, కొట్జీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 162 పరుగులు చేసి ఓడింది. బ్రెవిస్ (46), రోహిత్ (43), తిలక్ (25) ఆకట్టుకున్నారు. స్పెన్సర్ జాన్సన్, ఉమేశ్, ఒమర్జాయ్, మోహిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సాయి సుదర్శన్ నిలిచాడు.

బౌలింగ్ భళా: ఓ మాదిరి ఛేదనలో ముంబైని టైటాన్స్ బౌలర్లు అడ్డుకున్నారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఇషాన్ (0) వెనుదిరగ్గా, అరంగేట్ర బ్యాటర్ నమన్ ధిర్ (20) ఉన్న కాసేపు అదరగొట్టాడు. ఒమర్జాయ్ ఓవర్‌లో తను 4,4,4,6 బాది ఆఖరి బంతికి అవుటయ్యాడు. అనంతరం ఓపెనర్ రోహిత్, డివాల్డ్ బ్రెవిస్ భారీషాట్లతో జీటీ బౌలర్లను ఆడుకున్నారు. ఇద్దరి జోరుతో ముంబై అవలీలగా గెలుస్తుందనిపించింది. రోహిత్ అర్ధసెంచరీకి ముందు 13వ ఓవర్‌లో ఎల్బీ కావడంతో మూడో వికెట్‌కు 77 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడే మ్యాచ్ టర్న్ అయ్యింది. కాసేపటికే బ్రెవిస్‌ను మోహిత్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయగా స్కోరులో వేగం తగ్గింది. ఇక 12 బంతుల్లో 27 రన్స్ కావాల్సిన వేళ తిలక్, కొట్జీ (1) వికెట్లను పేసర్ జాన్సన్ తీయడంతో సమీకరణం 19 రన్స్‌కి మారింది. అయితే ఆఖరి ఓవర్ తొలి రెండు బాల్స్‌ను హార్దిక్ 6,4 బాదడంతో మ్యాచ్ ముంబై వైపు మొగ్గింది. కానీ మూడు, నాలుగు బంతుల్లో హార్దిక్ (11), పియూష్ చావ్లా (0)ల వికెట్లు తీసిన ఉమేశ్ గట్టి షాకే ఇచ్చి మ్యాచ్‌ను ముగించాడు.

మెరుపుల్లేవ్..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్ వేగంగా ఆరంభమైనా మధ్య ఓవర్లలో భారీ షాట్లు ఆడలేకపోయింది. స్టార్ పేసర్ బుమ్రా మూడు వికెట్లతో గుజరాత్‌ను కట్టడి చేశాడు. తొలి వికెట్‌కు ఓపెనర్లు సాహా (15), గిల్ 31 పరుగులు జోడించారు. వీరి నిష్క్రమణ తర్వాత సాయి సుదర్శన్, ఒమర్జాయ్ (17) మూడో వికెట్‌కు 40 పరుగులు జత చేర్చారు. 17వ ఓవర్‌లో మిల్లర్ (12), సాయిని బుమ్రా అవుట్ చేశాడు. అయితే రాహుల్ తెవాటియా 18వ ఓవర్‌లో 6,4,4తో 19 రన్స్ అందించడంతో జట్టు స్కోరు 150 దాటగలిగింది. కానీ ఆఖరి ఓవర్‌లో కొట్జీ.. తెవాటియా వికెట్‌తో 7 పరుగులే ఇచ్చాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (బి) బుమ్రా 19, గిల్ (సి) రోహిత్ (బి) చావ్లా 31, సుదర్శన్ (సి) తిలక్ (బి) బుమ్రా 45, ఒమర్జాయ్ (సి) తిలక్ (బి) కొట్జీ 17, మిల్లర్ (సి) హార్దిక్ (బి) బుమ్రా 12, విజయ్ శంకర్ (నాటౌట్) 6, తెవాటియా (సి) నమన్ (బి) కొట్జీ 22, రషీద్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 168/6; వికెట్ల పతనం:** 1-31, 2-64, 3-104, 4-133, 5-134, 6-161; **బౌలింగ్:** హార్దిక్ 3-0-30-0, ల్యూక్ 2-0-25-0, బుమ్రా 4-0-14-3, ములానీ 3-0-24-0, పియూష్ చావ్లా 3-0-31-1, నమన్ ధిర్ 1-0-13-0, కొట్జీ 4-0-27-2.

ముంబై: ఇషాన్ (సి) సాహా (బి) ఒమర్జాయ్ 0, రోహిత్ (ఎల్బీ) కిషోర్ 43, నమన్ (ఎల్బీ) ఒమర్జాయ్ 20, బ్రెవిస్ (సి అండ్ బి) మోహిత్ 46, తిలక్ వర్మ (సి/సబ్) మనోహర్ (బి) జాన్సన్ 25, టిమ్ డేవిడ్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 11, హార్దిక్ (సి) తెవాటియా (బి) ఉమేశ్ 11, కొట్జీ (సి అండ్ బి) జాన్సన్ 1, ములానీ (నాటౌట్)1, పియూష్ (సి) రషీద్ (బి) ఉమేశ్ 0, బుమ్రా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 162/9; వికెట్ల పతనం:** 1-0, 2-30, 3-107, 4-129, 5-142, 6-148, 7-150, 8-160, 9-160; **బౌలింగ్:** ఒమర్జాయ్ 3-0-27-2, ఉమేశ్ యాదవ్ 3-0-31-2, రషీద్ ఖాన్ 4-0-23-0, సాయి కిషోర్ 4-0-24-1, జాన్సన్ 2-0-25-2, మోహిత్ శర్మ 4-0-32-2.



ఆంధ్ర జట్టుకు నజరానా

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇటీవల జరిగిన బీసీసీఐ అండర్-19 మహిళల టీ20 చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఆంధ్ర జట్టును ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సన్మానించింది. ఆదివారం ఇక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జట్టుకు ఏసీఏ తరఫున రూ. 20 లక్షలు అందజేశారు. అలాగే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ సుమారు రూ.17 లక్షల విలువ గల ఎలక్ట్రిక్ స్కూటర్లను జట్టు సభ్యులకు బహూకరించారు. ఇక, వచ్చేనెల నుంచి జోనల్ స్థాయిలో ఆడిన క్రికెటర్లకు పౌష్టికాహారం నిమిత్తం నెలకు రూ.3 వేలు ఇవ్వనున్నామని ఏసీఏ తెలిపింది. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి, సీఈఓ శివారెడ్డి, కోచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో శ్రీకాంత్ అవుట్

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన సెమీస్ పోరులో శ్రీకాంత్ 21-15, 9-21, 18-21తో లిన్ చున్ యి (తైపీ) చేతిలో ఓడాడు. ఇక, పోలిష్ ఓపెన్ టోర్నీలో భారత జోడీ అర్జున్-ధ్రువ్ డబుల్స్ విజేతగా నిలిచింది.

ఓటమి అంచున బంగ్లాదేశ్

సిల్హట్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఓటమి అంచున నిలిచింది. 511 పరుగుల భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఈ జట్టు ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో 47/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఫెర్నాండోకు 3 వికెట్లు దక్కాయి. విజయానికి బంగ్లా 464 పరుగుల దూరంలో ఉండ డంతో నాలుగో రోజు లంక గెలవడం లాంఛనమే. అంతకుముందు లంక రెండో ఇన్నింగ్స్‌లోనూ కమిందు (164), ధనంజయ (108) శతకాలు బాదడంతో జట్టు 418 పరుగులు సాధించింది. మెహిదీ హసన్ 4 వికెట్లు తీశాడు.

శ్రీజ.. బంగారం



న్యూఢిల్లీ: తెలుగమ్మాయి శ్రీజ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ సిరీస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఓ స్వర్ణం, రజతంతో రెండు పతకాలు కొల్లగొట్టి అదరహో అనిపించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 4-1తో నూట్ సారా డి (లక్సెంబర్గ్)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. ఆ తర్వాత దియా చిటాలెతో కలిసి డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. డబుల్స్ ఫైనల్లో శ్రీజ-దియా జోడీ 1-3తో హాంకాంగ్ ద్వయం డో హో- చెంగ్జు చేతిలో ఓటమిపాలైంది. ఈ మెగా టోర్నీలో స్వర్ణం నెగ్గిన తొలి భారత టీటీ క్రీడాకారిణిగా శ్రీజ రికార్డుకెక్కింది.

ఆర్చరీలో చికితకు పసిడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పెద్దపల్లి ఆర్చర్ చికితరావు స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఆదివారం చెన్నైలో జరిగిన ఈ పోటీల కాంపౌండ్ విభాగం ఫైనల్లో చికిత 143/150 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మరో తెలుగమ్మాయి శ్రేష్ఠారెడ్డి 137 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం అందుకుంది.

'ఆస్ట్రేలియన్' కింగ్ కార్లోస్

మెల్‌బోర్న్: ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములావన్‌లో విజేతగా నిలిచాడు. ఫెరారీకే చెందిన చార్లెస్ రెండో స్థానం, మెక్‌లారెన్ డ్రైవర్ నోరిస్ మూడో స్థానం సాధించారు.

2030 నాటికి టాప్ 30లోకి
ఆకాశా ఎయిర్

న్యూఢిల్లీ: భారత్‌లో విమానయాన ధరలు "నమ్మలేనంత చౌక"గా ఉన్నాయని, ఆకాశా ఎయిర్‌కు మంచి వృద్ధి అవకాశాలు కనిపిస్తున్నాయని ఆకాశా ఎయిర్ సీఈఓ వినయ్ దూబే అన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 30 విమానయాన సంస్థల్లో ఒకటిగా నిలవాలన్నది తమ లక్ష్యమని ఆయన చెప్పారు. వచ్చే గురువారం ముంబై నుంచి దోహాకు తొలి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అవుతామని స్పష్టం చేశారు. విమానయాన రంగంలో పోటీ ఎప్పుడూ తీవ్రంగానే ఉంటుందని, ఫండమెంటల్స్‌పై దృష్టి కేంద్రీకరించినట్టయితే ఆకాశా ఎయిర్‌కే కాకుండా అన్ని విమానయాన సంస్థలకు అవకాశాలు ఉజ్వలంగానే ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2022 ఆగస్టులో విమాన సర్వీసులు ప్రారంభించిన ఆకాశా ఎయిర్ ప్రస్తుతం 24 విమానాలతో 4.5 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

మళ్లీ ఎఫ్‌పీఐల వెల్లువ

ఈ నెలలో ఇప్పటికే రూ.38,000 కోట్లు ఇన్వెస్ట్

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో సానుకూల పవనాలు వీస్తుండడంతో పాటు భారత స్థూల ఆర్థిక స్థితి పటిష్ఠంగా ఉందన్న సంకేతాల నడుమ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) దృష్టి మరోసారి భారత ఈక్విటీ మార్కెట్‌పై పడింది. మార్చి నెలలో ఎఫ్‌పీఐలు ఇప్పటివరకు రూ.38,000 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఫిబ్రవరిలో ఎఫ్‌పీఐల మార్కెట్ పెట్టుబడులు అత్యంత నిరాశావహంగా రూ.1,539 కోట్లుగా మాత్రమే ఉన్నాయి. కాగా జనవరిలో మాత్రం రూ.25,743 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

2024లో ఎఫ్‌పీఐలు ఇప్పటివరకు రూ.13,893 కోట్లు ఈక్విటీల్లోను, రూ.55,480 కోట్లు డెట్ మార్కెట్లోను ఇన్వెస్ట్ చేసినట్లు డిపాజిటరీల వద్ద ఉన్న గణాంకాలు తెలుపుతున్నాయి. ఇటీవల దేశీయ మార్కెట్లో ఏర్పడిన కరెక్షన్ వారికి మంచి పెట్టుబడి అవకాశంగా నిలిచిందని పరిశీలకులంటున్నారు. దీనికి తోడు బలమైన జీడీపీ వృద్ధి రేటు, ఆర్‌బీఐ పాలసీ రేట్ల విషయంలో వైఖరి మార్చుకోవచ్చున్న సంకేతాలు కూడా ఎఫ్‌పీఐల పెట్టుబడులు పెరగడానికి దోహదపడిన అంశాలుగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.

నేడు మార్కెట్లకు సెలవు

హోలీ సందర్భంగా సోమవారం స్టాక్ మార్కెట్లు.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మార్కెట్లు మంగళవారం తిరిగి యధావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ		విజయవాడ	400
హైదరాబాద్	395	విశాఖపట్నం	415
25వ తేదీ		వరంగల్	397
చిత్తూరు	458		
గోదావరి	400	డజను గుడ్లు రూ.72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	118	గోదావరి	116
వరంగల్	118	విజయవాడ	116
కరీంనగర్	118	గుంటూరు	117
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	117
కర్నూలు	118	చిత్తూరు	118
విశాఖపట్నం	115		



ప్రభుత్వానికి
డివిడెండ్ బొనాంజా
ఖజానాకు రూ.62,000 కోట్లు!
తుస్సుమన్న డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ)ను ఎంతగా ఆడిపోసుకుంటున్నా.. అవి పెద్దఎత్తున కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ల రూపంలో ఆదాయం సమకూరుస్తున్నాయి. ఈ నెలాఖరుతో ముగిసే 2023-24 ఆర్థిక సంవత్సరం లోనూ ఈ సంస్థలు దాదాపు రూ.62,000 కోట్లు డివిడెండ్ రూపంలో సమకూరుస్తాయని అంచనా. ఇందులో ఇప్పటికే రూ.61,000 కోట్లు ప్రభుత్వ ఖాతాకు చేరాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు రూ.50,000 కోట్లకు మించి డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం వరుసగా ఇది మూడో సంవత్సరం.

అంచనాలకు మించి..

నిజానికి ఈ ఆర్థిక సంవత్సరం సీపీఎస్ఈల నుంచి ప్రభుత్వ ఖజానాకు రూ.43,000 కోట్లు డివిడెండ్ల రూపంలో ఆదాయం లభిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రకటించారు. తరువాత దీన్ని రూ.50,000 కోట్లకు సవరించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ఈ అంచనాను కూడా మించి పోయి సీపీఎస్ఈలు కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.62,000 కోట్లు డివిడెండ్ల రూపంలో సమకూర్చనున్నాయి. 2016 నాటి మార్గదర్శకాల ప్రకారం ప్రతి సీపీఎస్ఈ తన నికర లాభంలో 30 శాతం లేదా ఆ సంస్థ ఈక్విటీలో ప్రభుత్వ వాటాపై 30 శాతం డివిడెండ్‌గా చెల్లించాలి.

లక్ష్యాన్ని చేరని డిజిన్వెస్ట్‌మెంట్

డివిడెండ్ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని మించినా.. సీపీఎస్‌యూల పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) లక్ష్యం మాత్రం లక్ష్యానికి ఆమడ దూరంలో ఉంది. వాస్తవానికి డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.51,000 కోట్లు సమీకరించాలని 2023-24 బడ్జెట్‌లో లక్ష్యంగా నిర్ణయించారు. తర్వాత దీన్ని రూ.30,000 కోట్లకు కుదించారు. అయినా ఈ నెలాఖరుకు రూ.15,000 కోట్లు కూడా సమకూరే పరిస్థితి కనిపించడం లేదు. ఐడీబీఐ బ్యాంక్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బీఈఎంఎల్, ఎన్ఎండీసీ స్టీల్ వంటి కంపెనీల అమ్మకం ముందుకు సాగకపోవడం ఇందుకు ప్రధాన కారణం.

పీఎస్‌బీల నుంచి రూ.15,000 కోట్ల డివిడెండ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. ప్రభుత్వ ఖజానాకు రూ.15,000 కోట్లకుపైగా డివిడెండ్ ఆదాయం సమకూర్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి 12 పీఎస్‌బీలు రూ.98,000 కోట్ల నికర లాభం ఆర్జించాయి. గత ఆర్థిక సంవత్సరం (2022-23) మొత్తం మీద ఆర్జించిన రూ.1.05 లక్షల కోట్లతో పోలిస్తే ఇది రూ.7,000 కోట్లు మాత్రమే తక్కువ. మార్చితో ముగిసే 2023-24 ఆర్థిక సంవత్సరం పీఎస్‌బీల లాభాలు 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని మించిపోతాయని అంచనా. దీంతో గత ఆర్థిక సంవత్సరం రూ.13,804 కోట్లు ఉన్న పీఎస్‌బీల డివిడెండ్ చెల్లింపులు ఈ ఆర్థిక సంవత్సరం రూ.15,000 కోట్లు మించుతాయని భావిస్తున్నారు.

బిజినెస్

వేదాంత లిమిటెడ్ రూ.50,000 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ పెద్దఎత్తున వ్యాపార విస్తరణకు సిద్ధమైంది. ఇందులోభాగంగా జింక్, అల్యూమినియం, ఇనుప ఖనిజం, అల్యూమినియం, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లో 600 కోట్ల డాలర్లు (సుమారు రూ.50,000 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ పెట్టుబడులతో గ్రూప్ కంపెనీల వార్షిక స్థూల లాభం 250 కోట్ల డాలర్ల మేర పెరుగుతుందని మదుపరుల సమావేశంలో తెలిపింది. వచ్చే పాతికేళ్లలో కంపెనీ మరో ఉన్నత స్థాయికి చేరుతుందని సమావేశంలో పాల్గొన్న వేదాంత లిమిటెడ్ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. ఈ విస్తరణ ప్రాజెక్టులన్నీ పూర్తయితే 2027 మార్చి నాటికి స్థూల లాభమే 750 కోట్ల డాలర్ల మేర ఉంటుందని అగర్వాల్ వెల్లడించారు.

ఐఐఎఫ్ఎల్, జేఎం ఫైనాన్షియల్‌పై
ప్రత్యేక ఆడిట్: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: నిబంధనలు తుంగలో తొక్కి ఎడాపెడా అడ్డగోలుగా రుణాలు మంజూరు చేసిన ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్, జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌పై మరిన్ని కఠిన చర్యలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ రెండు కంపెనీల పద్దులను ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని నిర్ణయించింది. ఇందుకోసం సెబీ గుర్తింపు పొందిన ఫోరెన్సిక్ ఆడిట్ సంస్థలు ఏప్రిల్ 8లోగా ప్రతిపాదనలు పంపాలని టెండర్ జారీ చేసింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ 12 నుంచే ఎంపికైన సంస్థలకు ఫోరెన్సిక్ ఆడిట్ బాధ్యతలు అప్పగించనుంది.

చిన్న నగరాల్లో ప్రీమియం కార్లకు డిమాండ్

ఫోక్స్‌వ్యాగన్ ఇండియా డైరెక్టర్ ఆశిష్ గుప్తా



జైపూర్: దేశంలోని మెట్రో నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో పెర్ఫార్మెన్స్ ఆధారంగా నడిచే ప్రీమియం కార్లకు పెరిగిన ఆదరణను సొమ్ము చేసుకోవాలని ఫోక్స్‌వేగన్ భావిస్తోంది. ఈ ఏడాది ఈ విభాగంలో అమ్మకాలు 15 శాతం పెరుగుతాయని అంచనా వేస్తోంది. గత ఏడాది కంపెనీ దేశీయ మార్కెట్లో 44,000 కార్లు విక్రయించింది. భారత మార్కెట్లో కంపెనీ విక్రయిస్తున్న కార్లలో ప్రీమియం పెర్ఫార్మెన్స్ విభాగానికి చెందిన ఎస్‌యూవీ టైగన్, సెడాన్ కారు వర్టస్ 1.5 పెట్రోల్ ఇంజన్ 'జీటీ' ట్రిమ్ కార్లున్నాయి. అయితే ఇదే జీటీ విభాగంలో అందుబాటు ధరల్లో కార్లు తీసుకురావాలన్న కస్టమర్ల కోరికను పరిగణనలోకి తీసుకుని ఈ రెండింటిలోనూ ఒక లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో 'జీటీ లైన్' వెర్షన్లు అందుబాటులోకి తెచ్చినట్లు ఫోక్స్‌వేగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. తమ మొత్తం కార్ల విక్రయాల్లో 20 నుంచి 25 శాతం జీటీ వెర్షన్లేనని గుప్తా చెప్పారు.

ఏప్రిల్ 3న భారతి హెక్సాకామ్ ఐపీఓ ప్రారంభం

న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతి హెక్సాకామ్.. పబ్లిక్ ఇష్యూ ఏప్రిల్ 3న ప్రారంభమై 5న ముగియనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్తున్న తొలి పబ్లిక్ ఇష్యూ ఇదే. ఇష్యూలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రస్తుత వాటాదారులైన టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ 15 శాతం వాటాకు సమానమైన 7.5 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఈ ఇష్యూ ద్వారా ప్రస్తుత వాటాదారు మాత్రమే తన వాటాలను విక్రయిస్తోంది. కంపెనీ ఎలాంటి నిధులు సమీకరించటం లేదు. ప్రస్తుతం కంపెనీలో భారతి ఎయిర్‌టెల్‌కు 70 శాతం వాటా ఉండగా ప్రభుత్వ రంగ సంస్థ టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియాకు 30 శాతం వాటా ఉంది.

ట్రెండ్ గైడ్
కీలక స్థాయి 22,000 వద్ద పరీక్ష


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 22,000 వద్ద ప్రారంభమై కరెక్షన్‌లో పడి 21,700 వరకు దిగజారినా రికవరీ సాధించి వారంలో 70 పాయింట్ల మేరకు లాభపడి చివరికి ఆ కీలక స్థాయి కన్నా పైనే ముగిసింది. సానుకూల సంకేతం కోసం వరుసగా రెండో వారంలో కూడా 22,000 వద్ద మరింత కన్సాలిడేషన్ సాధించడం అవసరం. అలాగే ఈ వారంలో మూడు ట్రేడింగ్ దినాలు మాత్రమే ఉన్నందు వల్ల మరింత కన్సాలిడేషన్‌కే అవకాశాలున్నాయి. నిఫ్టీ గత రెండు నెలల కాలంలో 22,000 వద్ద సైడ్‌వేస్‌లో కదలాడుతూ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. గత వారం మిడ్‌క్యాప్ 100 సూచీ 600 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 సూచీ 200 పాయింట్ల లాభంతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల తీరు ఆధారంగా ఇప్పుడు మార్కెట్ అప్రమత్త ధోరణిని కొనసాగించవచ్చు. అందువల్ల ప్రధాన మానసిక అవధి 22,000 వద్ద పరీక్ష ఎదురుకావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ రికవరీ బాట పట్టినా సానుకూలత కోసం నిరోధ స్థాయి 22,200 కన్నా పైన పటిష్ఠంగా క్లోజ్ కావాలి. స్వల్పకాలిక నిరోధం 22,550. కొద్ది రోజుల క్రితం ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి ఇది.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనపడినా రాబోయే కొద్ది రోజుల్లో ట్రెండ్‌లో సానుకూలత కోసం 22,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే ఇంకా బలహీనపడుతుంది. దిగువన మరో మద్దతు స్థాయి 21,700. ఇక్కడ కూడా విఫలమైతే మరింతగా దిగజారే ప్రమాదంలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారంలో ఈ సూచీ 45,800 వద్ద రికవరీ సాధించి చివరికి 46,860 వద్ద ముగిసింది. కాని ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 48,600 కన్నా ఇంకా దిగువనే ఉంది. రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 47,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రస్తుత మద్దతు స్థాయి 46,500 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 45,800.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక సపోర్ట్ ట్రెండ్‌లైన్ కన్నా దిగువన ఉండడం అప్రమత్త సంకేతం. 22,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే మరింత స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. 22,200 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. సానుకూలత కోసం దీన్ని బ్రేక్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం ఈ వారం స్వల్పకాలిక రివర్సల్ ఉండవచ్చు.

మంగళ వారం స్థాయిలు	
నిరోధం	22,140, 22,200
మద్దతు	22,000, 21,940

www.sundartrends.in

భారత రాజ్యాంగం రాజకీయ అంశాల అధ్యయనం

ఇండియన్ పాలిటీ ప్రిపరేషన్

గ్రూప్-1 సర్వీసుల ఎంపికకు నిర్వహించే పరీక్షల్లో ప్రిలిమ్స్ మొదటి దశ పరీక్ష. ఇది కేవలం స్క్రీనింగ్ పరీక్ష మాత్రమే. దీన్నే సాధారణంగా జీఎస్(జనరల్ స్టడీస్) పేపర్ అని కూడా అంటారు. ఇందులో విజయం సాధిస్తేనే మెయిన్స్‌కు సెలెక్ట్ అవుతారు. ఈ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్(బహుళైచ్ఛిక) తరహాలో ఉంటుంది. ఇందులో ప్రతి ప్రశ్నకు నాలుగు ఆప్షన్లు లేదా అసర్షన్ టైప్ క్వశ్చన్స్ లేదా జతపరచండి మొదలైన పద్ధతుల్లో ప్రశ్నలు అడుగుతారు.

సిలబస్ విషయానికి వస్తే...స్క్రీనింగ్ లేదా ప్రిలిమ్స్‌లో మొత్తం 13 విభాగాలున్నాయి. మొత్తం 13 విభాగాలకు కలిపి 150 ప్రశ్నలు(150 మార్కులకు) ఉంటాయి. ఇందులో పాలిటీ నుంచి 15 నుంచి 20 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. అంటే 15 నుంచి 20 మార్కులు అన్నమాట. కాబట్టి ప్రధానంగా భారత రాజ్యాంగం, ప్రభుత్వంలోని వివిధ శాఖల నిర్మాణం, వాటి పనితీరుని వర్తమాన అంశాలతో జతచేస్తూ చదువుకోవాలి. ఎందుకంటే పాలన, ప్రభుత్వంలోని వివిధ శాఖల పనితీరుపై మీ అవగాహనను అంచనా వేస్తారు. ముఖ్యంగా కింద పేర్కొన్న ఐదు అంశాలపై మీ అవగాహనను అంచనావేసే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. రాజ్యాంగ మౌలిక అంశాలు 2. రాజకీయ నిర్మాణం
3. ప్రక్రియలు 4. సుప్రీంకోర్టు తీర్పులు
5. పై నాలుగింటికి సంబంధించిన వర్తమాన అంశాలు

భారత రాజ్యాంగం - రాజకీయాలు

- రాజ్యాంగం - చారిత్రక నేపథ్యం
- రాజ్యాంగాన్ని రూపొందించడం
- ప్రవేశిక(రాజ్యాంగ తత్వం)
- ఇండియన్ యూనియన్, దాని భూభాగం
- పౌరసత్వం ● ప్రాథమిక హక్కులు
- ఆదేశిక సూత్రాలు ● ప్రాథమిక విధులు
- రాజ్యాంగ సవరణ
- యూనియన్ గవర్నమెంట్, ఎగ్జిక్యూటివ్, పార్లమెంట్
- రాష్ట్రప్రభుత్వం - రాష్ట్ర కార్యనిర్వాహక, రాష్ట్ర శాసనసభ
- కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన
- సమాఖ్య వ్యవస్థ ● అంతరాష్ట్ర సంబంధాలు
- న్యాయవ్యవస్థ ● రాజ్యాంగ సంస్థలు
- రాజ్యాంగేతర సంస్థలు ● ట్రిబ్యునల్స్
- ఎస్సీలు, ఎస్టీలు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలు, ఆంగ్లో-ఇండియన్ల కోసం ప్రత్యేక నిబంధనలు(సంక్షేమ యంత్రాంగం)
- పంచాయతీరాజ్, పట్టణ స్థానిక ప్రభుత్వాలు
- గవర్నెన్స్, పబ్లిక్ పాలసీ

నోట్: పై అంశాలతో వర్తమాన అం శాలను జతచేస్తూ చదువుకోవాలి.

సిలబస్‌ను పరీక్ష కోణంలో ఇలా అధ్యయనం చేయాలి

భారత రాజ్యాంగం, పాలనకు సంబంధించిన ప్రాథమిక అవగాహన కోసం 9 నుంచి 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలి. తెలుగు మీడియం విద్యార్థులైతే ఇంటర్ రెండో సంవత్సరం సివిక్స్, డిగ్రీ రెండో సంవత్సరం 'భారత రాజ్యాంగం-రాజకీయాలు' పుస్తకాలను చదవవచ్చు. లేదా సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో లభించే స్టాండర్డ్ బుక్స్‌ని సెలెక్ట్ చేసుకుని ప్రిపరేషన్‌ని మొదలు పెట్టాలి. అయితే కొత్త బిల్లులు, పాలసీలు, చట్టాలు, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు మొదలైన అంశాలను పొందుపరిచిన పుస్తకాలను సెలెక్ట్ చేసుకోగలిగితే... వర్తమాన అంశాలను సెపరేట్‌గా ప్రిపేర్ కావలసిన అవసరం ఉండదు. మార్కెట్‌లో అలా దొరికే అవకాశం లేనప్పుడు ప్రామాణిక వార్తా పత్రికలను క్రమం తప్పకుండా చదువుతూ నోట్స్ రాసుకోవాలి. వీటిని చదివేటప్పుడు కూడా మౌలిక సమాచారానికి వర్తమాన అంశాలను జతచేయడం విస్మరించవద్దు. ఎగ్జామినర్స్ ప్రధానంగా అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుపై జ్ఞానం ఉందా? సంబంధిత సబ్జెక్టును అవగాహన చేసుకుంటున్నారా? ఆ సబ్జెక్టును వినియోగించుకోగలుగుతున్నాడా, సంబంధిత సబ్జెక్టుపై నైపుణ్యం కలిగి ఉన్నారా? అని పరీక్షిస్తారు.

కాబట్టి, అభ్యర్థులు ముందస్తుగా విశ్లేషణాత్మక, విమర్శనాత్మక ధృక్పథంతో అర్థం చేసుకుంటూ చదవాలి. అలా చేస్తేనే ఇతరుల కంటే ఒక మార్కు ఎక్కువ తెచ్చుకుంటారు. అందుకు....



ఇలా చేయండి

మౌలిక సమాచారం ఉన్న ప్రామాణిక పుస్తకాలను చదవాలి. ఆ పుస్తకం... మీ అనుమానాలను నివృత్తి చేసే విధంగా ఉదాహరణలు, పోలికలు, భేదాలు, విమర్శల వంటి వాటితో అనుసంధానించినదై ఉండాలి.

ఇలా చేయకండి

ఇటీవల చాలా మంది అభ్యర్థులు రెడీ టూ రైట్ అనే వాక్యాన్ని విని యోగిస్తూ...సినాప్సిస్ లాగా ఉన్నవి, పాయింట్స్ వారీగా ఉన్నవి, క్వశ్చన్స్ ఆన్సర్స్ మాదిరిగా ఉన్న మెటీరియల్ చదువుతున్నారు. పరీక్షల సరళి మారింది. కాబట్టి అభ్యర్థులు తమ వైఖరిని మార్చుకోవాలి. ఇలా చదివి కఠినంగా వచ్చింది, ఔటాఫ్ సిలబస్ నుంచి వచ్చింది, ప్రశ్నలు సివిల్ సర్వీసెస్ టైప్‌లో ఇచ్చారు కాబట్టి చదవడానికి ఎక్కువ సమయం పడుతుంది అని అంటున్నారు. కాని ఇక్కడ గమనించాల్సింది ఏమంటే...రీడింగ్ హాబిట్ లేనప్పుడు పరీక్షలో ఒక ప్రశ్నకు నాలుగు ఆప్షన్స్ నుంచి సరైన సమాధానాన్ని ఎలా గుర్తించగలం? పూర్తి సబ్జెక్టుపై అవగాహన ఉంటే ప్రశ్న, ఆప్షన్స్ చదవడం తేలిక. కొత్తగా పరీక్ష హాలులోనే చదివితే మరీ లేటవుతుంది... గమనించండి!

తెలంగాణ రాష్ట్రంలో గతంలో జరిగి రద్దయిన రెండు గ్రూప్-1 పరీక్షలు, ఇటీవల ఏపీలో నిర్వహించిన పరీక్షలు, సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్‌ని పరిశీలిస్తే ప్రశ్నలన్నీ స్టేట్‌మెంట్స్ మాదిరిగా ఉంటున్నాయి. ఆప్షన్స్ కూడా పొడుగు వాక్యాల్లో ఉంటున్నాయి. నిజం చెప్పాలంటే ఆప్షన్స్ కూడా ప్రశ్నల మాదిరిగా ఉంటున్నాయి. ప్రశ్నలు ఇలా ఉంటాయి, అలా ఉంటాయి అని టీఎస్‌పీఎస్సీ ఎప్పుడూ ప్రకటించలేదు కదా?. కాబట్టి అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలోనే పూర్తి, సమగ్ర వర్తమాన అంశాలతో జోడించి చదువుకుంటే తప్ప ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించలేరు. కాబట్టి అభ్యర్థులు మెటీరియల్ సెలెక్షన్‌తోనే వ్యూహానికి పదును పెట్టాలి. విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలి, బట్టీపట్టకూడదు. ఇలా చేస్తేనే ఎలిమినేషన్, అడిషన్, డిలీషన్ ద్వారా కిందివాటిలో సరైనవి ఏవి? సరికానివి ఏవి? అనే ప్రశ్నలకు సమాధానం గుర్తించగలుగుతారు. ఆబ్జెక్టివ్ టైప్ అంటేనే మాటల గారడీ. అటుది ఇటు, ఇటుది అటు తిప్పి ఇస్తారు. కచ్చితమైన, సరైన సమాధానం తెలియాలి. సరికానిది కూడా అంతే కాన్ఫిడెంట్‌గా ఇది తప్పు అని తెలియాలి. అప్పుడు మాత్రమే కచ్చితత్వంతో కూడిన సమాధానాలు గుర్తించగలుగుతారు.

ముందే చెప్పుకొన్నట్లుగా స్క్రీనింగ్ పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో కూడుకుని ఉంటుంది. ప్రశ్నకు ఇచ్చిన నాలుగు ఆప్షన్లను చేసే సరికి కళ్లు చెదిరి, మిమ్మల్ని మానసిక గందరగోళానికి గురిచేస్తాయి. మరో... రెండు ఆప్షన్లలో ఏది సమాధానమో తెలియక తడబాటుకు గురవుతాము. ఇలా ఎందుకు జరుగుతుంది అంటే... చదివిన దానిని మనం నమ్మకపోవడం, కాన్ఫిడెంట్‌గా లేకపోవడం, గట్టిగా చదవకపోవడం. ఏదో పైపైన చదివేసరికి ఎగ్జామ్ హాల్‌కి పోయిన తరవాత ప్రశ్నపత్రాన్ని చూడగానే తడబాటుకు గురవుతాము. దీనికి కచ్చితంగా ఇదే సరైన సమాధానం అని మన మనసు నమ్మాలంటే రివిజన్ చేయడమే శరణ్యం. ఎన్నిసార్లు రివిజన్ చేస్తే అంతమంచిది. టైమ్ ఇస్తూ...ఐదో రోజులకోసారి, 10 రోజులకోసారి, 15 రోజులకోసారి చదివి విడిచి పెట్టేయ్యాలి. ఇటీవల కాలంలో అభ్యర్థుల్లో రీడింగ్ హాబిట్ తగ్గిపోవడం ప్రధాన కారణం. సినాప్సిస్ నోట్స్ చదవడం మరో కారణం.

ఆర్టికల్స్ అన్నీ చదవాలా? అన్ని సవరణలు చదవాలా? ఏ తీర్పులను చదవాలి?

ఆర్టికల్స్ అవసరం లేదు. ఆర్టికల్స్ అంటే సీరియల్ నెంబర్స్, రూల్ నెంబర్స్ లాంటివి. ఆర్టికల్ పక్కనే ఉన్న అంశానికే ప్రాధాన్యం. ఆ అంశం ప్రాధాన్యతను బట్టి నెంబర్‌కి ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఒక 100 ఆర్టికల్స్ నేర్చుకుంటే సరిపోతుంది.

ఉదా: ● 1-52 వరకు, గవర్నర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రధాన మంత్రులకు సంబంధించిన ఆర్టికల్స్

- 73, 74 రాజ్యాంగ సవరణలు
- 245 నుంచి 280 వరకు ఆర్టికల్స్
- అత్యవసర అధికారాలకు సంబంధించిన ఆర్టికల్స్
- కొన్ని ముఖ్య రాజ్యాంగ సవరణలు..1, 17, 24, 42, 44, 97 నుంచి 106 వరకు

ముఖ్య తీర్పులు: రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులు, ఏ తీర్పులు రాజ్యాంగ మౌళిక స్పశించాయో..ఆ తీర్పులను చదవాలి. ఉదాహరణకు...గోలక్‌నాథ్, కేశవానంద భారతి, బాలాజీ, ఇందిరా సహానీ, శ్రేయోసింఘాల్, మేనకాగాంధీ మొదలైనవి.

నోట్: వీటిని బట్టి ఎలిమినేషన్, అడిషన్ విధానంలో తెలిసిన అంశం నుంచి తెలియని అంశాన్ని గుర్తించగలుగుతారు.

ఇలా చదివిన తరవాత మీ అవగాహనను పరీక్షించుకోవడానికి టాపిక్ వైజ్ క్వశ్చన్స్ ఆన్సర్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. అదేవిధంగా గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా మీరు ఎక్కడ తప్పు చేస్తున్నారో, ఎక్కడ బలోపేతం కావాలో తెలుస్తుంది. తద్వారా మీరు అసలు పరీక్ష కోసం ప్లాన్ చేసుకోవచ్చు. స్క్రీనింగ్ పరీక్ష కోసం కాంప్రహెన్సివ్‌గా చదివితే మెయిన్స్‌కు చదవడం తేలిక అవుతుంది.

వీటికి సంబంధించిన రోజువారీ సంఘటనలను చదువుకుంటే సరిపోతుంది. ఇలా..ఒక ప్లాన్ ప్రకారం చదివి, రివిజన్ చేసుకుంటూ, క్వశ్చన్స్ అన్సర్స్‌ను ప్రాక్టీస్ చేస్తున్నట్లు అయితే, మీరు పాలిటీలో 100 శాతం స్కోర్ చేసి మెయిన్స్‌కు క్వాలిఫై అవుతారు.

ఇలా చదవండి..!

పాలిటీ కాని, మరేదైనా సబ్జెక్టు కాని ముందుగా మూడు రంగుల(బ్లూ, గ్రీన్, రెడ్) పెన్స్ తీసుకోండి

మొదటి రీడింగ్: ● చదవాల్సిన బుక్ లేదా మెటీరియల్‌ను సెలెక్ట్ చేసుకున్న తరవాత పాఠ్యాంశాన్ని ఆసాంతం నెమ్మదిగా అర్థం చేసుకుంటూ నవల లాగా చదువుతూ వెళ్లాలి. మీ కన్ను ఎక్కడైతే ముందుకు వెళ్లకుండా ఆగుతుందో ఆ వాక్యాన్ని బ్లూపెన్‌తో అండర్ లైన్ చేయండి.

● రెండోసారి బ్లూపెన్‌తో అండర్‌లైన్ చేసినవే చదవండి. మీ ఫ్రెండ్స్‌తో గాని, లేదా ప్రాథమిక పుస్తకాల ద్వారా గానీ సంబంధిత సమాచారాన్ని పూర్తిగా తెలుసుకొని , సొంతంగా అనుమానాలను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు మీకు కొన్ని అర్థమైనట్లుగా అనిపిస్తుంది.

రెండో రీడింగ్: ● కొన్ని అర్థమయ్యాయి కాబట్టి, మరికొన్ని మిగిలి ఉంటాయి. అలా మిగిలిన వాటిని గ్రీన్ ఇంక్ పెన్‌తో అండర్‌లైన్ చేయాలి.

మూడో రీడింగ్: ● గ్రీన్ ఇంక్‌తో అండర్ లైన్ చేసినవి మీ టీచర్‌తో డిస్కస్ చేయండి. అవి మీకు ఎందుకు అర్థం కాలేదో మీ టీచర్‌తో చెప్పండి. వాక్య నిర్మాణం వల్ల అర్థం కాలేదా, టెర్మినాలజీ వల్ల అర్థం కాలేదా సమస్యను స్పష్టంగా టీచర్‌కు చెప్పండి. అప్పుడు కూడా మీకు కొన్ని పరిష్కారం కానట్లు కనపడ్డవాటిని రెడ్ ఇంక్ పెన్‌తో అండర్‌లైన్ చేయండి. ఇలా రెడ్ ఇంక్ పెన్‌తో అండర్‌లైన్ చేసినవి ఒక నోట్ బుక్‌లో రాసుకుని వాటి మీద మళ్లీ మీ టీచర్‌తో చర్చించండి. ఏ కారణంతో మీకు అర్థం కావట్లేదో టీచర్ పసిగట్టగలుగుతారు. మీకు కచ్చితంగా వివరణ ఇస్తారు.వీటిని రెండు లేదా మూడు సార్లు చదవండి. తదనంతరం కొంచెం గ్యాప్ ఇచ్చి పూర్తి పాఠ్యాంశాలను మరొకసారి ఆసాంతం చదవండి.


డాక్టర్ సుంకర రమాదేవీ,
అసిస్టెంట్ ప్రొఫెసర్.

సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

శరణార్థుల పౌరసత్వ కల్పనకు ఉద్దేశించిన 'సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2019కి సంబంధించిన రూల్స్ కేంద్రప్రభుత్వం 2024 మార్చి 11న నోటిఫై చేసింది. అలా ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావడంతో, అందులో ఉన్న కొన్ని పరిమితులు, సడలింపుల దృష్ట్యా నిరసనలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాని పూర్వాపరాలు, చట్టంలోని అంశాలు, వస్తున్న విమర్శలు, ప్రభుత్వ వర్గాల వివరణ వంటివి పరిశీలిద్దాం.



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

తమ దేశంలోనే తాము పరాయివారు అయినప్పుడు, నిలువ నీడలేని పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ప్రజలు ఎక్కడికైనా పరుగులు పెడతారు. పరాయి దేశమైనా అక్కున చేర్చుకుంటుందేమో అని ఆశపడుతుంటారు. అలా శరణార్థులు వేల, లక్షల సంఖ్యలో సరిహద్దు దేశాలకు చేరుకోవడం సహజం. భారత్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే సరైన పత్రాలు, గుర్తింపు ధ్రువీకరణలు లేకుండా దేశంలోకి వచ్చే శరణార్థులతో అటు వారికే కాదు ఇటు దేశ భద్రతకూ ముప్పే. స్థానికుల నుంచి వారు తీవ్ర దోపిడీకి గురవడం, సామాజిక భద్రతా సౌకర్యాలను పొందలేకపోవడం, పేదరికం కారణంగా నేరాల బాట పట్టినా వారిని గుర్తించడం కష్టమవుతుంది. ఆ మాటున ఉగ్రవాదులు చొరబడటం వంటి కారణాల రీత్యా దేశంలోకి వచ్చే శరణార్థులకు చట్టబద్ధ గుర్తింపు అవసరం. తిరిగివెళ్లే అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించనప్పుడు వారికి పౌరసత్వం కల్పించి ఆదుకోవడం కూడా సముచితమే.

ఈ పౌరసత్వ సవరణ చట్టానికి నాంది 2002లోనే పడింది. పాకిస్థాన్‌లో తీవ్ర దౌర్జన్యాలకు గురవుతున్న స్థానిక హిందువులకు భారతదేశ వీసాలు పొందేందుకు సహకరించాలని, అదేసమయంలో అక్రమ ప్రవేశాలను అడ్డుకోవాలని ఒక సరిహద్దు రాష్ట్రంగా రాజస్థాన్ ప్రభుత్వం అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి విన్నవించింది.

దీని ఫలితంగా 2004లో అప్పటి ప్రధాని వాజపేయీ ప్రభుత్వం, పౌరసత్వ నిబంధనలను సవరించింది. రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంత జిల్లాల మెజిస్ట్రేట్‌లకు - లాంగ్‌టర్మ్ వీసాలు, పౌరసత్వం కల్పించే అధికారాన్ని కల్పించింది.

అదేవిధంగా 2010 జూన్‌లో అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కూడా కొన్ని వర్గాలకు చెందిన పాకిస్థానీయులకు వారి పాస్‌పోర్టు వాలిడిటీతో సంబంధం లేకుండా, లాంగ్‌టర్మ్ వీసాలను పునరుద్ధరించవచ్చని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అనుమతినిచ్చింది. దీనికి 2009 డిసెంబరు 31ని కటాఫ్ డేట్‌గా నిర్ణయించింది.

అంటే అప్పటిలోగా లాంగ్‌టర్మ్ వీసాలను పొందిన పాకిస్థానీ హిందువులు, సిక్కులు, భారతీయ వ్యక్తిని వివాహం చేసుకొని భారత్‌లో నివసిస్తున్న పాకిస్థానీ మహిళలు, పాకిస్థానీయులను వివాహం చేసుకొని విడాకులు పొందిన భారత స్త్రీలు/ వితంతువులు, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న వారికి ఈ వీసా పొడిగింపును కల్పించింది. అదేవిధంగా భారతీయ ముస్లిం తన కుటుంబాన్ని వదిలి దేశవిభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళ్లిపోయి, తదుపరి వాలిడ్ పాకిస్థాన్ పాస్‌పోర్టుతో తిరిగివచ్చి కేరళలో స్థిరపడిన సందర్భంలో కూడా లాంగ్‌టర్మ్ వీసాను అందించారు. 2014 డిసెంబరులో నరేంద్రమోడీ ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందూ, సిక్కు, క్రిస్టియన్, బుద్దిస్ట్ శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2015-16లో భారత దేశంలో ప్రవేశానికి సంబంధించిన పాస్‌పోర్ట్ రూల్స్ సవరించి పాక్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ క్రిస్టియన్ శరణార్థులకు సరైన పాస్‌పోర్ట్/ వీసా ధృవీకరణలు లేనప్పటికీ అనుమతించేవిధంగా నియమ నిబంధనలను మార్చారు.

తదుపరి 2018లో ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీచేసి ఈ వర్గాల వారు భారతీయ పౌరసత్వం పొందాలనుకుంటే వారిని లాంగ్‌టర్మ్ వీసాలకు అర్హులను చేసింది. అదేవిధంగా వారు ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

ఈ నోటిఫికేషన్ల స్థానంలో సమగ్ర విధివిధానాలను రూపొందించేందుకు కేంద్రం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించింది. తాజాగా 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలకు చెందిన శరణార్థులకు మాత్రమే అనుమతివ్వడం, ఇతర సరిహద్దు దేశాల శరణార్థులకు, ముస్లిం మతస్థులకు అనుమతి లేకపోవడం విషయమై తీవ్ర విమర్శలు చెలరేగి దేశవ్యాప్త నిరసనలు ఉధృతమయ్యాయి. అయితే 2019 డిసెంబర్ నాటికి చిన్నగా మొదలై దేశంలో కరోనా పరిస్థితులు ప్రారంభమైన సమయంలో ఈ నిరసనలూ సద్దుమణిగాయి. అయితే ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ వంటి సంస్థలు; అసోం గణపరిషత్, నేషనల్ పీపుల్స్ పార్టీ, డీఎంకే వంటి రాజకీయ పార్టీలు; జైరాం రమేష్, మహువా మొయిత్రా వంటి ప్రముఖులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో దాదాపు 200లకు పైగా పిటీషన్లు ఫైల్ అయ్యాయి.

ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

(మిగతా రేపటి దిక్సూచిలో)


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కోడింగ్ డీకోడింగ్

రీజనింగ్

పార్ట్-2

1. ఒక సంకేత భాషలో BENGALను DGPICNగా రాశారు. అయితే అదే సంకేత భాషలో REGIONను ఏవిధంగా రాస్తారు?
   ఎ) TGIKQP బి) TIKQPG సి) TKGQPI డి) GIKTPQ

సమాధానం: (ఎ)

వివరణ:

2	5	14	7	1	12		18	5	7	9	15	14
B	E	N	G	A	L	ఇదే విధంగా	R	E	G	I	O	N
+2	+2	+2	+2	+2	+2		+2	+2	+2	+2	+2	+2
D	G	P	I	C	N		T	G	I	K	Q	P
4	7	16	9	3	14		20	7	9	11	17	16

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలిస్తే +2 అని తెలుస్తున్నది.

2. ఒక సంకేత భాషలో BOUGHTను ANTFGSగా రాసిన అదే సంకేత భాషలో GOVERNను ఏవిధంగా రాస్తారు?
   ఎ) FNUDQM బి) NFUDMQ సి) FNUQMD డి) FNQDMU

సమాధానం: (ఎ)

వివరణ:

2	15	21	7	8	20		7	15	22	5	18	14
B	O	U	G	H	T	ఇదే విధంగా	G	O	V	E	R	N
-1	-1	-1	-1	-1	-1		-1	-1	-1	-1	-1	-1
A	N	T	F	G	S		F	N	U	D	Q	M
1	14	20	6	7	19		6	14	21	4	17	13

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన -1 అని తెలుస్తున్నది.

3. ఒక కోడ్‌లో DIRECTను EHSDDSగా రాస్తే ఇదే కోడ్‌లో PLAYER ఎలా రాస్తారు?
   ఎ) QKBXFQ బి) QBKQFX సి) OURMNFUL డి) QKBQFX

సమాధానం: (ఎ)

వివరణ:

4	9	18	5	3	20		16	12	1	25	5	18
D	I	R	E	C	T	ఇదే విధంగా	P	L	A	Y	E	R
+1	-1	+1	-1	+1	-1		+1	-1	+1	-1	+1	-1
E	H	S	D	D	S		Q	K	B	X	F	Q
5	8	19	4	4	19		17	11	2	24	6	17

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన +1, -1 అని తెలుస్తున్నది.

4. ఒక సంకేత భాషలో 'SPECIAL'ను 'PNDCJCO'గా రాశారు. అదే సంకేత భాషలో 'CREATOR'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) ZPCAVQU బి) ZQCAVQU సి) ZPDAUQU డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ:

19	16	5	3	9	1	12		29	18	5	1	20	15	18
S	P	E	C	I	A	L	ఇదే విధంగా	C	R	E	A	T	O	R
-3	-2	-1	0	+1	+2	+3		-3	-2	-1	0	+1	+2	+3
P	N	D	C	J	C	O		Z	P	D	A	U	Q	U
16	14	4	3	10	3	15		26	16	4	1	21	17	21

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -3, -2, -1, 0, +1, +2, +3 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

5. ఒక సంకేత భాషలో 'GREAT'ను 'HTHEY'గా రాశారు. అదే సంకేత భాషలో 'INDIA'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) JPGNE బి) JPGMF సి) JQGNF డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

7	18	5	1	20		9	14	4	9	1
G	R	E	A	T	ఇదే విధంగా	I	N	D	I	A
+1	+2	+3	+4	+5		+1	+2	+3	+4	+5
H	T	H	E	Y		J	P	G	M	F
8	20	8	5	25		10	16	7	13	6

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే +1, +2, +3, +4, +5 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

6. ఒక సంకేత భాషలో 'MERCY'ను 'NCUYD'గా రాశారు. అదే సంకేత భాషలో 'DREAM'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) EPHWR బి) EWHVR సి) EHPRW డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

13	5	18	29	25		4	18	5	27	13
M	E	R	C	Y	ఇదే విధంగా	D	R	E	A	M
+1	-2	+3	-4	+5		+1	-2	+3	-4	+5
N	C	U	Y	D		E	P	H	W	R
14	3	21	25	30		5	16	8	23	18

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలకు గమనిస్తే +1, -2, +3, -4, +5 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

7. ఒక సంకేత భాషలో 'PUBLIC'ను 'OWYPDI'గా రాశారు. అదే సంకేత భాషలో 'MASTER'ను ఏవిధంగా రాస్తారు?
   ఎ) LCPXZX బి) LPCXXZ సి) LPCXZX డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

16	21	28	12	9	3		13	1	19	20	31	18
P	U	B	L	I	C	ఇదే విధంగా	M	A	S	T	E	R
-1	+2	-3	+4	-5	+6		-1	+2	-3	+4	-5	+6
O	W	Y	P	D	I		L	C	P	X	Z	X
15	23	25	16	4	9		12	3	16	24	26	24

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -1, +2, -3, +4, -5, +6 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

నోట్: A, B, C, D, Eలకు కొన్ని సందర్భాలలో 27, 28, 29, 30, 31 ఈ విధంగా తీసుకున్నాం. Z తరవాత ఇంకా అక్షరాలు అవసరమైతే మరలా Aను 27, Bను 28గా ఇలా భావించాలి.



8. ఒక సంకేత భాషలో HONEYను SLMVBగా రాశారు. అదే సంకేత భాషలో SHARPను ఏవిధంగా రాస్తారు?
   ఎ) HSYIJ బి) HSZJK సి) HSZIK డి) ఏదీకాదు

సమాధానం: (సి)

HONEY పదంలో గల అక్షరాలకు వర్ణమాల ప్రకారం సంఖ్యలు 8, 15, 14, 5, 25 ఇవే సంఖ్యలకు అపసవ్యదిశ వర్ణమాల(రివర్స్ ఆర్డర్) ప్రకారం ఉండే అక్షరాలు SLMVB ఈవిధంగా SHARP పదంలో అక్షరాలకు వర్ణమాల ప్రకారం సంఖ్యలు 19, 8, 1, 18, 16. ఇవే సంఖ్యలకు అపసవ్యదిశ వర్ణమాల(రివర్స్ ఆర్డర్) ప్రకారం ఉండే అక్షరాలు HSZIK సమాధానం అవుతుంది.

9. ఒక సంకేత భాషలో VERBALను NCDTGXగా రాశారు. అయితే అదే సంకేత భాషలో EXPERTను ఏవిధంగా రాస్తారు?
   ఎ) VTGRZG బి) VTRGGZ సి) VSGRYG డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

22	5	18	2	1	12		14	3	4	20	7	24
V	E	R	B	A	L	-	N	C	D	T	G	X

(+2, +2, +2, +2, +2, +2)

ఇదే విధంగా

5	24	16	5	18	20		22	20	7	18	26	7
E	X	P	E	R	T	-	V	T	G	R	Z	G

(+2, +2, +2, +2, +2, +2)

గా రాస్తారు.

గమనిక: పై వివరణ పరిశీలిస్తే VERBAL అనే పదంలో చివరి అక్షరం L నుంచి మొదటి అక్షరం V వరకు(చివరి నుంచి మొదటికి +2గా కోడ్ చేశారని తెలుస్తున్నది.)


డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

మూగబోయిన మరమగ్గాలు

15వేల మంది కార్మికుల పరిస్థితి అగమ్యగోచరం


సిరిసిల్లలో నిలిచిన మరమగ్గాలు

» **ప్రైవేటు ఆర్డర్లపై దృష్టి పెట్టాలని చేనేత జౌళి శాఖ డైరెక్టర్ సూచన**

సిరిసిల్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ చీరల తయారీతో ఉపాధి పొందిన సిరిసిల్ల నేతన్నల పరిస్థితి ప్రస్తుతం పనులు లేక అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆర్డర్లతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ముందుకు సాగింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మెరుగైన ఆర్డర్లు వస్తాయని భావించినా బతుకమ్మ చీరలు ఇతర ఆర్డర్లు వచ్చే పరిస్థితులు లేవని తేలిపోయింది. దీంతో సిరిసిల్లలో 20 వేల మరమగ్గాలు మూతపడ్డాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ పరిస్థితుల్లోనే ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 12న తడుక శ్రీనివాస్ అనే కార్మికుడు బలవన్మరణం చెందాడు. పరిశ్రమ ఇలాగే మూతపడితే పాత పరిస్థితులు పునరావృతమవుతాయని నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. రాజన్న సిరిసిల్లలో రాష్ట్రంలోనే అత్యధిక మరమగ్గాలు ఉన్నాయి. సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలపై ప్రభుత్వ ఆర్డర్లు, ఇతర కాటన్ ఉత్పత్తులు జరిగేవి. 2017 నుంచి సిరిసిల్ల పరిశ్రమకు ఆర్డర్లను ఇస్తూ ప్రభుత్వం నేతన్నల ఉపాధి కల్పనకు దోహదపడింది. దాదాపు ఏటా రూ. 400 కోట్లకు పైగా ఆర్డర్లు వచ్చేవి. ప్రభుత్వం నుంచి చెల్లింపులు కొంత ఆలస్యమైనా కార్మికులకు ఉపాధి దొరికింది. రూ. 225 కోట్లతో మొదలైన ఆర్డర్లు 2023లో రూ.350 కోట్లకు పెరిగాయి. గతేడాది ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరలతోపాటు సర్వశిక్ష అభియాన్, సంక్షేమ శాఖలకు సంబంధించిన వస్త్రాల ఉత్పత్తి బకాయిలు రూ. 270 కోట్లకు పైగా రావాల్సి ఉంది. దీంతోపాటు బతుకమ్మ చీరలపైనా కార్మికులకు యారన్ సబ్సిడీ రూపంలో ఒక మీటరుకు రూ.1.25చొప్పున వారికి అందజేస్తున్నారు. 2022, 2023కు సంబంధించిన యారన్ సబ్సిడీ రావాల్సి ఉంది. వస్త్రోత్పత్తి దారులు, కార్మికులు, బకాయిలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా ఎన్నికల కోడ్ రావడంతో ఇప్పట్లో బకాయిల విడుదల లేనట్టేనని భావిస్తున్నారు.

సంక్షోభానికి కారకులెవరు?

గతంలో సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు, ఆకలి చావులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనే కుదిపేశాయి. సిరిసిల్లలో మూడంచెల వ్యవస్థ కొనసాగేది. మహారాష్ట్ర, గుజరాత్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారులు వస్త్రాలను కొనుగోలు చేసే దిశగా నూలు తెచ్చి సిరిసిల్లలోని మాస్టర్ వీవర్‌లు నూలును భీములుగా మార్చి మరమగ్గాల ఆసాములకు అందించే వారు. ఉత్పత్తుల్లో మార్పులు లేకపోవడం, తరచూ నూలు, రసాయనాల ధరలు పెరగడం వంటి కారణాలతో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొనేది. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నిరంతరం పని ఉండే విధంగా ప్రభుత్వ ఆర్డర్లను అందించింది. కొంత మేరకు నేతన్నలకు పని సమస్య తీరింది. వేతనం ఆశాజనకంగా కనిపించింది. మరోవైపు పరిశ్రమ పూర్తిగా ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడే పరిస్థితి నెలకొనడంతో ఇతర ఆర్డర్లు ఉత్పత్తి చేసే అవకాశం లేకుండా పోయింది. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఇప్పటి వరకు బతుకమ్మ చీరల ఆర్డర్ల ఊసే ఎత్తడం లేదు. మరోవైపు ప్రైవేటు ఆర్డర్లు చూసుకోవాలని చేనేత జౌళి శాఖ డైరెక్టర్ వెల్లడించారు. దీంతో ప్రభుత్వ ఆర్డర్లపై సందిగ్ధం నెలకొంది. చివరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు కూడా రాక కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మోదీ పాలనతో ఒరిగిందేమీ లేదు

» **కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం: సీతక్క**



భైంసా రూరల్, మార్చి 24: మోదీ పాలనతో దేశానికి ఒరిగిందేమీ లేదని, దేవుళ్ల పేర్లతో బీజేపీ ఓట్ల రాజకీయం చేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలోని ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవుళ్లు, మతాల పేరుతో బీజేపీ ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. పదేళ్ల క్రితం బీజేపీ అధికారంలోకి రాగానే నల్లధనాన్ని వెలికి తీసి ప్రతీ పేదోడి ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారు. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీలను అమలు చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరు లక్షల కోట్ల అప్పు చేశారని ధ్వజమెత్తారు. అన్నింటిని సరిదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని ఆమె పేర్కొన్నారు.

బీజేపీతో బీఆర్‌ఎస్ చీకటి ఒప్పందం

» **అందుకే డమ్మీ అభ్యర్థులను నిలిపింది: మల్లు రవి**

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో చీకటి ఒప్పందంలో భాగంగానే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజలు ముందే అర్థం చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో 16 స్థానాల్లో కాంగ్రెస్సే గెలవబోతుందని ధీమా వ్యక్తం చేస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటు గాంధీభవన్‌లో మల్లు రవి సమక్షంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు దేవని సతీశ్ మాదిగ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు నచ్చక తాను కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీంకోర్టు వరకు వచ్చిందంటేనే అది కాంగ్రెస్ వల్లేనన్నారు. అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు బీజేపీలోకి వెళ్లిన ఈటల రాజేందర్.. కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్న సంగతి ఆయనకు తెలుసని, కానీ మల్కాజిగిరిలో గెలవడం కోసం చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఓ ప్రకటనలో మండిపడ్డారు. మరోవైపు, టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను ఆయన నివాసంలో మంత్రి, ప్రచార కమిటీ సహ ఛైర్మన్ అయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి కలిసి సమావేశమయ్యారు. ఎన్నికల్లో పార్టీ ప్రచార కార్యక్రమాలకు సంబంధించి అభిప్రాయాలు పంచుకున్నారు.

రాజకీయ నేతల కోసం కాదు.. రైతుల కోసం గేట్లు తెరవండి: హరీశ్‌రావు

దేవరుప్పుల, మార్చి 24: రాష్ట్రంలోని ముఖ్యమంత్రి, మంత్రులు రాజకీయ నాయకుల కోసం కాకుండా.. రైతుల కోసం గేట్లు తెరవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఆయన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబావి తండాలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో నీళ్లు రాక బోర్లకు నీరు అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు హరీశ్‌రావుతో ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలను చూపించి కన్నీటి పర్యంతమయ్యారు. ఎన్ని బోర్లు వేసినా ఫలితం లేకుండాపోతోందని, ఈ పరిస్థితుల్లో తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌లో రాజకీయాలు మాని గ్రామాల్లోకి వచ్చి రైతులకు ఆత్మవిశ్వాసం కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ ఎమ్మెల్యేల ఇంటికి వెళ్లి మరీ కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. రైతులు చచ్చిపోతుంటే మాత్రం పరామర్శించడానికి వెళ్లడంలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఇప్పటివరకు 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో కాలువల్లో పుష్కలంగా నీళ్లు పారాయని, రైతులు రెండు పంటలు పండించుకుని సంతోషంగా ఉండేవారన్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, వడగండ్ల వానతో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ హామీ ప్రకారం వడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు రైతులను ఆదుకోవాలన్న సోయిలేదు

» **మాజీ మంత్రి జి. జగదీశ్‌రెడ్డి**

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సాగు నీరందక వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలన్న సోయి కూడా కాంగ్రెస్‌కు లేదని మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆయన ఆరోపించారు. ఆదివారం తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రులు పాలనను గాలికి వదిలేశారని అన్నారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పరిస్థితి ఘోరంగా ఉందని, గతంలో కేఆర్‌ఎంబీ అడ్డుచెప్పినా తాము పొలాలకు నీళ్లిచ్చామని, రైతు కష్టాలపై మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఏమాత్రం దృష్టి పెట్టలేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

గేట్లన్నీ ఓపెన్

(మొదటిపేజీ తరువాయి)


అందెశ్రీ దంపతులను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

భావిస్తున్నారు. రాహుల్ కరిష్మాకు తోడు.. ఆయన నిర్వహించిన భారత్ జోడో న్యాయయాత్రలతో రాష్ట్రంలోని మైనారిటీలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, నేతల వలస, లిక్కర్ కేసులో కవిత అరెస్టు తదితర పరిణామాలతో ఇప్పటికే డీలాపడిన బీఆర్‌ఎస్‌ను.. మరింతగా కట్టడి చేసి, లోక్‌సభ ఎన్నికల్లో కనీస పోటీ ఇవ్వలేని పరిస్థితికి తీసుకొస్తే మైనారిటీల ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కే మళ్లుతాయని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఇందులో భాగంగానే చేరికలకు ఆయన సై అన్నట్టు సమాచారం. మైనారిటీలతోపాటు.. రాష్ట్రంలో అత్యంత ప్రభావిత వర్గమైన బీసీలనూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి పటిష్ఠ ఓటుబ్యాంకుగా మలుచుకునేందుకూ కార్యాచరణ చేపట్టాలని రేవంత్ నిర్ణయించారు. ఈ క్రమంలోనే.. రాష్ట్రంలో వివిధ కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం 17 కార్పొరేషన్లలో అత్యధికం బీసీ కులాలకు చెందివేనన్న విషయాన్ని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల్లోనూ అత్యధిక లబ్ధిదారులు బీసీ వర్గాలవారేననే అంశాన్ని బలంగా ప్రచారం చేయాలనే నిర్ణయానికి ఆయన వచ్చారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ఏఐసీసీ ప్రకటించిన ఐదు గ్యారెంటీలూ (పాంచ్‌న్యాయ్) అత్యధికంగా బీసీ వర్గాలకు న్యాయం చేసేవేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వీటన్నింటి గురించి మూడంచెల సమన్వయ కమిటీల ద్వారా ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని సీఎం భావిస్తున్నారు. ఈమేరకు.. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల ముఖ్య నేతలతో ఆదివారం సమావేశమైన ఆయన.. మైనారిటీలు, బీసీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ఎలా అండగా ఉంటోందీ, ఉండబోతోందనే విషయాలను సమన్వయ కమిటీల వ్యవస్థ ద్వారా ఆ వర్గాలకు చేర్చాలని దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు, ముఖ్యనేతలంతా కలిసి కట్టుగా పనిచేసి.. జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలతో పాటు ఎమ్మెల్సీ స్థానాన్నీ గెలిపించుకోవాలని సూచించారు.

సీఎంను కలిసిన కళాకారులు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు చెందిన పలువురు కళాకారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జయ జయహే తెలంగాణ గీత రచయిత అందెశ్రీ దంపతులు ఆదివారం ముఖ్యమంత్రిని కలిసి, మాట్లాడారు. అనంతరం రేవంత్‌రెడ్డి దంపతులు వారిని సన్మానించారు. ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రేవంత్‌ను కలిసి.. ఆయన రాసిన 'శ్రమకావ్యం' పుస్తకాన్ని బహూకరించారు. ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు గ్రహీతలైన అందె భాస్కర్ (డప్పు వాయిద్యం), పేరణి రాజ్‌కుమార్ నాయక్ (పేరిణి నృత్యం) రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా కళలకు సంబంధించిన పలు అంశాలపై వారితో సీఎం కాసేపు ముచ్చటించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి, అభినందించారు.

సహజ రంగులతో సంతోషంగా హోలీ జరుపుకోండి

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి హోలీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయత, సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే ఈ పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సహజ సిద్ధమైన రంగులతో, సంప్రదాయ పద్ధతులతో సంతోషంగా హోలీ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి ఫలాలు అందరి కుటుంబాల్లో సప్త వర్ణ రంగుల శోభను నింపుతాయని అభిప్రాయపడ్డారు.

అందరి జీవితాల్లో రంగులు నింపాలి

పండగలు మన సంస్కృతికి ప్రతీకలని, పర్యావరణంతో మమేమకమై జీవించాల్సిన బాధ్యతను గుర్తుచేసే హోలీ పండుగ అందరి జీవితాల్లో రంగులు నింపాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవాలని కోరారు. ఆనందోత్సాహాల మధ్య రంగులతో జరుపుకొనే ప్రకృతి పండుగ హోలీ అని.. ఈ పండుగను రాష్ట్ర ప్రజలు వేడుకగా జరుపుకోవాలని మాజీ సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. నిత్య జీవనంలోని కష్టాలను కాసేపు మరిచి, వయోభేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఈ పండుగ జరుపుకోవాలన్నారు.

రుణమాఫీపై చెప్పిందొకటి..

చేస్తున్నదొకటి

» **రైతులకు బ్యాంకు నోటీసులపై స్పందించరేం?: కేటీఆర్**

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే రైతుల రుణమాఫీ చేసేస్తామని ప్రకటించి.. ఇప్పుడు రైతులకు బ్యాంకర్లు నోటీసులు ఇస్తుంటే ఎందుకు స్పందించడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. అధికారం కోసం ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందొకటి.. ఇప్పుడు చేస్తున్నది మరొకటని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ట్వీట్ చేశారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా.. పంట రుణాలపై కాంగ్రెస్ సర్కారు ఎటూ తేల్చకపోవడంతో రైతన్నలకు బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు పంపిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బ్యాంకుల్లో రుణాలున్న రైతులెవ్వరూ రూపాయి కూడా కట్టొద్దని రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు.

ఆ యూట్యూబ్ చానళ్లపై

క్రిమినల్ కేసులు

» **అసత్య ప్రచారాలను నమ్మొద్దు: కేటీఆర్**

తమపై అసత్య ప్రచారాలు చేస్తున్న పలు యూట్యూబ్ చానళ్లపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగతంగా తనను, బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఇలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి యూట్యూబ్ చానళ్లపై పరువునష్టం దావాతోపాటు క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. ఇటువంటి అసత్య ప్రచారాలను తెలంగాణ ప్రజలు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. ఇక అధికార పార్టీ ఇచ్చే డబ్బులకు ఆశపడి కొందరు చట్ట విరుద్ధమైన వీడియోలను, ఫేక్ న్యూస్‌లను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తమపై అవాస్తవాలను ప్రసారం చేసిన, ప్రచురించిన మీడియా సంస్థలపై కూడా న్యాయపరమైన చర్యలు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థులతో

సునీల్ బన్సల్ భేటీ

» **ప్రచారం విస్తృతం చేయాలని సూచన**

» **టికెట్ రాలేదని ఎంపీ సోయం బాపురావు కినుక**

» **పదాధికారుల సమావేశానికి దూరం**

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులతో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన అభ్యర్థులతో ఆదివారం ఉదయం విడివిడిగా భేటీ అయ్యారు. ప్రచార సరళిని తెలుసుకున్నారు. ప్రచారం మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. మొత్తం 15 ఎంపీ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు రాష్ట్ర పదాధికారులు, ముఖ్యనేతల సమావేశానికి హాజరుకాలేదు. ఎన్నికల్లో ఆయనకు పార్టీ నాయకత్వం టిక్కెట్టు నిరాకరించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తాను పోటీలో ఉంటానని సోయం బాపురావు ప్రకటించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. రాష్ట్ర పార్టీ ముఖ్యులు ఆయన్ను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకత్వం వైఖరి ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ గ్యారెంటీలు రావు

» **రాహుల్ ఈ జన్మలో ప్రధాని కాలేరు**

» **రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి డబుల్ డిజిట్ స్థానాలు : కిషన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే రాష్ట్రంలో 6 గ్యారెంటీలు అమలవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని.. ఆయన ప్రధాని అయ్యే అవకాశమే లేనందున కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలను అమలు చేయబోదని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. రాహుల్ ఈ జన్మలో ప్రధాని కాలేరని అన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ పదాధికారుల సమావేశం కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన కార్యాచరణపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎంత తప్పుడు ప్రచారం చేసినా, డబ్బులు వెదజల్లినా రాష్ట్రంలో ఎంపీ ఎన్నికల్లో బీజేపీ డబుల్ డిజిట్ స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ప్రకటించారు. ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. రాష్ట్రంలో 12 నుంచి 15 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ ప్రధాని అభ్యర్థి కూడా కాదని అన్నారు. కాగా, ఎన్నికల్లో ప్రతీ పోలింగ్ బూత్‌లో కనీసం 370 ఓట్లు సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని, వచ్చే నెల 6న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో టిఫిన్ బైఠక్‌లు నిర్వహించాలని పదాధికారుల సమావేశం నిర్ణయించింది. ఈ నెల 29లోగా అన్ని పార్లమెంటు సెగ్మెంట్లలో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీల సమావేశాలు, 30వ తేదీ నుంచి 1 వరకు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీల సమావేశాలు నిర్వహించనున్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు సునీల్ బన్సల్, బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు సమావేశంలో పాల్గొన్నారు.

6న టిఫిన్ బైఠక్‌లు : ఏలేటి

పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 6న టిఫిన్ బైఠక్‌లు నిర్వహించనున్నట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ బూత్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా సమావేశమవుతారని చెప్పారు. పదాధికారుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, యువత, కొత్త ఓటర్లతో ప్రత్యేక భేటీలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. బూత్‌లో సగం ఓట్లు బీజేపీకి పడేలా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.

వరంగల్ బరిలో ఆరూరి

ఖమ్మం నుంచి వినోద్‌రావు

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, వరంగల్ పార్లమెంటు స్థానాలకు బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. ఆ పార్టీ ఆదివారం రాత్రి విడుదల చేసిన ఐదో జాబితాలో తెలంగాణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రెండు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఖమ్మం నుంచి బీజేపీ అభ్యర్థిగా రియల్ ఎస్టేట్ వ్యాపారి తాండ్ర వినోద్‌రావు బరిలోకి దిగనున్నారు. ఆరెస్సెస్ సిఫారసులకు అనుగుణంగా ఆయన అభ్యర్థిత్వం ఖరారైనట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ టికెట్ ఆశించి బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావుకు నిరాశే మిగిలింది. నాలుగో జాబితాలోనే ఆయన పేరు ఉంటుందన్న ప్రచారం జరిగింది. అయితే దానిలో పేరు లేకపోవడంతో ఐదో జాబితాలో ఉంటుందని ఆయన ఆశించారు. బీజేపీలో అంతర్గతంగా జరిగిన ప్రచారానికి అనుగుణంగా వినోద్‌రావును పార్టీ ఖరారు చేసింది. మరోవైపు, ఊహించినట్లే వరంగల్ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌కు ఇచ్చింది. వరంగల్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ఇటీవల బీజేపీలో చేరారు. బీజేపీ తాజా జాబితాతో రాష్ట్రంలోని మొత్తం 17 పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది.

బీఆర్‌ఎస్.. మళ్లీ టీఆర్‌ఎస్‌గా మార్పు?

» **పేరు మార్చాల్సిందేనంటున్న పార్టీ శ్రేణులు!**

» **బీఆర్‌ఎస్‌గా మార్చడంపై తీవ్ర అసంతృప్తి**

» **అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అదే కారణమని ఆగ్రహం**

» **పాత పేరు కోసం న్యాయ సలహాలపై అధిష్ఠానం దృష్టి**



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పేరు మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్)గా మారుతుందా? ఈ దిశగా బీఆర్‌ఎస్ అధినాయకత్వం కసరత్తు చేస్తోందా? అంటే అవుననే అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్‌గా పేరు మార్చాక తెలంగాణలో అధికారం కోల్పోవడం, రాష్ట్రంలో రోజురోజుకూ పార్టీ గ్రాఫ్ తగ్గుతున్న నేపథ్యంలో పేరు మార్పుపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. "ఉద్యమ పార్టీగా ప్రారంభమైన టీఆర్‌ఎస్‌ను.. బీఆర్‌ఎస్‌గా మార్చాలని ఎవరు చెప్పారు? తెలంగాణ ఆత్మగా చెప్పుకొనే పార్టీ పేరును ఎవరినీ అడగకుండా ఎలా మార్చారు? పేరు మార్చడం వల్లే కొంతకాలంగా పార్టీ గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయానికి కారణం కూడా అదే" అంటూ ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించే సమావేశాల్లో కింది స్థాయి కార్యకర్తల నుంచి ఓ మోస్తరు నాయకుల వరకు అధిష్ఠానాన్ని నిలదీస్తూ వస్తున్నారు. దీంతో జనానికి పార్టీ దూరం కావడానికి ఇదే ప్రధాన కారణమని భావించిన అధిష్ఠానం.. పేరు మార్చే శరణ్యమని భావిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలో ప్రత్యేక గుర్తింపును, అధికారాన్ని తెచ్చిపెట్టిన టీఆర్‌ఎస్ పేరునే జనంలోకి తీసుకువెళ్లేలా.. బీఆర్‌ఎస్‌ను టీఆర్‌ఎస్‌గా మార్చేందుకు అనువైన అంశాలపై ఆ పార్టీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకుగాను చట్టపరంగా ఏం చేయాలన్న దానిపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు తెలిసింది. అంతర్గతంగా జరుగుతున్న ఈ ప్రయత్నం వాస్తవమేనని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు చెబుతున్నారు. బీఆర్‌ఎస్‌ను టీఆర్‌ఎస్‌గా మార్పు చేయడమా? లేదంటే.. ఇతర రాష్ట్రాల్లో కొనసాగించేలా జాతీయ రాజకీయాల కోసం బీఆర్‌ఎస్‌ను, తెలంగాణలో మాత్రమే కొనసాగించేందుకు టీఆర్‌ఎస్ పేరును మళ్లీ పొంది.. రెండు పార్టీలను నిర్వహించాలా? అన్నదానిపై కూడా చర్చ జరుగుతు న్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి విధివిధానాలు, చట్టపరంగా ఎటువంటి ప్రయత్నాలు చేయాలన్న దానిపై దృష్టి సారించినట్లు సమాచారం. అయితే బీఆర్‌ఎస్‌ను టీఆర్‌ఎస్‌గా మార్చడం వల్ల తెలంగాణలో తిరిగి తమ మార్క్ సెంటిమెంట్ రాబట్టగలుగుతామని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

కేజ్రీవాల్ టార్గెట్‌గా కవిత విచారణ!

(మొదటిపేజీ తరువాయి)



సభ్యులతో కలిసి దళారుల ద్వారా చేసిన ముడుపుల చెల్లింపులపై కీలక సమాచారాన్ని ఆమె ముందు ఉంచి ప్రశ్నించినట్లు తెలిసింది. వివిధ మార్గాల ద్వారా పంపిన ముడుపులను ఎన్నికల్లో ఆప్ వినియోగించిన తీరు, అందులో కవిత పాత్రపై ఆరా తీసినట్లు సమాచారం. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో ఇండో స్పిరిట్‌కు అత్యధిక లాభాలు వచ్చేలా చూడడంతో పాటు, హోల్‌సేల్ వ్యాపారి లాభాల మార్జిన్‌ను 12 శాతానికి పెంచి, అందులో కొంత ముడుపులుగా స్వీకరించేందుకు వీలుగా కవిత పోషించిన పాత్రపై ఇతరులు ఇచ్చిన వాంగ్మూలాలను మరోసారి ఆమె ముందు పెట్టి విచారించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సౌత్ గ్రూప్ ఆర్థిక లావాదేవీలలో కవిత ఆడపడుచు కుమారుడు మేక శరణ్ పోషించిన పాత్రపై ఈడీ అధికారులు మరింత లోతుగా ప్రశ్నించినట్లు తెలిసింది. కవిత నివాసంలో ఆమెను అరెస్టు చేసిన సమయంలో స్వాధీనం చేసుకున్న మేక శరణ్ ఫోన్‌లో గుర్తించిన సౌత్ గ్రూప్ లావాదేవీల సమాచారంపై ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శరణ్ వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలపై వారు పదే పదే ప్రశ్నించినట్లు సమాచారం. కవిత వైపు నుంచే కాకుండా.. లిక్కర్ వ్యాపారి సమీర్ మహేంద్రు వైపు నుంచి కూడా మేక శరణ్ పాత్రపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సమీర్ మహేంద్రును తమ ముందు విచారణకు హాజరు కావాలని ఇప్పటికే ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే శరణ్ పాత్రపై సమీర్‌ను ఒక్కడినే విచారిస్తారా? లేక ఇప్పటికే ఈ కేసులో అప్రూవర్లుగా మారిన సౌత్ గ్రూప్‌లోని కవిత మాజీ సీఏ బుచ్చిబాబు, మాగుంట రాఘవ్, మాగుంట శ్రీనివాసులుతో కలిపి విచారిస్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది.

నిజామాబాద్‌కు ఈడీ బృందాలు?

నిజామాబాద్‌లో కవిత వ్యవహారాలపై దర్యాప్తు చేసేందుకు ఈడీ బృందాలు అక్కడికి వెళ్లినట్లు తెలిసింది. మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన అక్రమార్జనను కవిత నిజామాబాద్‌లో వివిధ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టినట్లు ఈడీ విశ్వసిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకే నిజామాబాద్‌లో కవిత వ్యవహారాలకు సంబంధించి ఆమె అనుచరులను విచారించడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. శనివారం కవిత కస్టడీ పొడగింపు కోసం రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలపైనా ఈడీ ఆరా తీసినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ అంశాలపై కవితను పలుమార్లు ప్రశ్నించిన అధికారులు.. ఆమె నుంచి ఎలాంటి సమాచారాన్ని రాబట్టలేకపోయామని కోర్టుకు తెలిపిన విషయం విదితమే. కాగా, కవితను ఆదివారం ఆమె కుటుంబసభ్యులు కలిశారు. ఆమె ఇద్దరు కుమారులు, భర్త అనిల్, ఆమె తరఫు న్యాయవాది ఆదివారం సాయంత్రం ఈడీ కార్యాలయంలో కవితను కలిశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

దరఖాస్తుకు ఏప్రిల్ 12వరకు గడువు... ఏప్రిల్ 28న పరీక్ష

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లకు టీఎస్ఆర్‌డీసీ సెట్-2024ను ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్టు ఆయా విద్యాసంస్థలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 12వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ఏప్రిల్ 21 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. దరఖాస్తు సహా ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు పూర్తి ఉచితంగా విద్య, భోజన వసతితోపాటు యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్ సహా పలు సదుపాయాలను కల్పించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం బీసీ గురుకులం పరిధిలో 15 బాలుర, 15 మహిళా డిగ్రీ కళాశాలలు, ఎస్సీ గురుకులంలో 26 మహిళా కాలేజీలు, ఎస్టీ గురుకులంలో 6 బాలుర, 15 మహిళా కళాశాలలున్నాయి. ఈ కాలేజీల్లో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీహెచ్ఎంసీటీ, బీఎఫ్‌టీ సహా వివిధ కోర్సులు అందుబాటులో ఉండగా.. ప్రతి కోర్సులో 40 సీట్లున్నాయి.

జెన్‌కోలో ఏఈ, కెమిస్ట్ పరీక్షపై కోడ్ ఎఫెక్ట్

- ఎన్నికల సంఘం నుంచి స్పష్టత వచ్చాకే పరీక్ష

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్స్ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ సివిల్), కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై ఎన్నికల కోడ్ ప్రభావం పడేలా కనిపిస్తోంది. ఈ నెల 31న వీటికి సంబంధించి కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించాలని ఇంతకు ముందు నిర్ణయించారు. ఈ నెల 23 నుంచి పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్ల అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. అయితే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహించాలా? లేదా అనే అంశంపై స్పష్టత కోసం ఎన్నికల సంఘానికి జెన్‌కో లేఖ రాసింది. ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చిన తర్వాత పరీక్షపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

అసదుద్దీన్ కారుపై 10వేల పెండింగ్ చలానాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వాహనంపై రూ.వెయ్యి చలానా పెండింగ్‌లో ఉన్నా.. ట్రాఫిక్ పోలీసులు సిగ్నళ్ల వద్ద ఆపి మరీ, క్లియర్ చేసేదాకా వదిలి పెట్టరు. కానీ, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వాడుతున్న కారు(టీఎస్11ఈవీ-9922)పై రూ.10,485 చలానా పెండింగ్‌లో ఉన్నా.. పట్టించుకోవడం లేదని ఆదివారం సోషల్‌మీడియాలో నెటిజన్లు మండిపడ్డారు. ఈ చలానాల్లో సింహభాగం ఓఆర్ఆర్‌పై ఓవర్‌స్పీడ్‌కు సంబంధించినవే ఉండడం గమనార్హం..!

శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తక ఆవిష్కరణ

తిరుపతి (కల్చరల్)/తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రాలను 202 మంది చిత్రకారులు వేయగా.. దీన్ని శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పేరుతో తిరుపతికి చెందిన శ్రీకళాక్షేత్ర ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓ పుస్తకంగా రూపొందించింది. ఈ పుస్తకాన్ని ఆదివారం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలలో ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గీసిన బొమ్మ కూడా ఈ పుస్తకంలో ఉండటం ఆ దేవదేవుడి కృపే అన్నారు. కాగా.. బ్రహ్మానందం ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

మత్తు మాటున అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

కారణంగానే మత్తు వ్యవహారం మొత్తం బయటకు రావడం గమనార్హం. కాగా, బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వివరాలు వెల్లడించారు. జగిత్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థినిపై కన్నేసిన స్థానిక యువకుడు.. తొలుత ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంటపడ్డాడు. ఎలాగైనా లొంగదీసుకోవాలని మాయ మాటలు చెప్పాడు. ఈ క్రమంలో గంజాయి చాక్లెట్లు అలవాటు చేశాడు. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించాడు. కొన్ని రోజుల తర్వాత బాలికను పట్టణ శివారులో ఉన్న గ్రామంలోని స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇదే అదునుగా అతడి స్నేహితులు ఇద్దరు కూడా బాలికతో అసభ్యంగా ప్రవర్తించి అఘాయిత్యం చేశారు. కాగా, బాలిక తండ్రి ఫిర్యాదుతో జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. వారిపై పోక్సోతో పాటు నార్కొటిక్ చట్టం కింద కేసు పెట్టారు. నిందితులు ముగ్గురూ జగిత్యాలకు చెందినవారే. వీరిలో ఇద్దరు బాలురు ఉన్నట్లు సమాచారం. కాగా, బాధిత బాలికను ఇప్పటికే అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఓ ముఠా కారణంగా మరో 10 మంది కూడా గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. జగిత్యాల సమీపంలోని గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ఈ ముఠాలో సభ్యులుగా ఉంటూ మత్తు దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బాధిత బాలిక తల్లిదండ్రుల్లో కొందరు ఇప్పటికే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సైతం లోతుగా దర్యాప్తు సాగిస్తోంది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

తిరుపతిలో ఆరణి శ్రీనివాసులే

- 11 స్థానాలకు జనసేన అభ్యర్థుల ప్రకటన

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 21 స్థానాలకు గాను మరో 11 సీట్లకు జనసేన తన అభ్యర్థులను ప్రకటించింది. స్థానిక నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా.. తిరుపతిలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వాన్నే చివరకు ఖరారుచేసింది. పిఠాపురం నుంచి అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీచేస్తారని ఆదివారం అధికారికంగా వెల్లడించింది. దీంతో 18 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

18 మంది అభ్యర్థులు వీరే..

పవన్ కల్యాణ్ (పిఠాపురం), లోకం మాధవి(నెల్లిమర్ల), కొణతాల రామకృష్ణ(అనకాపల్లి), పంతం నానాజీ (కాకినాడ రూరల్), బత్తుల బలరామకృష్ణ (రాజానగరం), నాదెండ్ల మనోహర్(తెనాలి), కందుల దుర్గేశ్ (నిడదవోలు), పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయ్‌కుమార్ (యలమంచిలి), గిడ్డి సత్యనారాయణ (పి.గన్నవరం), దేవ వరప్రసాద్ (రాజోలు), బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), పులపర్తి రామాంజనేయులు (భీమవరం), బొమ్మిడి నాయకర్ (నరసాపురం), పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు), చిర్రి బాలరాజు (పోలవరం), ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), యనమల భాస్కరరావు (రైల్వేకోడూరు)

కళ్లకు గంతలతో ఈసీ!

- ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వెల్లడి

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 24: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వందల కోట్లు ఖర్చు చేస్తున్నా ఎన్నికల కమిషన్ కళ్లకు గంతలు కట్టుకున్నట్టు వ్యవహరిస్తోందని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. 'సార్వత్రిక ఎన్నికలు-మీడియా పాత్ర' అనే అంశంపై ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవస్థలను నిలబెట్టేది మీడియానేనన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం పెరిగిందని, ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు రూ.10,702 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఐటీ, ఈడీ, సీబీఐ దాడులతో కేంద్రంలోని బీజేపీకి వేలకోట్ల విరాళాలు వస్తున్నాయని తెలిపారు. సోషల్ మీడియాలో విశృంఖలత్వం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులు, నేరారోపణలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు.

సూర్య 41 బ్యాటింగ్!



- మార్చిలోనే అల్లాడిస్తున్న భానుడు
- నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో 41.1 డిగ్రీలు
- పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలపైనే నమోదు
- మరో 5 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలే..
- వడదెబ్బతో 'ఉపాధి' కూలీ మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్):

టీ20 బ్యాట్స్‌మన్‌లా సూరీడు చెలరేగిపోతున్నాడు..! మార్చిలోనే అధిక ఉష్ణోగ్రతల బౌండరీలను దాటేస్తున్నాడు.. పనులపై బయటకు వచ్చే ప్రజలను బాదేస్తున్నాడు.. మొన్నటి దాకా 40 (డిగ్రీలు)ల్లోనే ఉన్న అతడు.. ఇప్పుడు 41 కూడా దాటేశాడు..! భానుడి భగభగలతో రాష్ట్రం మండిపోతోంది. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే మే వరకు ఇంకెలా ఉంటుందోనని జనం ఉలిక్కిపడుతున్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో అత్యధికంగా 41.1, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో 41 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆసిఫాబాద్‌లో 40.9, ఆదిలాబాద్ జిల్లా చప్రాలా, జగిత్యాల జిల్లా వెల్గటూర్ 40.8, సూర్యాపేట జిల్లా కీతవారిగూడెం, నిజామాబాద్ జిల్లా కోరటపల్లి 40.7, సిద్దిపేట, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో 40.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని.. సగటున 2-3 డిగ్రీల వరకు ఎండలు పెరిగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణమే ఉంటుందని వెల్లడించింది. మరోవైపు, జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం వల్లూరుకు చెందిన చిన్న కృష్ణ (55) వడదెబ్బతో మరణించాడు. ఉపాధి హామీ పనులకు వెళ్లే చిన్నకృష్ణ.. శనివారం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆయన్ను స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించగా.. కోలుకున్నాడు. అయితే అదేరోజు అర్ధరాత్రి అతడి పరిస్థితి విషమించి మరణించాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

వైద్యానికి ఇన్‌చార్జులు!

పదేళ్లుగా రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖకు హెచ్‌వోడీలు కరువు

రెగ్యులర్ పోస్టులను క్రియేట్ చేయని గత ప్రభుత్వం

- కొత్త సర్కారు ఏర్పాటయ్యాక అదే తీరు
- విభజన వేళ సింగిల్ పోస్టులన్నీ ఏపీకే
- రాష్ట్రంలో డీహెచ్, టీవీవీపీ కమిషనర్, డీసీఏ డైరెక్టర్ పోస్టులకు ఇన్‌చార్జులే



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యానికి గురవుతోంది. క్షేత్రస్థాయిలో ప్రతిరోజూ పర్యవేక్షిస్తే తప్ప.. ప్రజలకు వైద్య సేవలు సరిగా అందని పరిస్థితి ఉండే శాఖలో కీలక విభాగాలకు రెగ్యులర్ అధికారులు లేకుండా పోయారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా ఇన్‌చార్జులే దిక్కు అవుతున్నారు. ఆయా విభాగాలకు రెగ్యులర్ పోస్టులను సృష్టించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సర్కారు కూడా బీఆర్ఎస్ వారసత్వాన్నే కొనసాగిస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు దాటిపోయినా పోస్టుల క్రియేషన్ ముందుకు సాగడంలేదు. పైగా గత ప్రభుత్వం నియమించిన వారినే ఇంకా ఇన్‌చార్జులుగా కొనసాగిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖలో కీలకమైన రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు (డీహెచ్), తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. వీటిలో డీహెచ్ పోస్టు అత్యంత కీలకమైనది. డీహెచ్ పరిధిలో వివిధ కేడర్ల కింద సుమారు 18 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుంటారు. అయితే ఈ కీలక పోస్టు.. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా తెలంగాణలో ఆ పోస్టును క్రియేట్ చేయలేదు. తొమ్మిదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. 2014 నుంచి ఆ కీలక పోస్టును ఇంచార్జులతోనే నెట్టుకొచ్చింది. పదేళ్లలో ఏడుగురు ఇన్‌చార్జులను మార్చింది. రాష్ట్ర విభజన జరిగినే వెంటనే తొలుత డాక్టర్ చంపాను ఇన్‌చార్జి డీహెచ్‌గా నియమించగా.. ఆయన 2014 జూన్ 2 నుంచి ఆ ఏడాది జూలై 31 వరకు పనిచేశారు. అనంతరం డాక్టర్ పి.సాంబశివరావు ఇన్‌చార్జి డీహెచ్‌గా 2015 జనవరి 22 వరకు పనిచేశారు. ఆ తర్వాత ఐఏఎస్ అధికారి బుద్ధప్రకాశ్ ఎం.జ్యోతికి సర్కారు డీహెచ్ బాధ్యతలు అప్పగించింది. ఆయన 2015 జనవరి 22 నుంచి మే 26 వరకు పనిచేశారు. అనంతరం ఇన్‌చార్జి డీహెచ్‌గా వచ్చిన డాక్టర్ లలిత కుమారి 2015 మే 27 నుంచి 2018 మార్చి 31 వరకు పనిచేశారు. ఆమె రిటైర్డ్ అవ్వగానే ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణకు డీహెచ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వాకాటి కరుణకు బాధ్యతలపై విమర్శలు..

వాకాటి కరుణ డీహెచ్‌గా 2018 ఏప్రిల్ 1 నుంచి ఆ ఏడాది మే 27 వరకు పనిచేశారు. అప్పటికే ఆమె వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయినా నాటి సర్కారు అదనంగా డీహెచ్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా ఆమెకే అప్పగించింది. అయితే ఒక్కరికే ఇన్నేసి పోస్టులివ్వడంపై పెద్ద యెత్తున విమర్శలు రావడంతో ఆమెను తప్పించి డాక్టర్ గడల శ్రీనివాసరావుకు డీహెచ్‌గా కేసీఆర్ సర్కారు బాధ్యతలు అప్పగించింది. ఆయన 2018 మే 28 నుంచి 2023 డిసెంబరు 20 వరకు పనిచేశారు. గతేడాది డిసెంబరులో జరిగిన సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్కారు పోయి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇన్‌చార్జి డీహెచ్‌గా ఉన్న గడల శ్రీనివాసరావుతోపాటు ఇన్‌చార్జి డీఎంఈగా ఉన్న డాక్టర్ రమేశ్‌రెడ్డిని ఒకేరోజు తొలగించింది. ఆ తర్వాత సీనియారిటీలో జాబితాలో ముందున్న డాక్టర్ రవీంద్రనాయక్‌ను ఇన్‌చార్జి డీహెచ్‌గా నియమించింది. మొత్తంగా గత దశాబ్ద కాలంగా నాటి బీఆర్ఎస్‌తోపాటు నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెగ్యులర్ పోస్టును క్రియేట్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యం ఎంతో కీలకమైనది. రోజూ పర్యవేక్షిస్తే తప్ప క్షేత్రస్థాయిలో వైద్య సేవలు సరిగా అందని పరిస్థితి ఉంటుంది. పైగా వైద్యులు, స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, హెల్త్ సూపర్‌వైజర్స్, హెల్త్ ఎడ్యుకేటర్స్ లాంటి పోస్టులుంటాయి. వీరితోపాటు అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పనిచేసేవారూ ఉంటారు. వారికి రెగ్యులర్‌గా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, సర్వీస్ నిబంధనలు, విజిలెన్స్ కేసులు లాంటి అంశాలను రెగ్యులర్‌గా పర్యవేక్షించాల్సి ఉంటుంది. కొన్ని అంశాల విషయంలో ఇన్‌చార్జులుగా ఉన్నవారు తక్షణమే నిర్ణయం తీసుకోలేని పరిస్థితులుంటాయి. రెగ్యులర్‌గా ఉన్నవారే విధానపరమైన నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

సమస్యలకు దొరకని పరిష్కారం..

ఇన్‌చార్జి అధికారుల కారణంగా కొన్ని సమస్యలకు గత పదేళ్లుగా పరిష్కారం దొరకడం లేదని వైద్యశాఖ ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికైనా డీహెచ్ పోస్టును క్రియేట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోస్టు క్రియేట్ చేసి వెంటనే డీపీసీ పెట్టి, రెగ్యులర్ డీహెచ్‌ను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ), తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ (టీవీవీపీ) పోస్టులు కూడా రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి వెళ్లిపోయాయి. అయితే డీఎంఈ పోస్టును కూడా గత సర్కారు క్రియేట్ చేయలేదు. దీనిపై డీఎంఈ పరిధిలోని సీనియర్లు కోర్టుకు వెళ్లారు. పోస్టు క్రియేట్ చేయాలని దాదాపు ఎనిమిదేళ్లపాటు న్యాయ పోరాటం చేశారు. ఆ విషయంలో హైకోర్టు కూడా గత సర్కారుపై సీరియస్ అయింది. దీంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో డీఎంఈ పోస్టును క్రియేట్ చేసింది. ఇక టీవీవీపీ కమిషనర్ పోస్టును, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పోస్టును కూడా ప్రభుత్వం క్రియేట్ చేయాల్సివుంది. ఆయ స్థానాల్లో ఇప్పటికీ ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నారు. నర్సింగ్ కౌన్సిల్‌ది మరీ దారుణం. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి దాకా ఒక్కరే ఆ పోస్టులో కొనసాగుతున్నారు. పదేళ్లుగా ఒక్కరే ఇన్‌చార్జిగా ఉండటం వెనుక ఉన్నతాధికారులను, ప్రభుత్వ పెద్దల్ని మేనేజ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమర్థత ఆధారంగా హెచ్‌వోడీ పోస్టులు

ప్రస్తుతం వైద్యశాఖలో సీనియారిటీ ఆధారంగా హెచ్‌వోడీ పోస్టులను భర్తీ చేయాలనే ఆలోచనలో కాంగ్రెస్ సర్కారు ఉంది. కొత్తగా అధికార పగ్గాలు చేపట్టగానే డీఎంఈ, డీహెచ్ పోస్టులకు సీనియారిటీలో ముందున్న వారిని ఇన్‌చార్జులుగా నియమించింది. దీనివల్ల లాభం కంటే ఎక్కువగా నష్టం జరుగుతుందని కొద్దిరోజులకే ప్రభుత్వానికి తెలిసివచ్చింది. అందుకే సీనియారిటీ జాబితాలో మొదటి స్థానంలో ఉన్న ఇన్‌చార్జి డీఎంఈగా ఉన్న డాక్టర్ త్రివేణిని మార్చి.. డాక్టర్ వాణికి బాధ్యతలు అప్పగించారు. అలాగే డీహెచ్‌గా సీనియారిటీ జాబితాలో మొదటి స్థానంలో ఉన్న రవీంద్రనాయక్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. కొద్దిరోజుల్లోనే ఆయనపై తీవ్ర ఆరోపణలు వినిపించడమే కాకుండా, కొందరు నేరుగా వైద్యశాఖ మంత్రికే ఫిర్యాదు చేసి, తక్షణమే ఆయన్ను మార్చాలని డిమాండ్ చేశారు. ఇకనైనా రెగ్యులర్ హెచ్‌వోడీ పోస్టులను క్రియేట్ చేసి, సీనియారిటీ ప్రకారం కాకుండా సెలక్షన్ జాబితాను రూపొందించి, అందులో సమర్థులైన అధికారులను గుర్తించి, వారినే హెచ్‌వోడీగా ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. అందుకు అవసరమైన సర్వీస్ రూల్స్‌ను మార్చాలని చెబుతున్నారు.

ఆ పోస్టులను తక్షణమే క్రియేట్ చేయాలి

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అయినా ఇంతవరకు డీహెచ్, టీవీవీపీ కమిషనర్ లాంటి హెచ్‌వోడీ పోస్టులను గత సర్కారు క్రియేట్ చేయలేదు. ఈ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఇన్‌చార్జుల పేరుతో తమకు నచ్చిన వ్యక్తులను ఆ పోస్టుల్లో కూర్చోబెట్టింది. పదేళ్లపాటు వారితోనే నడిపించింది. ఇప్పుడు ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ సర్కారైనా ఆ పోస్టులను తక్షణమే క్రియేట్ చేయాలి. అలాగే డీహెచ్ పరిధిలోని డీఎంహెచ్‌వోలు, టీవీవీపీ పరిధిలోని డీసీహెచ్ఎస్ పోస్టులను కూడా వెంటనే క్రియేట్ చేయాలని సర్కారును డిమాండ్ చేస్తున్నాం.

- డాక్టర్ రమేశ్, చైర్మన్, మెడికల్ జేఏసీ

జగన్ పత్రికపై 20కోట్లకు దావా!

- పరువు నష్టం నోటీసు పంపిన బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి



అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రికపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరువు నష్టం దావాకు సిద్ధమయ్యారు. విశాఖలో డ్రగ్స్ దిగుమతి వ్యవహారానికి సంబంధించి తనపై ఉద్దేశ పూర్వకంగా తప్పుడు రాతలు రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ సోదాలు నిర్వహించిన సంధ్య ఎక్స్‌పోర్ట్స్‌లో పురందేశ్వరి కుటుంబ సభ్యులకు భాగస్వామ్యం ఉందంటూ జగన్ సొంత పత్రిక ఆధార రహిత వార్తలు ప్రచురించిందని ఆమె ఆరోపించారు. తప్పుడు కథనాలపై న్యాయ పోరాటానికి సిద్ధమైన పురందేశ్వరి... రూ.20కోట్లకు ఆ పత్రిక యాజమాన్యానికి పరువు నష్టం నోటీసులు పంపారు. సంధ్య ఎక్స్‌పోర్ట్ ఎండీ వీరభద్రరావుతో వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు రాయడం వెనుక దురుద్దేశం ఉందని, కూనం కుటుంబంతో తనకు బంధుత్వం, వ్యాపార భాగస్వామ్యం... ఏదీ లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న తనను డ్రగ్స్ వ్యాపారాలకు సంబంధించిన కంపెనీల్లో భాగస్వామి అనడం రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయడమేనని ఆమె పేర్కొన్నారు. తన గౌరవ, ప్రతిష్ఠల్ని మంటగలిపేందుకు ఇలాంటి తప్పుడు కథనాలను ప్రచురించారని పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యవహారంతో సంబంధం లేదని వివరణ ఇచ్చినా పదేపదే అవే రాతలు రాయడం వెనుక ఉన్న తన పరువుకు భంగం కలిగించే ఉద్దేశమేనని పురందేశ్వరి నోటీసులో వివరించారు.

వైసీపీకి మరో ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు గుడ్‌బై

వరప్రసాద్ బీజేపీలో చేరిక.. కాంగ్రెస్‌లోకి ఎలీజా

న్యూఢిల్లీ/అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మరో ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు... గూడూరు (ఎస్సీ) ఎమ్మెల్యే, విశ్రాంత ఐఏఎస్ అధికారి వరప్రసాద్, చింతలపూడి (ఎస్సీ) శాసనసభ్యుడు ఉన్నమట్ల రాకాడ ఎలీజా ఆ పార్టీకి రాజీనామా చేశారు. సిటింగ్ ఎమ్మెల్యేనైన తనను కాదని మేరుగ మురళీధర్‌కు గూడూరు టికెట్ ఇవ్వడంతో వరప్రసాద్ మనస్తాపం చెందారు. వైసీపీకి రాజీనామా చేసి.. ఆదివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ సమక్షంలో బీజేపీలో చేరారు. తిరుపతి స్థానం బీజేపీ అభ్యర్థిగా పోటీచేయనున్నట్టు తెలిసింది. ఆ పార్టీ నాయకత్వం కూడా హామీ ఇచ్చినట్టు సమాచారం. ఇంకో వైపు.. చింతలపూడి వైసీపీ టికెట్ కంభం విజయరాజుకు ఇవ్వడంతో ఎలీజా కూడా ఆ పార్టీ నుంచి వైదొలిగారు. ఆదివారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు.

నర్సింగ్ విద్యార్థులకు నీట్ గండం!

ఇంటర్ అర్హతతో భర్తీ కాని సీట్లలో మేనేజ్‌మెంట్ కోటాలో వెయ్యి మందికిపైగా అడ్మిషన్

- వీరికి నీట్ ర్యాంక్ లేదని గుర్తించేందుకు నిరాకరిస్తున్న కాళోజీ హెల్త్ వర్సిటీ
- గందరగోళంలో వెయ్యి మంది భవితవ్యం

వరంగల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అమలు చేస్తున్న నిబంధనలతో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారుతోంది. బీఎస్సీ నర్సింగ్‌లో చేరేందుకు కన్వీనర్ కోటాలో ఎంసెట్ ర్యాంకు, మేనేజ్‌మెంట్ కోటాలో నీట్ ర్యాంక్‌ను అర్హతగా నిర్ణయించి అడ్మిషన్లు చేపట్టారు. దీంతో నర్సింగ్ విద్యకు అనేక మంది దూరమయ్యారు. అయితే కన్వీనర్ కోటాలో మిగిలిన వెయ్యికిపైగా అన్‌ఫిల్డ్ సీట్లలో ఇంటర్ అర్హతతో కొందరు విద్యార్థులు ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో అడ్మిషన్లు పొందారు. మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన వీరికి నీట్ ర్యాంకు లేనందున తాము గుర్తించలేమంటూ హెల్త్‌వర్సిటీ అధికారులు తిరకాసు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీఎస్సీ నర్సింగ్‌లో అడ్మిషన్లకు ఎంసెట్, నీట్ ర్యాంకులు అవసరంలేదని ఈ మధ్య ఆదేశాలు జారీ చేసింది. వీటిని బేఖాతరు చేస్తూ మిగిలిన (అన్‌ఫిల్డ్) సీట్లలో చేరిన విద్యార్థులకు గుర్తింపు ఇవ్వకుండా హెల్త్‌వర్సిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. అంతేగాక మే 15, 17 తేదీల్లో ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు తాజాగా నోటిఫికేషన్ విడుదలచేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని అన్‌ఫిల్డ్ సీట్లలో చేరిన విద్యార్థులు కోరుతున్నారు.

ఏం జరిగిందంటే..

నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ విద్యపై కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నిబంధనలు విద్యార్థులకు శాపంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా 112 బీఎస్సీ నర్సింగ్ కాలేజీలు (21 ప్రభుత్వ 91 ప్రైవేట్) ఉండగా.. వీటిలో 6,720 సీట్లున్నాయి. ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో 60% కన్వీనర్ కోటా కింద సీట్లు భర్తీ చేస్తారు. గతంలో ఇంటర్ మార్కుల ఆధారంగా బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలిచ్చేవారు. అయితే 2023-24 నుంచి కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (సెట్) నిర్వహించి.. ర్యాంకుల ఆధారంగా అడ్మిషన్లు ఇవ్వాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) హెల్త్‌వర్సిటీలకు సూచించింది. అయితే ఈ సెట్ నిర్వహించకుండా నీట్ లేదా ఎంసెట్‌లో ర్యాంకుల ఆధారంగా బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలు కల్పించాలని కాళోజీ వర్సిటీ నిర్ణయించింది. అలాగే కన్వీనర్ కోటాలో సీట్లు పొందే విద్యార్థులకు వర్సిటీ అధికారులు కొత్త నిబంధనలు తెచ్చారు. తొలుత ఎంసెట్‌లో 63వేల ర్యాంకు కటాఫ్‌గా నిర్ణయించడంతో చాలామంది విద్యార్థులు కన్వీనర్ కోటాలో అడ్మిషన్లు పొందలేకపోయారు. ఈ నిబంధన ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేదని, కేవలం కాళోజీ వర్సిటీ అధికారులు ఈ నిబంధన తెచ్చారంటూ విద్యార్థుల ఆందోళన వ్యక్తం చేయడంతో.. అడ్మిషన్లలో ఎంసెట్ లేదా నీట్‌లో ఏదో ఒకదాన్ని పరిగణనలోకి తీసుకోవాలని లేదా ప్రత్యేకంగా ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించాలని ఐఎన్‌సీ.. యూనివర్సిటీ అధికారులకు లేఖ రాసింది. ఈ లేఖను పరిగణనలోకి తీసుకోకుండా కన్వీనర్ కోటాలో ఎంసెట్ ర్యాంకు (63వేల కటా ఫ్‌తో), మేనేజ్‌మెంట్ కోటాలో నీట్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుని అడ్మిషన్లు చేపట్టారు. వర్సిటీ అధికారుల నిర్ణయంతో చాలా మంది విద్యార్థులు బీఎస్సీ నర్సింగ్‌లో 2023-24లో అడ్మిషన్లకు దూరమయ్యారు. గత ఏడాది అక్టోబరు 1 నుంచి 4వ తేదీ వరకు తొలి విడత, అక్టోబరు 14నుంచి 17వరకు రెండో విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా పూర్తిస్థాయిలో భర్తీ కాకపోవడంతో చివరకు ఎంసెట్‌లో 63వేల కటాఫ్ ర్యాంకును ఎత్తివేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా అడ్మిషన్లు పూర్తికాకపోవటంతో మిగిలిన సీట్ల (అన్‌ఫిల్డ్ /ఓవర్ లిస్టు)ను మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ చేసుకునే అవకాశం కల్పించారు. ఇంటర్ మెరిట్ ఆధారంగా ప్రైవేట్ నర్సింగ్ కాలేజీల్లో అన్‌ఫిల్డ్ సీట్లలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. ఇలా వెయ్యి మందికి పైగా విద్యార్థులు డిసెంబరులోనే అడ్మిషన్లు పొంది తరగతులకు హాజరవుతున్నారు. వీరి జాబితాను ఆయా కాలేజీలు కాళోజీ వర్సిటీకి ఫిబ్రవరి 3న పంపగా.. నీట్ ర్యాంకు ఆధారంగా అన్‌ఫిల్డ్ సీట్లను భర్తీ చేయలేదని వర్సిటీ అధికారులు కొర్రీలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని బాధిత విద్యార్థులు కోరుతున్నారు.

రఘురామరాజుకు నిరాశే!

- నరసాపురంలో శ్రీనివాసవర్మ, రాజమండ్రిలో పురందేశ్వరి
- బీజేపీ అభ్యర్థుల జాబితా వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన పార్టీలతో పొత్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో తనకు దక్కిన ఆరు లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం రాత్రి విడుదల చేసిన జాబితాలో నరసాపురం వైసీపీ ఎంపీ కె.రఘురామకృష్ణంరాజుకు చోటు దక్కలేదు. తాను ఆశించిన నరసాపురం పార్లమెంటరీ స్థానంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మకు టికెట్ లభించడంతో ఆయన తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమండ్రి నుంచి బరిలోకి దిగనున్నారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేటలో, కొత్తపల్లి గీత-అరకు(ఎస్టీ), సీఎం రమేశ్-అనకాపల్లి, వైసీపీకి రాజీనామా చేసి వచ్చిన వరప్రసాద్ తిరుపతి (ఎస్సీ)లో పోటీచేయనున్నారు. పది అసెంబ్లీ స్థానాలకు బీజేపీ నాయకత్వం సోమవారం అభ్యర్థులను ప్రకటించనుంది. కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరికి విజయవాడ పశ్చిమ, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్-ధర్మవరం, ఆదినారాయణరెడ్డి-జమ్మలమడుగు, కామినేని శ్రీనివాస్-కైకలూరు, విష్ణుకుమార్‌రాజు-విశాఖ ఉత్తరం, నడికుదిటి ఈశ్వరరావు-ఎచ్చెర్ల, ఉమామహేశ్వరరావు-పాడేరు, పార్థసారథి-ఆదోని, పనతల సురేశ్‌కు బద్వేలు స్థానం కేటాయించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.

రాజకీయాలు క్రూరం: రఘురామ

రాజకీయాలు క్రూరంగా ఉంటాయని తెలిసినప్పటికీ ఇప్పుడు ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చిందని రఘురామరాజు వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. నరసాపురం టికెట్ రానందుకు తన అభిమానులు మనస్తాపం చెందవద్దని.. తాను ఎన్నికల బరిలో లేకపోయినా ఎన్డీయే విజయంసాధిస్తుందని, చంద్రబాబు అధికారంలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

టీడీపీ గెలుపు.. మాదిగల గెలుపు

- మందకృష్ణ మాదిగతో భేటీలో చంద్రబాబు
- ఎన్డీయేకు మద్దతు ప్రకటించిన ఎంఆర్‌పీఎస్

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గెలిస్తే, మాదిగలు గెలిచినట్లేనని, టీడీపీతో మాదిగలది శాశ్వత బంధమని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ చంద్రబాబుతో భేటీ అయ్యారు. చంద్రబాబుకు పలు అంశాలతో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మాదిగ వర్గ ప్రజల అభ్యున్నతికి మొదటి నుంచి పనిచేసిన పార్టీ తెలుగుదేశం అని తెలిపారు. తెలుగుదేశం విజయంలో మాదిగలు కీలకపాత్ర పోషించాలని కోరారు. 40 ఏళ్లుగా పార్టీని మాదిగ సామాజికవర్గం ఆదరిస్తోందన్నారు. అలాంటి మాదిగ వర్గాన్ని పైకి తెచ్చేందుకు తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తెలుగుదేశం గెలుపు మాదిగల గెలుపు అవుతుందన్నారు. మాదిగ సామాజికవర్గాన్ని అధికారంలో భాగస్వాములు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ సమస్యలపై మందకృష్ణ ప్రత్యేకంగా చర్చించారు. దళితులపై వైసీపీ ప్రభుత్వ దమనకాండను ఎదుర్కోవడంలో మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.